ప్రకటనల కోసం
సంప్రదించండి
98483 28698

తెలంగాణ స్వరాష్ట్ర సమరయోధ పత్రిక
Estd : 2002
# జనంసాక్షి
www.janamsakshi.org
శనివారం 11.07.2026 | సంపుటి :12 సంచిక : 352 | పేజీలు :12 వెల : రూ. 4/-
RNI NO.TELTEL / 2013 /50370




హైదరాబాద్ | Simultaneously Published from Hyderabad & Karimnagar | ఎడిటర్ : ఎం.ఎం. రహమాన్

## చావడానికైనా సిద్ధమే

- బంగ్లాదేశ్ వెళ్లి కోర్టులో లొంగిపోతా
- షేక్ హసీనా కీలక వ్యాఖ్యలు



న్యూఢిల్లీ(జనంసాక్షి):బంగ్లాదేశ్ మాజీ ప్రధాని షేక్ హసీనా కీలక వ్యాఖ్యలు చేశారు. తాను స్వదేశానికి వెళ్లి కోర్టు ముందు లొంగిపోయేందుకు సిద్ధంగా ఉన్నానని వెల్లడించారు. అక్కడ తన ప్రాణాలకు ముప్పు ఉన్నప్పటికీ.. స్వదేశానికి వెళ్లే యోచనలో ఉన్నానని చెప్పారు. ఓ అంతర్జాతీయ వార్తా సంస్థకు ఇచ్చిన ఇంటర్వ్యూలో

మిగతా 2లో..

భద్రాద్రి రాముడిపైన ఆన.. ఒట్టేసి చెబుతున్నా..



# మళ్లీ అధికారం మాదే..

## వచ్చే అసెంబ్లీ ఎన్నికల్లో 117 సీట్లు మావే

- తెలంగాణలో 20 ఎంపీ సీట్లు గెలిపిస్తే రాహుల్ ప్రధాని కావడం ఖాయం
- కల్వకుంట్ల కుటుంబాన్ని పాతాళానికి తొక్కేవరకు విశ్రమించం
- బావాబామ్మర్దులు కలసి ఊరుమీద పడి తిరుగుతున్నారు
- కేసీఆర్‌ను ఫామ్‌హౌజ్‌కే పరిమితం చేశాం
- భాజపాతో హరీశ్‌రావు మంతనాలు జరుపుతున్నారు
- మధిర రైతు ఆశీర్వాద సభలో సీఎం రేవంత్
- భరోసా నిధులు విడుదల ముఖ్యమంత్రి



ఖమ్మం జిల్లా మధిర రైతు ఆశీర్వాద సభలో రైతుభరోసా నిధులను విడుదల చేస్తున్న సీఎం రేవంత్. చిత్రంలో భట్టి, పొంగులేటి, ఉత్తమ్, శ్రీధర్‌బాబు, తుమ్మల నాగేశ్వర్‌రావు తదితరులు

మధిర,జూలై10(జనంసాక్షి):వచ్చే ఎన్నికల్లో మళ్లీ కాంగ్రెస్‌దే అధికారమని సిఎం రేంవత్ రెడ్డి ధీమా వ్యక్తం చేశారు. ఇదే సందర్భంగా సీఎం రేవంత్‌రెడ్డి కీలక వ్యాఖ్యలు చేశారు. రాష్ట్రంలో శాసనసభ ఎన్నికలు 2028 డిసెంబర్‌లో జరగవని చెప్పారు. అసెంబ్లీ స్థానాల సంఖ్య 119 నుంచి 182కి.. లోక్‌సభ స్థానాలు 17 నుంచి 26కి పెరుగుతాయని చెప్పారు. 2029 మే-జూన్‌లో శాసనసభ ఎన్నికలు జరుగుతాయని చెప్పారు. 182 స్థానాల్లో 117 సీట్లకు పైగా గెలుస్తామని.. ఇది భద్రాచలం రాముడిపై ఆన అని రేవంత్ వ్యాఖ్యానించారు. రైతుభరోసా తుది విడత సాయం పంపిణీ సందర్భంగా ఖమ్మం జిల్లా మధిర నియోజకవర్గం జగన్నాథపురం లో నిర్వహించిన బహిరంగ సభలో సీఎం మాట్లాడారు. ఈ సందర్భంగా మాజీ సీఎం కేసీఆర్, బీఆర్ఎస్, భాజపాపై విమర్శలు చేశారు. ఇక్కడి ప్రజలను చూస్తే నా గుండె పులకిస్తోంది. రాజకీయంగా నాకు పాలమూరు ప్రాణం. నా రాజకీయ ఎదుగుదలలో ఖమ్మం గుండెకాయగా పనిచేసింది.

మిగతా 2లో..

వచ్చే పార్లమెంట్ సమావేశాల్లో డీ లిమిటేషన్ బిల్లు ఆమోదించుకునేందుకు బీజేపీ ప్రయత్నిస్తోంది. వచ్చే శాసనసభ ఎన్నికలు 2028 డిసెంబర్‌లో జరగవు. 2029 మే, జూన్‌లో జరుగుతాయి. అసెంబ్లీ సీట్లు 119 నుంచి 182కు, ఎంపీ సీట్లు 17 నుంచి 26కు పెరుగుతాయి. వచ్చే ఎన్నికల్లో 117 సీట్లు గెలిచి మళ్లీ అధికారంలోకి వస్తాం. 117 సీట్లు గెలుస్తామని భద్రాచలం రాముడి మీద ఆన

- ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి

## నిర్ణీత గడువులోగా సర్

### ప్రక్రియను త్వరగా పూర్తి చేయాలి

### ఉప ఎన్నికల కమిషనర్ డా. పవన్ కుమార్ శర్మ

హైదరాబాద్,జూలై10(జనంసాక్షి): స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ (ఎస్ఐఆర్) ప్రక్రియను నిర్ణీత గడువులోగా పూర్తి చేయాలని భారత ఎన్నికల కమిషన్ సీనియర్ ఉప ఎన్నికల కమిషనర్ డా. పవన్ కుమార్ శర్మ సంబంధిత అధికారులకు సూచించారు. రాష్ట్రంలో కొనసాగుతున్న సర్ ప్రక్రియపై పవన్ కుమార్ శర్మ నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్ లో రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి సి. సుదర్శన్ రెడ్డి, జిహెచ్ఎంసి కమిషనర్, హైదరాబాద్ జిల్లా ఎన్నికల అధికారి, అన్ని జిల్లాల ఎన్నికల అధికారులు(డిఇఓలు), ఓటరు జాబితా పరిశీలకులు పాల్గొన్నారు. సందర్భంగా పవన్ కుమార్ శర్మ మాట్లాడుతూ ఎన్యుమరేషన్ ఫారాల పంపిణీ, సేకరణ, డిజిటలైజెషన్ ప్రక్రియలను వేగవంతం చేసి సకాలంలో పూర్తి




చేయాలని ఆదేశించారు. ముఖ్యం గా హైదరాబాద్, రంగారెడ్డి, మేడ్చల్- మల్కాజ్‌గిరి, సంగారెడ్డి, వికారాబాద్ జిల్లాల్లో డిజిటలైజేషన్ ప్రక్రియను మరింత వేగవంతం చేయాలని ప్రత్యేకంగా ఆదేశించారు. సర్ ప్రక్రియలో అత్యుత్తమ పనితీరును కనబరిచిన జిల్లాల ఎన్నికల అధికారులతో కమిషన్ మాట్లాడి, వారు అనుసరిస్తున్న ఉత్తమ విధానాలను తెలుసుకుంది. ఆ వ్యూహాలను

మిగతా 2లో..

భద్రాద్రి రాముడి సాక్షిగా..

## సంపూర్ణ రుణమాఫీ ఏమైంది?

### ఖమ్మం సభలో అబద్ధాలతో మభ్య పెట్టారు: హరీశ్



హైదరాబాద్,జూలై10(జనంసాక్షి): ఖమ్మం జిల్లాలో నిర్వహించిన రైతు ఆశీర్వాద సభలో సీఎం రేవంత్‌రెడ్డి చేసిన వ్యాఖ్యలపై మాజీ మంత్రి హరీశ్‌రావు ఘాటుగా స్పందించారు. మాట తప్పడం, పార్టీలు మారడం రేవంత్‌రెడ్డి సంస్కృతి అని.. తనది కాదని విమర్శించారు. తమ ఇద్దరి రాజకీయ చరిత్రే దీనికి నిదర్శనమన్నారు. రేవంత్‌రెడ్డిలా ఒట్టు వేసి ఓ మాట.. వేయకుండా ఓ మాట చెప్పను. భద్రాద్రి రాముడి సాక్షిగా సంపూర్ణ రుణమాఫీ చేస్తానన్న హామీ ఏమైందని నిలదీసారు. రాష్ట్రం సంగతి పక్కన పెట్టండి.. కనీసం ఖమ్మం జిల్లాలోనైనా రుణమాఫీ చేశారా అని

మిగతా 2లో..




## ఈ20 పెట్రోల్‌తో మైలేజీ తగ్గేమాట వాస్తవమే..

కానీ దీనితో చేకూరే లబ్ధిని, ఇతర అనుకూల విషయాలనూ పరిగణలోకి తీసుకోవాలి : కేంద్ర ప్రభుత్వం

న్యూఢిల్లీ(జనంసాక్షి): 20 శాతం ఇథనాల్ బ్లెండ్ చేసిన ఈ20 పెట్రోల్ వాడకం వల్ల కొన్ని వాహనాలలో మైలేజీ తగ్గే మాట వాస్తవమే అని కేంద్ర చమురు మంత్రిత్వ శాఖ అంగీకరించింది. అదే సమయంలో అధిక ఆక్టేన్ రేటింగ్, అధిక పికప్, కర్బన ఉద్గారాల తగ్గింపు వంటి ప్రయోజనాలను విస్మరించకూడదని పేర్కొంది. ఇథనాల్ కలిపిన పెట్రోల్ ప్రోగ్రామ్‌పై విమర్శలు వస్తున్న వేళ చమురు మంత్రిత్వ శాఖ 'సందేహాలు- సమాధానాలు' పేరుతో ఒక డాక్యుమెంట్‌ను శుక్రవారం విడుదల చేసింది. ఈ20 పెట్రోల్ వినియోగాన్ని

మిగతా 2లో..

## 15 నుంచి ఈహెచ్ఎస్ హెల్త్ కార్డులు

### తెలంగాణ ప్రభుత్వ ఉద్యోగులు, పెన్షనర్లకు కాంగ్రెస్ ప్రభుత్వం గుడ్‌న్యూస్

హైదరాబాద్,జూలై10(జనంసాక్షి): తెలంగాణ ప్రభుత్వ ఉద్యోగులు, పెన్షనర్లకు కాంగ్రెస్ ప్రభుత్వం గుడ్ న్యూస్ చెప్పింది. ఏళ్లుగా ఎదురుచూస్తున్న ఎంప్లాయిస్ హెల్త్ స్కీమ్ (ఈహెచ్ఎస్) హెల్త్ కార్డులను జులై 15 నుంచి అమల్లోకి తీసుకురానున్నట్లు ప్రభుత్వం ప్రకటించింది. ఈ మేరకు ప్రభుత్వ ప్రధాన కార్యదర్శితో ఉద్యోగ సంఘాల ప్రతినిధులు శుక్రవారం నిర్వహించిన సమావేశంలో నిర్ణయం తీసుకున్నారు. ఈహెచ్ఎస్ అమలుతో ప్రభుత్వ ఉద్యోగులు, పెన్షనర్లు ఎంపిక చేసిన ఆస్పత్రుల్లో నగదు రహిత వైద్య సేవలు పొందే అవకాశం కలగనుంది. ఈ పథకాన్ని మరింత సమర్థవంతంగా అమలు చేసేందుకు ప్రభుత్వం రాష్ట్ర వ్యాప్తంగా అన్ని జిల్లా కేంద్రాల్లో వెల్‌నెస్ సెంటర్లను

మిగతా 2లో..




## నీటిపారుదల మంత్రిగా ఉండి హరీశ్ చేసిందేమిటి?

- ముందు ఆయన కాంగ్రెస్‌లో చేరితే ఆ తరవాత ఆలోచిస్తాం
- హరీశ్‌రావు వ్యాఖ్యలపై మండిపడ్డ పీసీసీ చీఫ్ మహేశ్ కుమార్ గౌడ్
- బీఆర్ఎస్ నిధులపై కవిత వ్యాఖ్యల్లో నిజముందని వెల్లడి

హైదరాబాద్,జూలై10(జనంసాక్షి):మూడు నెలలు నీటిపారుదల మంత్రిగా అవకాశం ఇస్తే నీటి సమస్యను పరిష్కరించి చూపిస్తానంటూ బీఆర్ఎస్ మాజీ మంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే హరీశ్ రావు చేసిన వ్యాఖ్యలపై టీపీసీసీ చీఫ్ మహేశ్ కుమార్ గౌడ్ స్పందించారు. ముందు ఆయన కాంగ్రెస్‌లో చేరితే ఆ తరవాత ఆలోచిస్తామని అన్నారు. శుక్రవారం గౌడ్ మీడియాతో మాట్లాడుతూ.. హరీశ్ రావు నిజంగా కాంగ్రెస్‌లోకి వస్తానంటే పార్టీలో చర్చిస్తామన్నారు. పొలిటికల్ ఎఫైర్స్ కమిటీలో చర్చించి హరీశ్‌ను చేర్చుకోవాలా? వద్దా? అని నిర్ణయం తీసుకుంటామని తెలిపారు. పదేండ్లు ఏం చేయని వారు మూడు నెలల సమయంలో ఏం చేస్తారని అన్నారు. హరీశ్‌రావు పదేళ్లు మంత్రిగా ఉండి ఏం చేశారు? ఆయన జలవనరులశాఖ మంత్రిగా ఉన్నప్పుడు నిర్మించిన ప్రాజెక్టే కుంగింది.. దాని గురించి ఏం చెప్పాలి. పదేళ్లు మంత్రిగా ఉంటూ ఏం చేశారు?.. మళ్లీ మూడు నెలలు ఎందుకు? బీఆర్ఎస్ పార్టీ నిధులపై తెలంగాణ రక్షణ సేన అధ్యక్షురాలు కవిత చేసిన ఆరోపణల్లో నిజముంది. ఒక ప్రాంతీయ పార్టీకి రూ.1,400 కోట్లు ఎలా వచ్చాయి?



మిగతా 2లో..

# కమీషన్ల కోసమే కాళేశ్వరం

## అందుకే తుమ్మిడిహట్టి నుంచి ప్రాజెక్టును మేడిగడ్డకు మార్చారు

- హరీశ్ అసమర్థుడని ఆనాడే గుర్తించిన కేసీఆర్
- రాష్ట్రంలో ఎక్కడా లేని విధంగా 2వేలకు పైగా ఇండ్లను ఒకే చోట నిర్మాణం
- పారదర్శకంగా లబ్ధిదారుల ఎంపిక
- హుజూర్‌నగర్‌లో మోడల్ కాలనీకి మంత్రి ఉత్తమ్ శంకుస్థాపన



హుజూర్‌నగర్(జనంసాక్షి):కాళేశ్వరం ప్రాజెక్టు కూలిపోవడానికి ప్రధాన కారణం కేవలం బీఆర్ఎస్ పార్టీయేనని మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి స్పష్టం చేశారు. ఎక్కువ మొత్తం ఖర్చు పెడితే.. ఎక్కువ కమిషన్ వస్తుందనే దురాశతోనే, డాక్టర్ బీఆర్ అంబేద్కర్ పేరును తొలగించి కాళేశ్వరం అని పేరు మార్చారని ఆరోపించారు. ఈ మేరకు మాజీ మంత్రి హరీష్ రావుపై మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి మండిపడ్డారు. ఇరిగేషన్ శాఖ మంత్రిగా నువ్వు పనికిరావని మీ మామే నిన్ను పదవి నుంచి తీసివేసి సర్టిఫికెట్ ఇచ్చాడు కదా' అంటూ ఎద్దేవా చేశారు. రూ. 38 కోట్లతో తమ్మిడిహెట్టి ప్రాజెక్టు చేపట్టి కనీసం పూర్తి చేయలేక పోయారని మండిపడ్డారు. సూర్యాపేట జిల్లా హుజూర్‌నగర్‌లో రూ. 20 కోట్లతో నిర్మిస్తున్న మోడల్ కాలనీ అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేసిన ఆయన.. బీఆర్ఎస్ నేతలపై, ముఖ్యంగా మాజీ మంత్రి హరీష్ రావుపై తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. కవిత ఆన్ రికార్డ్‌గా చెప్పిన 1400 కోట్ల కమిషన్ వ్యవహారాన్ని ఆయన ఈ సందర్భంగా గుర్తుచేశారు. కనీసం మట్టి పరీక్షలు కూడా నిర్వహించకుండా, అధికారులు సూచించిన చోట కాకుండా ఐదు కిలోమీటర్ల దూరంలో, ఇసుకపై పునాది వేయడం వల్లే ప్రాజెక్టు కూలిపోతుందని సేఫ్టీ కంట్రోల్ ముందే హెచ్చరించినా బీఆర్ఎస్ వినలేదని ఉత్తమ్ మండిపడ్డారు. నేషనల్ డ్యామ్ సేఫ్టీ టీమ్ హెచ్చరించినా పట్టించుకోకుండా.. ఇప్పుడు కాంగ్రెస్‌పై నిందలు వేయడం

మిగతా 2లో..

ఖమేనీ అంత్యక్రియల వేళ

# అమెరికా మళ్లీ దాడులు

- ఇరాన్‌పై అమెరికా క్షిపణుల వర్షం
- అణు కేంద్రం వద్ద పేలిన భవనం
- హర్మూజ్‌లో ఇరాన్ ఆటలు సాగవు..
- జలసంధి ఇంకా మా నియంత్రణలోనే ఉంది : అమెరికా



టెహ్రాన్,జూలై10(జనంసాక్షి): అమెరికా, ఇరాన్ దేశాల మధ్య జూన్‌లో కుదిరిన తాత్కాలిక కాల్పుల విరమణ ఒప్పందం ముగియడంతో ఉద్రిక్తతలు మళ్లీ యుద్ధ వాతావరణాన్ని తలపిస్తున్నాయి. గురువారం అమెరికా, ఇరాన్‌లు పరస్పరం దాడులు చేసుకున్నాయి. గురువారం తెల్లవారుజామున ఇరాన్‌లోని అణు విద్యుత్ కేంద్రం బుషెహర్ ప్లాంట్‌పై అమెరికా మిస్సైల్ దాడులు చేసింది. దీంతో అణు ప్లాంట్ ఆవరణలోని ఓ భవనం దెబ్బతింది. అమెరికా మిస్సైల్ దాడి చేసిన వెంటనే ఇరాన్ వైమానిక రక్షణ వ్యవస్థలు వెంటనే స్పందించి ఎదురుదాడి చేశాయి. పరస్పర దాడుల కారణంగా ఆ ప్రాంతం మొత్తం పేలుళ్ల శబ్దాలతో హోరెత్తింది. ఇరాన్ అణు విద్యుత్ కేంద్రం ఉన్న 'బుషెహర్' ప్రాంతంతో పాటు చోగడక్, బందర్ అబ్బాస్, వ్యూహాత్మక ఓడరేవు ఉన్న కొనారక్ ప్రావిన్స్‌లలో భారీ పేలుళ్లు సంభవించినట్లు సమాచారం. బుషెహర్ నగర శివార్లలోని మిలిటరీ ప్రధాన కార్యాలయంపై కూడా మిస్సైల్ దాడి జరిగింది. గడిచిన 48 గంటల్లో ఇరాన్ తీరప్రాంతాల్లోని దాదాపు 170కి పైగా సైనిక స్థావరాలపై అమెరికా సైన్యం దాడులు చేసింది. హోర్ముజ్ జలసంధిలో వాణిజ్య నౌకలను లక్ష్యంగా చేసుకుంటున్న ఇరాన్‌ను దెబ్బతీసేందుకే ఈ చర్యలు ఈ

మిగతా 2లో..



## ఉత్తరాది రాష్ట్రాలను ముంచెత్తిన వర్షాలు

### విరిగిపడిన కొండ చరియలు

న్యూఢిల్లీ(జనంసాక్షి):ఉత్తరాది రాష్ట్రాల్లో భారీ వర్షాలు బీభత్సం సృష్టిస్తున్నాయి. నదులు, వాగులు ప్రమాదకరస్థాయిలో ప్రవహిస్తున్నాయి. ఉత్తరాఖండ్, హిమాచల్‌ప్రదేశ్‌ల్లో కొండచరియలు విరిగిపడడంతో పలువురు మృతి చెందారు. దిల్లీలోని పలు ప్రాంతాల్లో 160 మిల్లీమీటర్లకు పైగా వర్షపాతం నమోదైనట్లు వాతావరణ శాఖ వెల్లడించింది. సూరత్‌లో రహదారులు జలమయమవడంతో వాహనదారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. శుక్రవారం ఉత్తరాఖండ్‌లో భారీ నుంచి అతి భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని వాతావరణ శాఖ

మిగతా 2లో..

## 'కరూర్' బాధిత కుటుంబాలకు ప్రభుత్వోద్యోగాలు

### అర్హులైన వారికి నియామక పత్రాలు అందజేసిన సీఎం విజయ్



చెన్నై(జనంసాక్షి):కరూర్ తొక్కిసలాట ఘటన కచ్చితంగా రాజకీయ కుట్రేనని తమిళనాడు ముఖ్యమంత్రి విజయ్ అన్నారు. ఆ ర్యాలీకి ఎక్కువ మంది వచ్చారని తెలిసినా.. నాడు పోలీసులు దాన్ని ఎందుకు మధ్యలోనే రద్దు చేయలేదని ప్రశ్నించారు. తాను పోలీసులను నమ్మితే.. మరణాలకు తననే నిందించారని ఆవేదన వ్యక్తం చేశారు. సీఎం హోదాలో తొలిసారి కరూర్‌లో పర్యటించిన విజయ్ నాటి ఘటనను గుర్తుచేసుకుంటూ ఒకింత భావోద్వేగానికి గురయ్యారు."ఒక మనిషి ఉన్నత శిఖరాలను అధిరోహించినా సరే.. తన జీవితంలో ఎక్కడో ఓ చోట బాధాకరమైన క్షణాలను ఎదుర్కోక తప్పదు. నా రాజకీయ ప్రయాణంలో కరూర్ ఘటన అలాంటిదే. ఆ తొక్కిసలాటలో ఎంతోమంది తల్లులు తమ బిడ్డలను కోల్పోయారు. దీనికి బాధ్యులెవరు? ఆ రోజు ర్యాలీకి రద్దీ ఎక్కువగా ఉందని పోలీసులకు అనిపించినప్పుడు మమ్మల్ని అలర్ట్ చేయాల్సింది. లేదా సమావేశాన్ని రద్దు చేయాల్సింది. వారికి అన్ని హక్కులూ ఉన్నాయి కదా..! కానీ, అవేవీ చేయకుండా వారు చోద్యం చూశారు. బహుశా అలా చేయమని వారిపై ఎవరి (నాటి డీఎంకే ప్రభుత్వాన్ని ఉద్దేశిస్తూ) ఒత్తిడైనా ఉండి ఉంటుంది. రద్దీని నియంత్రించగలరని నేను

మిగతా 9లో..

## గతంలో నీటిపారుదల మంత్రిగా ఉండి హరీశ్ చేసిందేమిటి?

హరీశ్‌రావు కాంగ్రెస్‌లోకి వస్తానంటే కమిటీలో చర్చించి నిర్ణయం తీసుకుంటాం.' అని మహేశ్‌కుమార్ గౌడ్ వ్యాఖ్యానించారు. గత ప్రభుత్వ అప్పులు, తప్పులను సరి చేస్తున్నామని మహేశ్ కుమార్ గౌడ్ వెల్లడించారు. కాంగ్రెస్ పార్టీలో అంతర్గత గొడవలపై మహేశ్ స్పందిస్తూ.. కాంగ్రెస్ పార్టీలో భిన్నాభిప్రాయాలు సహజమన్నారు. మంత్రి కొండా సురేఖ, ఎమ్మెల్యే కడియం శ్రీహరి సమస్యను పరిష్కరిస్తామని తెలిపారు. తుంగతుర్తి సమస్య కూడా పరిష్కారం అవుతుందని చెప్పారు. ఇరు వర్గాల వాదనలు వింటామన్నారు. పార్టీలో అందరూ సమానమే అని తేల్చిచెప్పారు. క్రమశిక్షణ కమిటీ చైర్మన్ బిజీగా ఉండడం వల్ల ఇద్దరు సీనియర్ నాయకులను సమస్య పరిష్కారం కోసం నియమించామని అన్నారు. సస్పెండ్ చేయడమే పరిష్కారం కాదన్నారు. వరంగల్‌లో మంత్రి కొండా సురేఖ- ఎమ్మెల్యే కడియం శ్రీహరి, తుంగతుర్తిలో నేతల మధ్య నెలకొన్న వివాదాలను పరిష్కరిస్తామని టీపీసీసీ చీఫ్ మహేశ్‌కుమార్‌గౌడ్ అన్నారు. దీనిపై ఇప్పటికే ఇద్దరు సీనియర్లను పరిశీలకులుగా నియమించామని చెప్పారు. వరంగల్ అంశాన్ని సచిన్ సావంత్‌కు, తుంగతుర్తి బాధ్యతను జగ్గారెడ్డికి అప్పగించాం. అందరితో చర్చించి ఆమోదయోగ్యమైన నిర్ణయం తీసుకుంటాం. ప్రభుత్వాన్ని కూలగొడతామని అన్నప్పుడు.. పది మంది ఎమ్మెల్యేలు తమకు మద్దతు ఇచ్చారని చెప్పారు. నీళ్ల దోపిడీ జరిగినప్పుడు ఈటల మంత్రిగా ఉన్నారని మహేశ్ గుర్తుచేశారు.

## ఈ20 పెట్రోల్‌తో మైలేజీ తగ్గేమాట వాస్తవమే..

ఆగమేఘాల మీద అమల్లోకి తెచ్చారన్న ప్రచారాన్ని కేంద్రం ఖండించింది. సైంటిఫిక్ పరీక్షలు, ఆటోమొబైల్ తయారీదారులతో సంప్రదింపులు, దేశీయంగా ఇథనాల్ ఉత్పత్తి పెంపు చేపట్టిన అనంతరమే దశలవారీగా ఈ20 పెట్రోల్ వినియోగాన్ని తీసుకొచ్చినట్లు కేంద్రం పేర్కొంది. 2001లో పైలట్ ప్రాజెక్ట్ లాంచ్ అవ్వగా.. 2006 నాటికి దేశంలోని పలు చోట్ల 5 శాతం బ్లెండింగ్ అమల్లోకి తీసుకొచ్చినట్లు తెలిపింది. 2014లో ఎన్డీయే ప్రభుత్వం అధికారంలోకి వచ్చే వరకు 1.5 శాతం ఇథనాల్ బ్లెండింగ్ విధానమే అమల్లో ఉందని తెలిపింది. 2022 నాటికి 10 శాతానికి, 2025-26 నాటికి 20 శాతం బ్లెండింగ్‌ను దశలవారీగా సాధించగలిగామని తెలిపింది.

పాత వాహనాలు పాడవుతాయా?

పాత వాహనాలు పాడవుతాయన్న ఆందోళనలపై స్పందిస్తూ.. దేశవ్యాప్త వినియోగానికి ముందు ఈ20 వాహనం ఇంజిన్ మన్నిక, ఇంధన వ్యవస్థలు, మెటీరియల్ అనుకూలత, తుప్పు నిరోధకత, ఉద్గారాలకు సంబంధించి విస్తృతమైన పరీక్షలకు నిర్వహించినట్లు కేంద్ర ప్రభుత్వం తెలిపింది. రియల్ వరల్డ్ కండీషన్‌లో ఈ20 వల్ల తుప్పు పట్టడం, విడిభాగాలు దెబ్బతినడం వంటివేవీ సర్వీస్ చేసిన వాహనాల్లో నిరూపితం కాలేదని పేర్కొంది. మారుతీ సుజుకీ, హీరో మోటోకార్ప్ కంపెనీల అభిప్రాయాలనూ ఉటంకించింది.

వేర్వేరు సాధ్యం కాదు..

పెట్రోల్ రకాన్ని వినియోగదారులు ఎంచుకునేలా ప్యూర్, ఈ10, ఈ20 ఇంధన ఆప్షన్లు ఇవ్వాలన్న డిమాండ్లపైనా కేంద్రం స్పందించింది. ఆ స్థాయిలో సప్లయ్ చైన్‌లు నిర్వహించడం వల్ల లాజిస్టిక్ ఖర్చులు పెరుగుతాయని తెలిపింది. దేశంలో ఉన్న లక్షకుపైగా రిటైల్ ఔట్‌లెట్లకు ఇంధన పంపిణీ ప్రక్రియ సంక్లిష్టంగా మారుతుందని వివరించింది.

ధర ప్రస్తావన

ఈ20 పెట్రోల్ ధర గురించి స్పందిస్తూ.. రైతులకు మెరుగైన ఆదాయం అందించే ఉద్దేశంతో ఇథనాల్ సేకరణకు ఒక నిర్దిష్ట మొత్తం నిర్ణయించినట్లు కేంద్రం పేర్కొంది. ఒకవేళ అంతర్జాతీయంగా ముడి చమురు ధరలు తక్కువగా ఉన్నప్పుడు ఈ20 పెట్రోల్ ధరనే.. సాధారణ పెట్రోల్ ధర కంటే కాస్త ఎక్కువగా ఉంటుందని తెలిపింది. కాబట్టి సంప్రదాయ పెట్రోల్ కంటే చౌకేమీ కాదని పేర్కొంది. ఇథనాల్ బ్లెండింగ్ ప్రోగ్రామ్ వల్ల రూ.1.97 లక్షల కోట్ల విదేశీ మారకం ఆదా అయ్యిందని కేంద్ర ప్రభుత్వం వెల్లడించింది. సుమారు 316 లక్షల టన్నుల క్రూడాయిల్ దిగుమతుల్ని, 952 లక్షల టన్నుల కర్బన ఉద్గారాలను తగ్గించగలిగామని గణాంకాలతో వివరించే ప్రయత్నం చేసింది. 2014-15 నుంచి ఇప్పటి వరకు ఇథనాల్ సప్లయ్ వల్ల రైతులకు రూ.1.66 లక్షల కోట్లు ఆదాయం సమకూరిందని పేర్కొంది. కాబట్టి ఈ20 పెట్రోల్ గురించి అవాస్తవ సమాచారాన్ని విశ్వసించొద్దని కేంద్రం పౌరులకు సూచించింది.

## ఖమేనీ అంత్యక్రియల వేళ అమెరికా మళ్లీ దాడులు

అమెరికాతో ఉద్రిక్తతల వేళ హార్మూజ్ జలసంధిలో నౌకల రవాణా మార్గానికి సంబంధించి ఇరాన్ చేసిన ప్రకటనను అగ్రరాజ్యం ఖండించింది. హార్మూజ్ పూర్తిగా తమ నియంత్రణలోనే ఉందని స్పష్టం చేసింది. ఈ జలమార్గం మీదుగా 800 నౌకలు సురక్షితంగా ప్రయాణించినట్లు తెలిపింది. ఈ మేరకు యూఎస్ సెంట్రల్ కమాండ్ ఎక్స్ వేదికగా వెల్లడించింది. అసలేం జరిగిందటే..హార్మూజ్ జలసంధి మీదుగా నౌకలు రాకపోకలు సాగించాలంటే తాము నిర్దేశించిన మార్గాల్లోనే అవి ప్రయాణించాలని ఇరాన్ ప్రకటించినట్లు ఆ దేశ అధికారిక మీడియా వెల్లడించింది. ఈ జలసంధి కార్యకలాపాల్లో అమెరికా జోక్యాన్ని తాము అనుమతించబోమని టెహ్రాన్ పేర్కొంది. దీనిపై యూఎస్ సెంట్రల్ కమాండ్ స్పందించింది. "ఇరాన్ మీడియా చేసిన ప్రకటనలో నిజం లేదు. వాస్తవానికి హార్మూజ్‌పై ఇరాన్‌కు ఎలాంటి నియంత్రణ లేదు. ఈ ఏడాది మే నుంచి ఈ జల మార్గంలో 800 వాణిజ్య నౌకలు సురక్షితంగా ప్రయాణించేలా అమెరికా దళాలు భద్రత కల్పించాయి. వీటిల్లో 380 మిలియన్ బ్యారెళ్ల ముడిచమురు రవాణా అయ్యింది" అని అమెరికా స్పష్టం చేసింది. ఇటీవల ఒమన్ కారిడార్ నుంచి ప్రయాణిస్తున్న కొన్ని నౌకలను ఇరాన్ వెనక్కి పంపించినట్లు వార్తలు వచ్చిన సంగతి తెలిసిందే. తాము నిర్దేశించిన మార్గంలోనే ప్రయాణించాలని టెహ్రాన్ వాటిని ఆదేశించినట్లు కథనాలు వెలువడ్డాయి. ఈ నేపథ్యంలోనే అగ్రరాజ్యం స్పందించింది.

ఉద్రిక్తతలున్నా.. నౌకల ప్రయాణం

ఇదిలా ఉండగా.. అమెరికా-ఇరాన్ పరస్పర దాడులతో పశ్చిమాసియాలో ఉద్రిక్తతలు చెలరేగిన సంగతి తెలిసిందే. అయినప్పటికీ హార్మూజ్ మీదుగా వాణిజ్య నౌకల ప్రయాణం యథావిధిగా సాగుతున్నట్లు తెలుస్తోంది.



భద్రాద్రి రాముడిపైన ఆన..ఒట్టేసి చెబుతున్నా..

# మళ్లీ అధికారం మాదే..

నేడు వరి కొనుగోలు చేసి బోనస్ ఇస్తున్నాం. రైతును రాజు చేయాలని మంత్రి తుమ్మల ప్రయత్నిస్తున్నారు. నాడు వరి వేస్తే ఉరే అని కేసీఆర్ అన్నారు. కాంగ్రెస్ వస్తే కరెంట్ ఉండదని అసత్యాలు చెప్పారు. ఉచిత కరెంట్.. కాంగ్రెస్ పేటెంట్ రైట్. మా ప్రభుత్వం వచ్చిన రెండున్నరేళ్లలో రైతులకు రూ.1.70లక్షల కోట్లు ఖర్చు చేశాం అని రేవంత్ అన్నారు. కల్వకుంట్ల కుటుంబాన్ని తెలంగాణ రాజకీయ ముఖచిత్రం నుంచి పాతాళానికి తొక్కే వరకు కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలు విశ్రమించరని రేవంత్‌రెడ్డి అన్నారు. గత ఎన్నికల సమయంలో కేసీఆర్ మాయమాటలు, మూటలతో వస్తున్నారని కొందరు చెప్పారు. వాళ్లని ఎలా ఎదుర్కోగలరని ప్రశ్నించారు. వాళ్లు ఎలా వచ్చినా కాంగ్రెస్ 65 సీట్లు గెలుస్తోందని ఆనాడే చెప్పా. ఎన్నికల్లో మాకు 64 సీట్లు వచ్చాయి. ఉప ఎన్నికల్లో మరో 2 గెలిచాం. బీఆర్ఎస్‌కు లోక్‌సభ ఎన్నికల్లోనూ గుండు సున్నా తప్పదని చేవెళ్ల సభలో చెప్పా. అన్ని ఎన్నికల్లోనూ నేను చెప్పినట్లుగానే ప్రజలు తీర్పు ఇచ్చారు. ఎన్నికల్లో ఓడించి పాపాల భైరవుడిని ఫాంహౌస్‌కి పరిమితం చేశాం. కౌరవ వంశాన్ని తెలంగాణ గడ్డ నుంచి తొలగిస్తాం. కాసుకో కేసీఆర్.. నిన్ను, నీ బంధువులను, సర్వేలను ఓడిస్తాం. మిమ్మల్ని ఓడించేందుకు రోజూ 18 గంటలు పనిచేస్తాం. మోదీ, అమిత్‌షా ఇతర పార్టీలను లొంగదీసుకునేందుకు ప్రయత్నిస్తున్నారు. ఇప్పటికే తృణమూల్ కాంగ్రెస్, ఆప్‌లను చీల్చారు. ఇతర పార్టీలను కూడా లొంగదీసుకుని లోక్‌సభ సీట్ల పెంపు బిల్లును ఎలా అయినా ఆమోదింపజేసుకోవడానికి సర్వశక్తులు ఒడ్డుతున్నారు. ఈ విషయంలో వారు విజయం సాధించడానికి అవకాశం ఉందని రేవంత్ అన్నారు. ఇకపోతే రైతు భరోసా తుది విడత నిధులను తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి విడుదల చేశారు. ఖమ్మంలో జరిగిన రైతు ఆశీర్వాద సభలో పాల్గొన్న రేవంత్ రెడ్డి.. అన్నదాతల నిధులు విడుదల చేసేందుకు బటన్ నొక్కారు. అనంతరం భారీ బహిరంగ సభలో ఆయన ప్రసంగించారు. ఈ సందర్భంగా తెలంగాణలో పదేళ్లపాటు బీఆర్ఎస్ రాక్షస పాలన సాగిందని సీఎం రేవంత్ అన్నారు. వారి పాలనలో రైతులకు బేడీలు వేశారని మండిపడ్డారు. దీంతో ఖమ్మం జిల్లాలో బీఆర్ఎస్ పార్టీ అనేది లేకుండా ప్రజలు చేశారని ఆయన చెప్పుకొచ్చారు. ఖమ్మం జిల్లాలో 2023లో ఓ అద్భుతం జరిగింది. బీఆర్ఎస్‌ను కాదని కాంగ్రెస్‌లోకి పొంగులేటి శ్రీనివాసరెడ్డి వచ్చారు. దీంతో ఆనాడు కాంగ్రెస్‌లోకి ఉప్పెనలా జనం వచ్చారు. కారు పార్టీని ప్రజలు ఇక్కడ మళ్లీ మొలకెత్తనీయకుండా చేశారు. 2023 ప్రభుత్వ ఏర్పాటు నుంచి ఏ ఎన్నికలైనా కాంగ్రెస్‌దే గెలుపు అంటూ ధీమా వ్యక్తం చేశారు. అన్నదాతల ఖాతాల్లో రైతు భరోసా నిధులు జమ చేశాం. ప్రతి సందర్భంలోనూ వారిని ఆదుకుంటూ వస్తున్నాం. రైతు కళ్లల్లో ఆనందమే మాకు ఆశీర్వాదం. కల్వకుంట్ల కుటుంబంలో ఒకరంటే ఒకరికి నమ్మకం లేదు. కుళ్లు, కుతంత్రాలు, కుట్రలతో బయటకు వస్తున్నారు. అధికారం పోయిందనే అక్కసుతోనే ప్రభుత్వంపై దుష్ప్రచారం చేస్తున్నారు. బావా బామ్మర్దులిద్దరూ ఊళ్లపై పడి తెగ తిరుగుతున్నారు. కాంగ్రెస్ వస్తే కరెంట్ ఉండదని విషప్రచారం చేశారు. ఇప్పుడు కరెంట్ తీగలు పట్టుకోండి.. సలసల మాడిపోతారు. ఆనాడు డబుల్ బెడ్‌రూమ్‌ల పేరుతో సినిమా కథలు చెప్పారు. ఇప్పుడు పొంగులేటి 7 లక్షల ఇందిరమ్మ ఇళ్లు కట్టిస్తున్నారు. కన్నెపల్లి పంప్‌హౌస్‌లు ఓపెన్ చేయాలని బీఆర్ఎస్ నేతలు అంటున్నారు. కన్నెపల్లి పంప్‌లు ఆన్ చేస్తే భద్రాచల రాముడి ఆలయం సహా 44 గ్రామాలు కొట్టుకుపోయే ప్రమాదం ఉంది. కేసీఆర్ ఇంట్లో ఒకరంటే ఒకరికి పడదు. బీజేపీతో హరీశ్ రావు మంతనాలు జరుపుతున్నారో, లేదో భద్రాచల రాముడిపై ఒట్టేసి చెప్పాలి. కారు పార్టీలో ఉంటావో లేదో కేసీఆర్‌పై ఒట్టేసి హరీశ్ రావు చెప్పాలి. తాటిచెట్టంత పెరిగినా ఆయనకు బుర్రలో గుజ్జు లేదు. బీఆర్ఎస్‌ను బీజేపీలో విలీనం చేస్తారని కేటీఆర్ చెల్లెలే చెబుతున్నారని తెలిపారు.

**కల్వకుంట్ల కుటుంబాన్ని పాతాళానికి తొక్కేవరకు విశ్రమించం**

కల్వకుంట్ల కుటుంబాన్ని తెలంగాణ రాజకీయ ముఖచిత్రం నుంచి పాతాళానికి తొక్కే వరకు కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలు విశ్రమించరని రేవంత్‌రెడ్డి అన్నారు. "గత ఎన్నికల సమయంలో కేసీఆర్ మాయమాటలు, మూటలతో వస్తున్నారని కొందరు చెప్పారు. వాళ్లని ఎలా ఎదుర్కోగలరని ప్రశ్నించారు. వాళ్లు ఎలా వచ్చినా కాంగ్రెస్ 65 సీట్లు గెలుస్తోందని ఆనాడే అన్నా. ఎన్నికల్లో మాకు 64 సీట్లు వచ్చాయి. ఉప ఎన్నికల్లో మరో 2 గెలిచాం. బీఆర్ఎస్‌కు లోక్‌సభ ఎన్నికల్లోనూ గుండు సున్నా తప్పదని చేవెళ్ల సభలో చెప్పా. అన్ని ఎన్నికల్లోనూ నేను చెప్పినట్లుగానే ప్రజలు తీర్పు ఇచ్చారు. ఎన్నికల్లో ఓడించి పాపాల భైరవుడిని ఫాంహౌస్‌కి పరిమితం చేశాం. కౌరవ వంశాన్ని తెలంగాణ గడ్డ నుంచి తొలగిస్తాం. కాసుకో కేసీఆర్.. నిన్ను, నీ బంధువులను, సర్వేలను ఓడిస్తాం. మిమ్మల్ని ఓడించేందుకు రోజూ 18 గంటలు పనిచేస్తాం.

**భాజపాతో హరీశ్‌రావు మంతనాలు**

కల్వకుంట్ల కుటుంబంలోనే కుట్రలు, కుతంత్రాలు. ఆ కుటుంబంలో ఒకరిని చూస్తే.. మరొకరికి నచ్చదు. మేడిగడ్డలో నీళ్లు నింపాలని బీఆర్ఎస్ నేతలు చెబుతున్నారు. అక్కడ నీళ్లు నింపితే భద్రాచలం మునుగుతుంది. మీ రాజకీయాల కోసం భద్రాచలం రాముడు మునగాలా? హరీశ్‌రావు భాజపా నేతలతో రాత్రి మంతనాలు చేస్తున్నారు. అలా చేయడంలేదని భద్రాచలం రాముడిపై ఆయన ప్రమాణం చేస్తారా?" అని రేవంత్ సవాల్ విసిరారు.మోదీ, అమిత్‌షా ఇతర పార్టీలను లొంగదీసుకునేందుకు ప్రయత్నిస్తున్నారని రేవంత్ ఆరోపించారు.



## నిర్ణీత గడువులోగా 'సర్'

ఇతర జిల్లాలు కూడా అమలు చేసి, ఎన్యూమరేషన్ ప్రక్రియను పూర్తి చేసి చేయాలని ఆదేశించారు. దనంగా, రాష్ట్రవ్యాప్తంగా ఎన్యూమరేషన్ ఫారమ్‌ల పంపిణీ, సేకరణ, డిజిటలైజేషన్ ప్రక్రియలను ప్రతిరోజూ నిర్దేశిరచిన లక్ష్యాల ప్రకారం పర్యవేక్షిస్తూ వేగవంతం చేయాలని తెలంగాణ ప్రధాన ఎన్నికల అధికారికి భారత ఎన్నికల కమిషన్ ఆదేశించింది. దీంతో ఃూఎఖీ 2026 ప్రక్రియను నిర్ణీత సమయంలో విజయవంతంగా పూర్తి చేయడంపై ప్రత్యేక దృష్టి సారించింది.

## భద్రాద్రి రాముడి సాక్షిగా.. సంపూర్ణ రుణమాఫీ హామీ ఏమైంది?

అన్నారు. ఎందుకంత ఆవేశం, అసహనంతో రగిలిపోతున్నారని రేవంత్‌రెడ్డిని ప్రశ్నించారు. కన్నెపల్లి నుంచి నీళ్లు లిఫ్ట్ చేయలేని చేతగానితనాన్ని అబద్దాలతో కవర్ చేస్తున్నారని మండిపడ్డారు. బీఆర్ఎస్‌పై రాజకీయంగా పోరాడండి.. రైతులపై కక్ష తీర్చుకోవద్దన్నారు.. అన్నదాతల శాపం నుంచి ఈ ప్రభుత్వం తప్పించుకోలేదని హరీశ్‌రావు అన్నారు. గోదావరిలో నీరు ఎత్తిపోసి రైతులను ఆదుకోవాల్సింది పోయి, భద్రాచలం మునుగుతదిన ఎలా చెబుతారని అన్నారు. గతంలో లేని ముప్పు ఇప్పుడే ఎందుకు వచ్చిందన్నారు.

## 15 నుంచి ఈహెచ్‌ఎస్ హెల్త్ కార్డులు

ఏర్పాటు చేయాలని నిర్ణయించింది. మరోవైపు ఈహెచ్‌ఎస్ హెల్త్ కార్డులను త్వరలోనే ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చేతుల మీదుగా లాంఛనంగా పంపిణీ చేయనున్నట్లు అధికార వర్గాలు తెలిపాయి. ఈ కార్యక్రమానికి సంబంధించిన తేదీని ప్రభుత్వం త్వరలో ప్రకటించనుంది. రాష్ట్ర ప్రభుత్వ నిర్ణయాన్ని ఉద్యోగ సంఘాల ప్రతినిధులు స్వాగతించారు. చాలా కాలంగా పెండింగ్‌లో ఉన్న సమస్యకు పరిష్కారం లభించిందని వారు పేర్కొన్నారు. హెల్త్ కార్డుల అమలుతో ప్రభుత్వ ఉద్యోగులు, పెన్షనర్లకు నాణ్యమైన వైద్య సేవలు మరింత సులభంగా అందుతాయని ఆశాభావం వ్యక్తం చేశారు.

## ఉత్తరాది రాష్ట్రాలను ముంచెత్తిన వర్షాలు..

హెచ్చరించింది. అలకనంద, మందాకిని నదులు ఉప్పొంగుతుండడంతో.. అధికారులు అప్రమత్తమయ్యారు. లోతట్టు ప్రాంతాల ప్రజలను సురక్షిత ప్రాంతాలకు తరలిస్తున్నారు. రుద్రప్రయాగ్ జిల్లాలోని పాఠశాలలను మూసివేశారు. హిమాచల్ ప్రదేశ్‌లో కురిసిన భారీ వర్షాలు జనజీవనాన్ని స్తంభింపజేశాయి. 75 రోడ్లు దెబ్బతిని రాకపోకలు నిలిచిపోయాయని.. 29 విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్లు ధ్వంసమయ్యాయని రాష్ట్ర విపత్తు నిర్వహణ అథారిటీ వెల్లడించింది. ఉత్తరకాశి జిల్లాలో కొండచరియలు విరిగిపడటంతో గంగోత్రి హైవే మూసుకుపోయి.. వాహనాల రాకపోకలు నిలిచిపోయాయి. దీంతో చార్‌ధామ్ యాత్రకు కొన్ని గంటలపాటు అంతరాయం కలిగింది. ఉత్తర్‌ప్రదేశ్‌లోని పలు ప్రాంతాల్లో శుక్రవారం భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని హెచ్చరిస్తూ వాతావరణ శాఖ రెడ్ అలర్ట్ జారీ చేసింది. ముందు జాగ్రత్త చర్యగా గాజియాబాద్, మేరఠ్, హాపూర్, బులంద్‌షహర్, బాఘ్‌పత్, ముజఫర్‌నగర్, మొరాదాబాద్ జిల్లాల్లోని పాఠశాలలకు శుక్రవారం సెలవు ప్రకటించారు.



# కమీషన్ల కేసమే కాళేశ్వరం

సరికాదన్నారు. డ్యామ్ సేఫ్టీ అధికారులు నీటిని నిల్వ చేయొద్దని చెబుతున్నా.. బీఆర్ఎస్ నేతలు ఇంకా మోసపూరిత మాటలు మాట్లాడుతున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. సూర్యాపేటకు వస్తున్న నీళ్లు ఎస్సారెస్పీ స్టేజ్-2 ద్వారా వస్తున్నాయని, కాంగ్రెస్ అధికారంలోకి వచ్చాక ఒక్కసారి కూడా కాళేశ్వరం నీళ్లు వదల్లేదని స్పష్టం చేశారు. తెలంగాణను అప్పులమయం చేసిన బీఆర్ఎస్ తప్పులను సరిదిద్దుతూ.. డ్యామ్ సేఫ్టీ అధికారుల సూచనల మేరకు ప్రాజెక్ట్ పనులను పూర్తి చేస్తామని మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి భరోసా ఇచ్చారు.రాష్ట్ర చరిత్రలో ఒకే చోట 2,160 ఇందిరమ్మ ఇండ్లను నిర్మించి పేదలకు అందిస్తున్నామని రాష్ట్ర ఆహార, పౌరసరఫరాల నీటిపారుదల శాఖ మంత్రి నలమాధ ఉత్తమ్ కుమార్ రెడ్డి తెలిపారు. శుక్రవారం హుజూర్ నగర్ లోని రామస్వామి గుట్ట వద్ద 110 ఎకరాలలో 125 కోట్ల రూపాయలతో నిర్మిస్తున్న 2,160 ఇందిరమ్మ ఇండ్ల ప్లాట్ల మోడల్ కాలనీలో రూ.20 కోట్లతో తెలంగాణ పబ్లిక్ స్కూల్, అంగన్ వాడి భవనం, కమ్యూనిటీ హాల్, సిసి రోడ్లు, డ్రైన్స్ , వీధి లైట్లు, పిల్లల ఆట స్థలం, షాపింగ్ కాంప్లెక్స్, ఆర్చ్ లకు శంఖుస్థాపనలు చేశారు. అనంతరం ఏర్పాటు చేసిన సమావేశంలో మంత్రి ఉత్తమ్ మాట్లాడుతూ హుజూర్ నగర్ నియోజకవర్గంలో నిరుపేదలు, వ్యవసాయ కూలీలు, రైస్ మిల్లులో పనిచేసే వారికి ఆశ్రయం కల్పించాలన్న లక్ష్యంతో 110 ఎకరాల దేవాలయ భూములను మార్కెట్ రేటుకి కొనుగోలు చేసి పనులు ప్రారంభించడం జరిగిందని కానీ రాష్ట్ర విభజన తర్వాత ఆనాటి ప్రభుత్వం ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణ పనులను మధ్యలోనే నిలిపివేసినదని, తిరిగి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక 14 సంవత్సరాల నా పట్టుదల , కృషి, ఆకాంక్షలతో తిరిగి పనులను ప్రారంభించి ప్రాజెక్టును పూర్తిచేసి పేద ప్రజలకు అందించడం నా చిరకాల స్వప్నం అని, దీనిని నా అదృష్టంగా భావిస్తున్నానని, రూ.75 కోట్లతో అంతర్గత రోడ్లు, ఎలక్ట్రిసిటీ, త్రాగునీరు, డ్రైనేజీ వ్యవస్థ కొరకు ప్రభుత్వం నుండి మంజూరు చేయించి పనులు యుద్ధ ప్రాతిపదికన పూర్తి చేయించినట్లు వెల్లడించారు. మోడల్ కాలనీలో రూ.20 కోట్లతో తెలంగాణ పబ్లిక్ స్కూల్, అంగన్ వాడి భవనం, కమ్యూనిటీ హాల్, సిసి రోడ్లు, డ్రైన్స్ , వీధి లైట్లు, పిల్లల ఆట స్థలం, షాపింగ్ కాంప్లెక్స్, ఆర్చ్ లకు శంఖుస్థాపనలు చేసుకోవడం జరిగినదని. ఇందులో 10 కోట్లతో 32 వేల స్క్వేర్ ఫీట్ సైజ్ లో తెలంగాణ మోడల్ పబ్లిక్ బోర్డింగ్ స్కూల్ నిర్మాణం చేసుకోవడం జరుగుతుందని , ఇందులో 2,500 మంది హౌసింగ్ కాలనీ, హుజూర్ నగర్ లోకల్ పేద విద్యార్థులు చదువుకోడానికి వీలుంటుందని పూర్తిగా ఇంగ్లీష్ మీడియం లోనే విద్యాభ్యాసం ఉంటుందని, మిగతా 10 కోట్లతో అంగన్ వాడి భవనం, కమ్యూనిటీ హాల్, సిసి రోడ్లు, డ్రైన్స్ , వీధి లైట్లు, పిల్లల ఆట స్థలం, షాపింగ్ కాంప్లెక్స్, ఆర్చ్ నిర్మాణాలు చేపట్టడం జరుగుతుందని మంత్రి అన్నారు. కాలనీలో ఇంకా గ్రీనరీ పెంచాలని అలాగే జిల్లాలోని హౌసింగ్ సిబ్బందితో ప్రతి ప్లాటు క్షుణ్ణంగా చెక్ చేసి, అన్ని పనులు పూర్తి అయినవో, ఇంకా ఏమైనా పెండింగ్లో ఉన్నాయో నివేదిక అందించాలని కలెక్టర్ కు సూచించారు. అలాగే ఒకే ఇంట్లో 18 సంవత్సరాలు నిండిన ఇద్దరు పిల్లలు ఉంటే వారికి అదనంగా ఇంకో ప్లాటు మంజూరు చేయాలని, బాత్రూం, టాయిలెట్స్ చిన్నవిగా ఉన్నందువలన ఎవరైనా అతిథులు వస్తే ఇబ్బందికరంగా ఉంటుంది కావున కాలనీలో బయట వైపు అదనంగా టాయిలెట్స్, బాత్రూమ్స్ మున్సిపాలిటీ వారితో నిర్మించి, వారికే మెయింటినెన్స్ అప్పగించాలని, ప్రతి హౌసింగ్ బ్లాక్ కి మూడు రంగులు స్పష్టంగా కనబడే విధంగా మరొక కోటింగ్ వేయించాలని, ఇందిరమ్మ హౌసింగ్ కాలనీలోకి ప్రవేశించటానికి ప్రస్తుతం ఒకే రోడ్డు ఉన్నదని అదనముగా మరొక రోడ్డును కూడ వేయించడం జరుగుతుందని, మోడల్ హౌసింగ్ కాలనీ అంటే మోడల్ గా క్వాలిటీ బ్రహ్మాండంగా ఉండాలని, అర్హులకు మాత్రమే ఇండ్లు మంజూరు చేయాలని, అర్హత లేని వారికి ఎట్టి పరిస్థితుల్లోనూ ఇండ్లు మంజూరు చేయకూడదని ఎంపిక విషయంలో ఎలాంటి అవినీతికి, అవకతవకలకు పాల్పడిన కఠిన చర్యలు తీసుకోవడం జరుగుతుందని మంత్రి తెలిపారు. ఇండ్లను లబ్ధిదారులకు కేటాయించిన తర్వాత జనాభాను బట్టి వార్డులుగా విభజించాలని మున్సిపల్ అధికారులను ఆదేశించారు. కాళేశ్వరం ప్రాజెక్టు గురించి మంత్రి మాట్లాడుతూ డ్యామ్ సేఫ్టీ అధికారుల సూచనలు, క్వాలిటీ కంట్రోల్ నిపుణుల సూచనల మేరకు వచ్చే వేసవి కాలంలో మరమ్మత్తులు చేసి అన్ని పనులు పూర్తయిన పిదప డ్యాం నింపి నీరు అందించటం జరుగుతుందని అన్నారు. ఈ సమావేశంలో జిల్లా కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్, పెరిక కార్పొరేషన్ చైర్మన్ దొంగరి వెంకటేశ్వర్లు, మున్సిపల్ చైర్ పర్సన్ దొంతగాని శ్రీనివాస్, మార్కెట్ కమిటీ చైర్మన్ రాధికా, హుజూర్నగర్ ఆర్డీవో శ్రీనివాసులు, తాసిల్దార్ కవిత, డీఎస్ఓ మోహన్ బాబు, హార్టికల్చర్ అధికారి నాగయ్య, వైస్ చైర్మన్ తన్నీరు మల్లికార్జున్, జిల్లా కాంగ్రెస్ అధ్యక్షులు గుడిపాటి నరసయ్య, స్థానిక ప్రజా ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

## రష్యా చమురు క్షేత్రాలను పూర్తిగా ధ్వంసం చేశాం

### యుద్ధం ముగిసేవరకూ రష్యా గుండెలపై కుంపటే: జెలెన్‌స్కీ హెచ్చరిక

**కీవ్(జనంసాక్షి):**రష్యా ఆర్థిక జీవనాడి అయిన చమురు క్షేత్రాలపై ఉక్రెయిన్ దాడులు తీవ్రతరం చేసింది. రష్యాలోని స్టావ్‌రోపోల్, ట్వెర్, ఉఫా ప్రాంతాలలోని ఇంధన నిల్వ కేంద్రాలు, చమురు పంపింగ్ స్టేషన్‌లను తమ దళాలు పూర్తిగా ధ్వంసం చేశాయని ఉక్రెయిన్ అధ్యక్షుడు జెలెన్‌స్కీ ప్రకటించారు. యుద్ధం ముగించడానికి మాస్కో నిరాకరిస్తుండడంతోనే దాడులు తీవ్రం చేసినట్లు వెల్లడించారు. ఈ యుద్ధాన్ని ముగించాలని తాము ఎన్నిసార్లు ప్రతిపాదించినప్పటికీ.. ఆ దేశం నుంచి ఎలాంటి స్పందన రావట్లేదన్నారు. యుద్ధాన్ని ముగించే వరకూ.. ప్రతిరోజు రష్యాలో యుద్ధ వాతావరణాన్ని సృష్టిస్తూనే ఉంటామన్నారు. క్రిమియా సహా దేశంలోని పలు కీలక చమురు కేంద్రాలు రైల్వే సదుపాయాలపై ఉక్రెయిన్ డ్రోన్ దాడులు చేసినట్లు రష్యా అధికారులు ప్రకటించారు. గురువారం రాత్రి ప్రారంభమైన దాడులు శుక్రవారం తెల్లవారుజాము వరకు కొనసాగినట్లు పేర్కొన్నారు. ఈ దాడుల్లో పలు ప్రాంతాల్లోని దాదాపు ఆరు



చమురు డిపోలు ధ్వంసమైనట్లు తెలిపారు. వాటి నుంచి భారీగా మంటలు ఎగసిపడుతుండడంతో స్థానికులను సురక్షిత ప్రాంతాలకు తరలిస్తున్నట్లు తెలిపారు. అజోవ్ సముద్రంలోని రెండు చమురు ట్యాంకర్లపై కూడా డ్రోన్ దాడి జరిగినట్లు పేర్కొన్నారు. సెర్బియాలోని పలు రష్యా ఆస్తులపైనా ఉక్రెయిన్ డ్రోన్ దాడులు చేపట్టినట్లు అంతర్జాతీయ మీడియా వర్గాలు వెల్లడించాయి.చమురు శుద్ధి కర్మాగారాలే లక్ష్యంగా ఉక్రెయిన్ తరచూ భారీ దాడులు చేస్తుండడంతో పలు ప్రాంతాల్లో పెట్రోల్ కొరత చోటుచేసుకున్నట్లు అధికారులు వెల్లడించారు. ఇంధనం కోసం వాహనదారులు పెట్రోల్ బంకుల వద్ద గంటల తరబడి వేచి ఉండాల్సివస్తోందని తెలిపారు. గురువారం తమ రక్షణ దళాలు 73 ఉక్రేనియన్ డ్రోన్‌లను కూల్చివేశాయని రష్యా రక్షణ మంత్రిత్వ శాఖ తెలిపింది. మరోవైపు గురువారం రాత్రి రష్యా దళాలు తమ దేశంలోని పలు ప్రాంతాలపై 94 డ్రోన్‌లు.. రెండు బాలిస్టిక్ క్షిపణులను ప్రయోగించినట్లు ఉక్రెయిన్ వైమానిక దళం తెలిపింది. వీటిలో 72 డ్రోన్‌లను అడ్డుకున్నామని పేర్కొంది.

## ట్రంప్ హత్యకు కుట్రలు

### అమెరికాకు ఇజ్రాయెల్ నిఘా వర్గాల కీలక హెచ్చరికలు

**వాషింగ్టన్(జనంసాక్షి):**శాంతి ఒప్పందంతో పశ్చిమాసియాలో సుస్థిరత నెలకొంటుందని ఆశ పడేలోపే.. మళ్లీ ఉద్రిక్తతలు రాజుకున్నాయి. అమెరికా-ఇరాన్ పరస్పర దాడులతో గల్ఫ్ దేశాలు దద్దరిల్లుతున్నాయి. ఈ పరిణామాల వేళ ఇజ్రాయెల్ నిఘా వర్గాలు అగ్రరాజ్యానికి కీలక హెచ్చరికలు చేశాయి. అమెరికా అధ్యక్షుడు ట్రంప్‌ను హత్య చేసేందుకు ఇరాన్ కొత్త కుట్రలు చేస్తున్నట్లు హెచ్చరించాయి. దీంతో పశ్చిమాసియాపై మళ్లీ యుద్ధ మేఘాలు కమ్ముకున్నాయి.ట్రంప్‌ను లక్ష్యంగా చేసుకుని దాడులు జరగొచ్చని అమెరికా నిఘా సంస్థలకు కొన్ని వారాలుగా సమాచారం అందుతూనే ఉంది. కానీ, దీని గురించి ఇజ్రాయెల్ అలర్ట్ చేయడం ఈ మధ్యకాలంలో ఇదే మొదటిసారి. ట్రంప్ హత్యకు ఇరాన్ ఓ నిర్దిష్ట ప్రణాళికను రూపొందించినట్లు తమకు సమాచారం వచ్చిందని ఇజ్రాయెల్ ఇంటెలిజెన్స్ అగ్రరాజ్యాన్ని హెచ్చరించింది. ఇరాన్‌లో ఖమేనీ అంతిమయాత్ర జరిగిన సమయంలో నెతన్యాహు సర్కారు.. ఈ సమాచారాన్ని అమెరికాకు అందజేసినట్లు అంతర్జాతీయ మీడియా కథనాలు వెల్లడించాయి. అయితే, ఈ కుట్రకు సంబంధించి ఇతర వివరాలేవీ బయటకు రాలేదు.

**ట్రంప్‌ను ప్రభావితం చేసేందుకేనా..?**

హార్మూజ్‌లో నౌకలపై దాడులకు ప్రతీకారంగా ఇరాన్‌పై అమెరికా తాజా దాడులు చేపట్టింది. దీంతో టెహ్రాన్ కూడా విరుచుకుపడటంతో ఉద్రిక్తతలు చెలరేగాయి. అయితే, ఈ దాడులను మరింత తీవ్రతరం చేయాలా? లేక ఇరాన్‌తో కాల్పుల విరమణను కొనసాగించాలా? అనే దానిపై ప్రస్తుతం ట్రంప్ ఆలోచనలు చేస్తున్నట్లు సమాచారం. ఈ సమయంలో ఇజ్రాయెల్ నుంచి నిఘా అలర్ట్ రావడం ప్రాధాన్యం సంతరించుకుంది. ఈ హెచ్చరికలు ట్రంప్ నిర్ణయాన్ని ప్రభావితం చేసే అవకాశం ఉందని కొందరు అమెరికా అధికారులు భావిస్తున్నారు. మరోవైపు, తనపై హత్య కుట్రల గురించి ట్రంప్ కూడా ఇటీవల కీలక వ్యాఖ్యలు చేశారు. తుర్కియేలో నాటో సదస్సు సమయంలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ.. "అమెరికా అధ్యక్షుడిని అడ్డు తొలగించాలని వారు (ఇరాన్‌ను ఉద్దేశిస్తూ) కోరుకుంటున్నారు. నేను అందరి హిట్ లిస్ట్‌లో ఉన్నాను" అని వ్యాఖ్యానించారు.

## చావడానికైనా సిద్ధమే

మాట్లా డుతూ.. తాను అరెస్టు కావడా నికి లేదా చావడానికైనా సిద్ధం గా ఉన్నానని తెలిపారు. అయి తే, ఈ విషయంపై బంగ్లా ప్ర స్తుత ప్రభుత్వంతో ఎలాంటి సంప్రదింపులు జరపలేదని హ సీనా స్పష్టం చేశారు."స్వదే శానికి వెళ్లిన తర్వాత వాళ్లు నన్ను అరెస్టు చేయొచ్చు. చంపేసే అవకాశమూ ఉంది. అయినా నేను వెళ్లాలి. నా పార్టీ నేతలు, కార్యకర్తలు తీవ్రమైన అణచివేతకు గురవుతున్నారు. మరణం సంభవిస్తే.. నా తల్లిదండ్రులను ఖననం చేసిన చోట, నా సొంత గడ్డపైనే చనిపోవాలని కోరుకుంటున్నా" అని హసీనా పేర్కొన్నారు. ఏదేమైనా ఈ డిసెంబర్‌లో తనతో పాటు అవామీ లీగ్ పార్టీ సీనియర్ నేతలు స్వదేశానికి వెళ్లి కోర్టుల్లో లొంగిపోవాలని అనుకుంటున్నామని చెప్పారు. తన అప్పగింతపై భారత ప్రభుత్వానికి బంగ్లా అధికారులు అనేక లేఖలు రాస్తున్నారని.. ఈ నేపథ్యంలోనే ఈ నిర్ణయం తీసుకున్నానని పేర్కొన్నారు.బంగ్లాదేశ్‌లో ప్రభుత్వ వ్యతిరేక నిరసనలు హింసాత్మకంగా మారిన నేపథ్యంలో ఆగస్టు 5, 2024న దేశం విడిచి భారత్‌కు వచ్చిన షేక్ హసీనా ఇక్కడే ఆశ్రయం పొందుతున్న విషయం తెలిసిందే.

# మానవత్వం మంటగలిసింది
# కన్నతల్లికి బిడ్డ భారమైంది

**పసికందును రైలు పట్టాల పక్కన వదిలిపెట్టిన తల్లి**

- మగ శిశువు క్షేమం.. మక్తల్ ఆస్పత్రికి తరలింపు






**కృష్ణ, జూలై 10 (జనం సాక్షి) :** మానవత్వం మంట కలిసి పోతోంది. తల్లి దండ్రులు,తోబుట్టువులు, అన్నా, తమ్ములు ఒకరికొకరు భారమై దూరం చేసుకుంటున్న ఘటనలు సమాజంలో ఎక్కువయ్యాయి. ఆకోవలోనే 9 నెలలు మోసి జన్మ ఇచ్చి ప్రాణం పోసిన తల్లి ఏమైందో ఏమోకానీ పసికందు భారమై వదిలించుకున్న సంఘటన తెలంగాణ సరిహద్దులోని నారాయణపేట జిల్లా కృష్ణ మండల రైల్వే స్టేషన్ లో శుక్రవారం తెల్లవారు జామున వెలుగు చూసింది. రైల్వే ఎస్ఐ రాజు తెలిపిన వివరాల ప్రకారం.. పది రోజుల పసికందును, రైలు పట్టాల మూడో ప్లాట్ ఫారం, దగ్గర మహిళ, వదిలేసి పోయింది. కడుపులో పుట్టిన బిడ్డని, కనుపాపలా.. చూసుకోవాల్సిన తల్లి ఏమైందో ఏమో.! కర్కశంగా వదిలిపెట్టి వెళ్ళింది. శిశువు ఏడుపు విన్న స్థానికులు,రైల్వే పోలిసులు మునిస్వామి, సకాలంలో పసికందును, అంబులెన్స్ లో వెంటనే హాస్పిటల్ కు తరలించడంతో పెను విషాదం తప్పింది. పుట్టిన పసికందును రైల్వే స్టేషన్ మూడో ప్లాట్ఫారం పక్కనున్న కాలువలో ఎవరో వదిలేసి వెళ్ళి పోయారు. రైల్వే సిబ్బంది ఆ మగబిడ్డ సురక్షితంగా ప్రాణాలతో బయటపడేలా ఆదుకున్నారు. ఈ ఘటన పై సమాచారం అందుకున్న పోలీసులు దర్యాప్తు ప్రారంభించారు. పరిసరాల్లోని సీసీటీవీ కెమెరాలను పరిశీలిస్తున్నారు. అసలు ఆ బిడ్డను వదిలేసి వెళ్ళింది కన్నతల్లేనా? లేక మరెవరైనా ఈ ఘాతుకానికి ఒడిగట్టా రా?? అనే కోణంలో పోలీసు లు విచారణ జరుపుతు న్నారు.. ఏది ఏమైనా ఇలాంటి ఘటనలు చోటు చేసుకోవడం బాధాకరం దారుణం. అనంతరం నారయణ పేట చైల్డ్ వెల్ఫేర్ కమిటీ (సిడబ్ల్యూసి) సంక్షేమ, శ్రవణ కుమార్,సుజాత, అధికారులకు, అప్పగించమని పోలీస్ సిబ్బందిలు తెలిపారు. సహకరించిన స్థానికులకు అధికారులు, తదితరులు ధన్యవాదాలు తెలిపారు. ఎస్సై రాజు మునిస్వామి, విజయ్ కుమార్, రైల్వే క్రైమ్ పోలీస్ విజయ్ కుమార్, సుజాత, సర్పంచ్ సోలాపూర్ నాగేష్, అమర్ దీక్షిత్, అంబులెన్స్ వైద్యుల బృందం ఈ సంఘటనలో సహకరించారు.

## మీ ప్రమాణం యాప్‌తో పారదర్శక పాలనకు శ్రీకారం

- జిల్లా కలెక్టర్ భవేశ్ మిశ్రా



**నిర్మల్ బ్యూరో , జూలై 10,( జనంసాక్షి) :** ప్రభుత్వ శాఖల్లో పారదర్శకత, జవాబుదారీతనం పెంపొందించి ప్రజలకు వేగవంతమైన సేవలు అందించేందుకు మీ ప్రమాణం యాప్ తో పాటు ప్రభుత్వ ఉద్యోగుల హాజరు, పనితీరును పర్యవేక్షించే సమగ్ర డ్యాష్‌బోర్డ్ వ్యవస్థను అమల్లోకి తీసుకువస్తున్నట్లు జిల్లా కలెక్టర్ భవేశ్ మిశ్రా తెలిపారు. శుక్రవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో నిర్వహించిన సమీక్షా సమావేశంలో ఈఎస్‌డి కమిషనర్ రవికిరణ్ తో కలిసి ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, రెవెన్యూ, మీ–సేవ, వైద్య, విద్య తదితర శాఖల 70–80 శాతం సేవలను ఈ యాప్‌తో అనుసంధానం చేసి ఒకే వేదికపై ప్రజలకు అందుబాటులోకి తీసుకురానున్నట్లు చెప్పారు. ఆగస్టు 15 నాటికి ఈ వ్యవస్థను పూర్తిస్థాయిలో అమల్లోకి తీసుకువచ్చి, ప్రభుత్వ ఉద్యోగుల హాజరు, పనితీరు పర్యవేక్షణలో నిర్మల్ జిల్లాను రాష్ట్రానికి ఆదర్శంగా తీర్చిదిద్దుతామని కలెక్టర్ పేర్కొన్నారు. ఈ సమావేశంలో అదనపు కలెక్టర్ కిషోర్ కుమార్, ఈడీఎం నదీమ్, తహసీల్దార్లు, అధికారులు పాల్గొన్నారు.

## టీచర్‌గా మారిన అటెండర్

- ఇద్దరు టీచర్లు లీవ్...
- గాలిలో విద్యార్థుల చదువులు..!



**కుబీర్, జులై 10 (జనంసాక్షి):** కుబీర్ మండలంలోని అంతర్నీ ప్రభుత్వ పాఠశాలలో విద్యా వ్యవస్థ అస్తవ్యస్తంగా మారింది. ఇద్దరు ఉపాధ్యాయులు ఒకేసారి సెలవులో ఉండటంతో విద్యార్థులకు అటెండర్ గురువుగా మారి పాఠాలు బోధించడంతో విద్యాశాఖ పర్యవేక్షణ తీరుపై తీవ్ర విమర్శలకు దారితీసింది. ఉపాధ్యాయుల హాజరు, సెలవుల సమన్వయంపై సరైన పర్యవేక్షణ లేకపోవడం మండల స్థాయి అధికారుల నిర్లక్ష్యానికి నిదర్శనమనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఘటన అనంతరం సీఆర్పీని పంపినట్లు కాంప్లెక్స్ హెచ్ఎం దొంతుల సురేష్ వివరణ ఇచ్చారు. ఈ విషయమై జిల్లా ఉన్నతాధికారులకు సైతం సమాచారం ఇచ్చినట్లు స్పష్టం చేశారు. కాగా ముందస్తు చర్యలు చేపట్టడంలో జిల్లా విద్యాశాఖ యంత్రాంగం విఫలమైందనే విమర్శలు వ్యక్తమవుతున్నాయి. మండలంలోని ఇతర పాఠశాలల్లో ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా అధికారులు కఠిన చర్యలు తీసుకోవాలని పేరెంట్స్ హెచ్చరిస్తున్నారు. విద్యార్థుల చదువులకు ఆటంకం కలగకుండా ఉపాధ్యాయుల సమన్వయం, అధికారుల నిరంతర పర్యవేక్షణ తప్పనిసరిగా ఉండాలని విద్యావంతులు సూచిస్తున్నారు.

## మహబూబ్‌నగర్‌లో భారీగా డిఫెన్స్ మద్యం పట్టివేత

- కర్ణాటక నుంచి అక్రమంగా తరలిస్తున్న వ్యక్తి అరెస్ట్



**మహబూబ్‌నగర్,బ్యూరో జూలై 10 (జనం సాక్షి):** ఎక్సైజ్ శాఖ ప్రత్యేక తనిఖీల్లో కర్ణాటక రాష్ట్రానికి చెందిన డిఫెన్స్ మద్యం సీసాలతో ఓ వ్యక్తిని అధికారులు పట్టుకున్నారు. డిప్యూటీ కమిషనర్ విజయభాస్కర్ రెడ్డి ఆదేశాల మేరకు శుక్రవారం తెల్లవారుజామున మహబూబ్‌నగర్ పట్టణంలోని పాలమూరు విశ్వవిద్యాలయం సమీపంలోని అంతర్రాష్ట్ర రహదారిపై వాహనాల తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా కర్ణాటకలోని బెల్గాం నుంచి హైదరాబాద్‌కు వెళ్తున్న ఓ ప్రైవేట్ ట్రావెల్స్ బస్సును తనిఖీ చేయగా, కర్ణాటక రాష్ట్రంలోని బాగల్‌కోట్ జిల్లా కంబళి సిద్ధప్ప దాపాడ్ అనే వ్యక్తి వద్ద 30 డిఫెన్స్ మద్యం సీసాలు లభ్యమయ్యాయి. వీటి విలువ సుమారు రూ.10 వేలుగా అధికారులు అంచనా వేశారు. విచారణలో భాగంగా నేషనల్ హైవే–4పై ఉన్న హోటళ్లు, ధాబాల వద్ద ఈ మద్యం సీసాలను దింపి, ముందస్తుగా ఆర్డర్ ఇచ్చిన వ్యక్తులకు విక్రయిస్తున్నట్లు నిందితుడు వెల్లడించినట్లు అధికారులు తెలిపారు. మహబూబ్‌నగర్, జడ్చర్ల మరియు పరిసర ప్రాంతాల్లో జరిగే వివాహాలు, విందు కార్యక్రమాల కోసం కొందరు వ్యక్తులు ప్రైవేట్ ట్రావెల్స్ డ్రైవర్లతో కుమ్మక్కై ఇతర రాష్ట్రాల నుంచి డిఫెన్స్ మద్యాన్ని అక్రమంగా తెప్పిస్తున్నట్లు ఎక్సైజ్ శాఖకు సమాచారం అందిందన్నారు. ఇతర రాష్ట్రాల నుంచి అక్రమంగా తరలించే డిఫెన్స్ మద్యాన్ని కొనుగోలు చేయడం, నిల్వ చేయడం, వినియోగించడం చట్టరీత్యా నేరమని అధికారులు హెచ్చరించారు. తనిఖీల్లో ఎస్ఐ సుష్మ కసిరెడ్డి, నియాన్ గౌడ్, ఖదీర్, గోవిందు, లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

# తెలంగాణ సాంస్కృతిక అస్తిత్వాన్ని చాటిచెప్పే బోనాల జాతర

- ఉజ్జయిని శ్రీ మహంకాళి అమ్మవారి ఆషాఢ బోనాల జాతరను వైభవంగా నిర్వహించాలి
- విభాగాలన్నీ సహనంతో, సంయమనంతో వ్యవహరించాలి
- సికింద్రాబాద్ ఉజ్జయిని మహంకాళి బోనాల ఉత్సవాల సన్నాహక సమావేశంలో అధికారులకు ఆదేశాలు జారీచేసిన దేవాదాయ ధర్మాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ



**హైదరాబాద్ (జనంసాక్షి) :** తెలంగాణ ప్రజల ఆధ్యాత్మిక, సాంస్కృతిక అస్తిత్వాన్ని చాటిచెప్పే బోనాల జాతర రాష్ట్ర ప్రత్యేకతను ప్రపంచానికి చాటి చెప్తున్నదని అటవీ, పర్యావరణ, దేవాదాయ ధర్మాదాయ శాఖామాత్యులు కొండా సురేఖ అన్నారు. తెలంగాణ ఆధ్యాత్మిక వైభవానికి ప్రతీకగా నిలిచిన సికింద్రాబాద్ ఉజ్జయిని శ్రీ మహంకాళి అమ్మవారి ఆషాఢ బోనాల జాతరను భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా అత్యంత ఘనంగా నిర్వహించాలని మంత్రి అధికారులను ఆదేశించారు. సికింద్రాబాద్ లోని ఉజ్జయిని శ్రీ మహంకాళి అమ్మవారి దేవస్థానంలో ఆషాఢ బోనాల జాతర ఏర్పాట్లపై దేవాదాయశాఖతో పాటు సంబంధిత శాఖల అధికారులతో మంత్రి సురేఖ సన్నాహక సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయ అధికారులు, ఇతర శాఖల అధికారులు జాతర ఏర్పాట్లపై మంత్రి సురేఖకు వివరించగా, మంత్రి సురేఖ వారికి సలహాలు, సూచనలు చేశారు. ఈ కార్యక్రమంలో సనత్ నగర్ నియోజకవర్గం మాజీ ఎమ్మెల్యే మర్రి శశిధర్ రెడ్డి, దేవాదాయ శాఖ డైరక్టర్ హనుమంతరావు, డిసిపి (సికింద్రాబాద్ జోన్) రక్షితా కృష్ణ మూర్తి, అడిషనల్ డిసిపి (ట్రాఫిక్) రాములు, సాంస్కృతిక శాఖ డైరక్టర్ ఏనుగు నర్సింహారెడ్డి, దేవాదాయ శాఖ ఆర్జెసి రామకృష్ణారావు, డిసి వినోద్ రెడ్డి, ఏసిలు మనోహర్ రెడ్డి, శ్రీనివాస్, జిహెచ్ఎంసి, ఐ అండ్ పిఆర్, వైద్యారోగ్యశాఖ, ఆర్ అండ్ బి, పోలీస్, విద్యుత్, అగ్నిమాపక శాఖ, టిజిఆర్టిసి తదితర శాఖలకు చెందిన అధికారులు, సనత్ నగర్ నియోజకవర్గ కాంగ్రెస్ ఇంఛార్జ్ కోట నీలిమ, దేవాలయ కమిటి సభ్యులు, దక్కన్ మానవ సేవా సమితి, నల్లగుట్ట అభివృద్ధి సంఘం, మన్నూరు కాపు సంఘం, ఆర్యవైశ్య సేవా సమితిలకు చెందిన పలువురు ప్రతినిధులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి సురేఖ మాట్లాడుతూ తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు, ఆధ్యాత్మిక వారసత్వానికి ప్రతీకగా నిలిచిన బోనాల జాతరకు రాష్ట్రం నలుమూలల నుంచి లక్షలాది మంది భక్తులు తరలివస్తారని, ఈ నేపథ్యంలో భక్తులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా అన్ని శాఖలు సమన్వయంతో పనిచేయాలని మంత్రి సూచించారు. బోనాల జాతర సందర్భంగా జూలై 19న ఘటం ఎదుర్కోలు, ఆగస్టు 2న బోనాల ఉత్సవాలు, ఆగస్టు 3న రంగం (భవిష్యవాణి), గజారోహణ మహోత్సవం కార్యక్రమాలను వైభవోపేతంగా నిర్వహించాలని మంత్రి సురేఖ ఆదేశించారు. జూలై 19 న ఘటోత్సవముల ప్రారంభం నుంచి ఆగష్టు 3న రంగం కార్యక్రమం వరకు అమ్మవారి ఆలయాన్ని సర్వాంగ సుందరాంగ తీర్చిదిద్దాలని మంత్రి సురేఖ దేవాదాయ శాఖకు సూచించారు. భక్తుల రద్దీని దృష్టిలో ఉంచుకుని వృద్ధులు, దివ్యాంగులకు, పిల్లలు, బాలింతలు, గర్భిణులకు ప్రత్యేక క్యూ లైన్లు, ప్రత్యేక దర్శన ఏర్పాట్లు చేయాలని నిర్దేశించారు. బోనాల ఉత్సవాల్లో అమ్మవారిని దర్శించుకునేందుకు, బోనాలు సమర్పించేందుకు వచ్చే శివసత్తులకు ప్రత్యేక క్యూలైన్, సులభ దర్శనం, అవసరమైన సౌకర్యాలు కల్పించాలని మంత్రి సంబంధిత అధికారులను ఆదేశించారు. గత బోనాల ఉత్సవాల్లో వారి నుంచి వచ్చిన వినతుల మేరకు ఈ నిర్ణయం తీసుకున్నట్లు మంత్రి సురేఖ తెలిపారు. "ఉజ్జయిని మహంకాళి అమ్మవారి బోనాల జాతర తెలంగాణ ప్రజల ఆధ్యాత్మిక విశ్వాసానికి, సాంస్కృతిక వైభవానికి ప్రతీక. భక్తులకు సురక్షితమైన, సౌకర్యవంతమైన దర్శనం కల్పించడం ప్రభుత్వ బాధ్యత. అందుకు అవసరమైన అన్ని చర్యలను ప్రభుత్వం తీసుకుంటున్నది" అని మంత్రి సురేఖ పేర్కొన్నారు.

## క్యూఆర్ కోడ్‌తో నూతన హెల్త్‌కార్డులు డౌన్‌లోడ్ చేసుకోండి

**హైదరాబాద్ (జనంసాక్షి) :** క్యూఆర్ కోడ్‌తో నూతన హెల్త్ కార్డులు మొబైల్ నుండి డౌన్లోడ్ చేసుకోవచ్చని, అన్ని వివరాలతో ఈహెచ్‌సీటీ యాప్ రూపొందిస్తారని తెలంగాణ ఆల్ పెన్షనర్స్ అండ్ రిటైర్డ్ పర్సన్స్ అసోసియేషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పాలకుర్తి క్రిష్ణ మూర్తి, రాష్ట్ర ఆర్థిక కార్యదర్శి జి.అశోక్‌రాష్ట్ర ఆర్థిక కార్యదర్శి తెలిపారు.ఎంప్లాయీస్ హెల్త్ కేర్ ట్రస్ట్ బోర్డు సమావేశం శుక్రవారం మధ్యాహ్నం నూతన సిఎస్ సంజయ్ జాజు అధ్యక్షతన సచివాలయంలో జరిగింది. ఈ సమావేశంలో జిఏడి ప్రత్యేక ప్రధాన కార్యదర్శి బెన్హర్ మహేశ్ దత్ ఎక్కా, వైద్య ఆరోగ్యశాఖ కార్యదర్శి క్రిస్టినా జడ్ చోంగ్తు, ఈహెచ్ఎస్ సిఈఓ హనుమంతు కొడింబా, ఉద్యోగ, పెన్షనర్ల సంఘాల ప్రతినిధులు చావ రవి, మారం జగదీశ్వర్, ఏలూరి శ్రీనివాసరావు, పి క్రిష్ణ మూర్తి తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా చికిత్సలకు సీజీహెచ్ఎస్ రేట్లు వర్తింపజేస్తారని, నాలుగు రోజుల్లో నూతన ఈహెచ్ఎస్ మార్గదర్శకాల జిఓ విడుదల చేస్తారని, జులై 15 నుండి నూతన హెల్త్ కార్డులపై చికిత్సలు ప్రారంభమవుతాయని, రాష్ట్ర వ్యాప్తంగా 943 హాస్పిటల్స్ లో హెల్త్ కార్డులపై నగదు రహిత వైద్య సేవలు అందుబాటులో ఉంటాయని, 2594 ప్రొసీజర్స్ కవర్ అవుతాయని తెలిపారు. ఇప్పుడున్న 12 వెల్ నెస్ సెంటర్లకు తోడు మరో 24 జిల్లా కేంద్రాల్లో నూతన వెల్ నెస్ సెంటర్లు ఏర్పాటు చేస్తారు. అవుట్ పేషెంట్ ట్రీట్మెంట్, పరీక్షలు, రోజువారీ ఔషధాలు వెల్ నెస్ సెంటర్ల లో అందుబాటులో ఉంటాయి. సమావేశ అనంతరం తెలంగాణ ఆల్ పెన్షనర్స్ అండ్ రిటైర్డ్ పర్సన్స్ అసోసియేషన్ నుండి సోమవారం వరకు వచ్చే సమగ్ర ఉత్తర్వులలో కొన్ని మార్పులు, చేర్పులు చేయాలని ప్రాతినిధ్యం చేయనైనది. భార్య, భర్త ఇద్దరు పెన్షనర్లు అయినపుడు ఒకరినుండి కాంట్రిబ్యూషన్ మనహాయించేలా, ఒక ఉద్యోగి కుటుంబ పెన్షన్ కూడా తీసుకుంటూ ఉంటే వేతనం, పెన్షన్ రెండింటిలో ఒక దానిపైనే మినహాయింపు చేసేలా, ఎన్ఏబీ హెచ్ అక్రిడేషన్ కలిగిన అన్ని ఆసుపత్రులలో వైద్యం అందేలా, ఏదైనా ఒక హాస్పిటల్ ని ఎంపానెల్ హాస్పిటల్స్ లిస్టులో చేర్చినపుడు ఆ ఆసుపత్రి లోని కొన్ని విభాగాలలోనే వైద్యం అందించేలా కాకుండా అన్ని విభాగాలలో వైద్యం అందించే ఏర్పాటు ఉండాలనీ సూచించారు. కో పేయిమెంట్ విధానం ఉండకూడదనీ ఉంటే దానికి పేషెంట్ చెల్లించే దానికి రీ ఎంబర్స్ మెంట్ ఉండేలా, అత్యవ సర పరిస్థితి లో ఎంపానెల్ కాని ఆసుపత్రిలో నగదు చెల్లించి వైద్యం చేయించుకుంటే సమగ్ర విధానంతో చెల్లించిన నగదుని రీఎంబర్స్ మెంట్ చేసే విధానం రూపొందిం చాలనీ, పక్క రాష్ట్రంలో ముఖ్యంగా విజయవాడ, కర్నూలు, బెంగుళూరు, చెన్నైం, ఢిల్లీ తదితర పట్టణాలలో అత్యవసర చికిత్స చేయించుకుంటే రీ ఎంబర్స్ మెంట్ విధానం రూపొందించాలని కోరారు.



## ట్రాక్టర్ డ్రైవర్‌పై అటవీశాఖ అధికారి దాడి

**దస్తూరాబాద్, జూలై 10 (జనంసాక్షి):** మండల కేంద్రంలోని మున్యాల్ గ్రామానికి చెందిన ట్రాక్టర్ డ్రైవర్ రాజ్ కుమార్ పై అన్యాయం గా ఫారెస్ట్ అధికారి దాడి చేశారని బాధితుడు తెలిపారు. ఆయన మాట్లాడుతూ ఇందిరమ్మ ఇళ్లకు పట్టా భూమి నుండి ఇసుక తీసుకెళ్లంగా అక్రమంగా ఇసుకను తరలిస్తున్నావని తనపై సెక్షన్ ఆఫీసర్ కింగ్ ఫిషర్ దాడి చేసి చితక బాదాడని బాధితుడు తెలిపారు. తనపై దాడి చేసిన ఫారెస్ట్ అధికారులపై చర్యలు తీసుకోవాలని కులం పేరుతో దూశించాడని ఫారెస్ట్ సెక్షన్ ఆఫీసర్ కింగ్ ఫిషర్ పై చట్ట ప్రకారం చర్యలు తీసుకోవాలని రోడ్డుపై బాధితులు బైఠాయించారు.

## హీరో అవకాశం ఇస్తామంటూ మూడున్నర కోట్లు వసూలు

**పిల్ల జమీందార్ నిర్మాత, దర్శకులపై కేసు**

**హైదరాబాద్, జూలై10 (జనంసాక్షి) :** తెలుగు సినిమా రంగంలో హీరోగా ఎంట్రీ ఇప్పిస్తామంటూ భారీ మోసానికి పాల్పడిన వ్యవహారంలో టాలీవుడ్ హిట్ చిత్రం 'పిల్ల జమిందార్' దర్శకుడు గుడ్లూరి అశోక్ బాబు, నిర్మాత విజయలక్ష్మిలపై సైబరాబాద్ పోలీస్ పరిధిలో కేసు నమోదైంది. బాధితుల కథనం ప్రకారం.. ఒక యువకుడిని టాలీవుడ్‌లో హీరోగా పరిచయం చేస్తామంటూ నమ్మించిన దర్శకుడు అశోక్ బాబు, సదరు యువకుడి తల్లిదండ్రుల నుండి విడతల వారీగా దాదాపు రూ.3.5 కోట్ల రూపాయలు వసూలు చేశారు. అయితే, డబ్బులు తీసుకుని చాలా కాలం గడుస్తున్నా సినిమా ఊసే ఎత్తకపోగా, యువకుడిని హీరోగా లాంచ్ చేయడంలో పూర్తిగా విఫలమయ్యారు. దీనితో మోసపోయామని గ్రహించిన బాధితులు తమ డబ్బులను తిరిగి ఇవ్వాల్సిందిగా నిలదీశారు. తీసుకున్న భారీ మొత్తాన్ని తిరిగి ఇచ్చేందుకు కూడా నిరాకరించడంతో, బాధితులు న్యాయం కోసం పోలీసులను ఆశ్రయించారు. బాధితుల ఫిర్యాదు మేరకు సైబరాబాద్ ఆర్థిక నేరాల విభాగానికి చెందిన పోలీసులు దర్శకుడు గుడ్లూరి అశోక్ బాబుతో పాటు నిర్మాత విజయలక్ష్మిపై కేసు నమోదు చేశారు. ప్రస్తుతం వీరిద్దరిని అదుపులోకి తీసుకుని పోలీసులు విచారిస్తున్నారు. టాలీవుడ్‌లో ఈ తరహా మోసం బయటపడటం ఇప్పుడు ఇండస్ట్రీ వర్గాల్లో తీవ్ర సంచలనంగా మారింది.

## విద్యార్థులకు నాణ్యమైన విద్య అందించాలి

- ఆధునిక బోధన పద్ధతులను అలవర్చుకోవాలి
- మంచిర్యాల జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్



**మంచిర్యాల ప్రతినిధి, జూలై 10 (జనంసాక్షి) :** ఉపాధ్యాయులు తమ బోధన నైపుణ్యాలను నిరంతరం పెంపొందించుకోవడం ద్వారా విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందించవచ్చని జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ అన్నారు. శుక్రవారం మంచిర్యాల జిల్లా కేంద్రంలోని జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాలలో భౌతిక శాస్త్రం ఉపాధ్యాయులు, ఉపాధ్యాయులకు నిర్వహించిన సమగ్ర ఉపాధ్యాయ శిక్షణ కార్యక్రమానికి హాజరయ్యారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలోని ప్రభుత్వ పాఠశాలలలో వివిధ సబ్జెక్టుల ఉపాధ్యాయులు తమ బోధన నైపుణ్యాలను కాలానుగుణంగా మెరుగుపరుచుకోవాలని, భౌతిక శాస్త్ర బోధనలో సాంకేతిక పరిజ్ఞానాన్ని సమర్థవంతంగా వినియోగించి విద్యార్థులలో శాస్త్రీయ దృక్పథాన్ని పెంపొందించాలని తెలిపారు. శిక్షణ కార్యక్రమాల ద్వారా ఉపాధ్యాయులు తమ వృత్తి నైపుణ్యాలను మరింత అభివృద్ధి చేసుకోవాలని, సమగ్ర విద్య అభ్యసన కార్యక్రమాలలో చురుకుగా పాల్గొని ఆధునిక బోధన పద్ధతులను అలవర్చుకోవాలని తెలిపారు. ఉపాధ్యాయులు చెప్పిన దానికంటే విద్యార్థులు చూస్తూ నేర్చుకుంటారని, ప్రతి విద్యార్థికి డిజిటల్ లిటరసీపై అవగాహన కల్పించడంతో పాటు విద్యార్థులతో ప్రయోగాలు చేయిస్తూ, కృత్యాధార బోధన ద్వారా అభ్యసనాన్ని ఆసక్తికరంగా తీర్చిదిద్దాలని తెలిపారు. విద్యార్థులలో సృజనాత్మకత, సమస్య పరిష్కార నైపుణ్యాలు, శాస్త్రీయ ఆలోచనా విధానాన్ని పెంపొందించేందుకు ఉపాధ్యాయులు కృషి చేయాలని తెలిపారు. ప్రభుత్వ పాఠశాలలలో విద్యార్థులకు అవసరమైన అన్ని సౌకర్యాలు కల్పించడం జరుగుతుందని, సరిపడా ఉపాధ్యాయులను నియమించడం జరిగిందని తెలిపారు. జిల్లాలోని ప్రాథమిక, ప్రాథమిక ఉన్నత, ఉన్నత పాఠశాలలో తరగతి గదులు, త్రాగునీరు, విద్యుత్, ప్రహరీ గోడ, మూత్రశాలలు వంటి అనేక సదుపాయాలు కల్పించడం జరుగుతుందని, ప్రైవేట్ పాఠశాలల నుండి ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థులు చేరుతున్నారని తెలిపారు. విద్యార్థుల తల్లిదండ్రులతో మాట్లాడి క్రమం తప్పకుండా విద్యార్థులు పాఠశాలకు హాజరయ్యేలా ఉపాధ్యాయులు కృషి చేయాలని తెలిపారు. జిల్లాలోని అన్ని ప్రభుత్వ పాఠశాలలు, కస్తూరిబా గాంధీ బాలికల విద్యాలయాలు, ఆదర్శ పాఠశాలలు, గురుకులాలు, ఆశ్రమ పాఠశాలలలో విద్యార్థుల సంఖ్య పూర్తి స్థాయిలో ఉందని, ఖాళీగా ఉన్న చోట విద్యార్థుల సంఖ్య పెంపొందించేలా కృషి చేయాలని తెలిపారు. విద్యాశాఖ జిల్లా, మండల అధికారులు క్రమం తప్పకుండా తమ పరిధిలోని పాఠశాలలను పర్యవేక్షిస్తారని, వార్షిక పరీక్షలలో ఉత్తమ ఫలితాల సాధన దిశగా ఉపాధ్యాయులు సమన్వయంతో కృషి చేయాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో సంబంధిత అధికారులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

# గణితం ద్వారా సులువైన పరిష్కారాలు

- గీతం ఐఐటీ బాంబే ఆచార్యుడు శివాజీ గణేష్




**పటాన్‌చెరు, జులై 10(జనంసాక్షి) :** 'ఒక ఆలోచన, మూడు సమస్యలు, ఒక పద్ధతి' అనే సూత్రం ద్వారా మనకు ఎదురయ్యే సవాళ్లకు గణిత శాస్త్రం ద్వారా పరిష్కారాలను చూపొచ్చని ఇండియన్ ఇన్ స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ (ఐఐటీ) బొంబాయికి చెందిన ప్రొఫెసర్ శివాజీ గణేష్ అన్నారు. గీతం డీమ్డ్ విశ్వవిద్యాలయం, హైదరాబాదులో 'పాక్షిక అవకలన సమీకరణాలు (పీడీఎఫ్ లు), వైవిధ్య విశ్లేషణ' అనే అంశంపై శుక్రవారం ఆయన ఆతిథ్య ఉపన్యాసం చేశారు. స్కూల్ ఆఫ్ సైన్స్ లోని గణిత, గణాంక శాస్త్ర విభాగం ఏర్పాటు చేసిన ఈ కార్యక్రమంలో ఆయన వైవిధ్య విశ్లేషణ పునాదులను సదస్యులకు పరిచయం చేశారు. ఒక అంతరంలోని ప్రమేయాల నుంచి డైరిక్లెట్ సూత్రం వరకు గల ప్రయాణాన్ని వివరించారు. వైవిధ్యాల కలన శాస్త్రంలో ప్రత్యక్ష పద్ధతిని ఉపయోగించి కనిష్ఠీకరణల ఉనికిని వెల్లడించారు. ఒక సంవృత అంతరంలో అవిచ్ఛిన్న ప్రమేయం(=గీఅ)లో రేఖీయ వ్యవస్థ, ప్రమేయ అంతరాళంలో ఒక సరిహద్దు విలువ సమస్య -- అనే వేర్వేరుగా కనిపించే మూడు గణిత సమస్యలను, ఒక శక్తి ప్రమేయాన్ని కనిష్ఠీకరించే భావన ద్వారా ఎలా ఏకీకృతం చేయవచ్చో ప్రొఫెసర్ శివాజీ ప్రదర్శించారు. సమీకరణాలను నేరుగా పరిష్కరించడం ద్వారా కాకుండా, ప్రత్యక్ష పద్ధతిని (డైరెక్ట్ మెథడ్) ఉపయోగించడం ద్వారా పరిష్కారాల ఉనికిని స్థాపించవచ్చని ఆయన వివరించారు. ఈ ప్రత్యక్ష పద్ధతిలో, ఒక కనిష్ఠీకరణ క్రమాన్ని నిర్మించడం, ఒక అభిసరణ ఉపక్రమాన్ని సంగ్రహించడం, విరామం తీసుకోవడం వంటివి ఉంటాయన్నారు. గణిత, గణాంక శాస్త్ర విభాగాధిపతి డాక్టర్ జాదవ్ గణేష్, ప్రొఫెసర్ బి.ఎం.నాయుడు, డాక్టర్ శివారెడ్డి శేరిల సమక్షంలో స్కూల్ ఆఫ్ సైన్స్ డైరెక్టర్ డాక్టర్ మోతెహర్ రెజా అతిథిని సత్కరించారు. ఈ కార్యక్రమాన్ని అసోసియేట్ ప్రొఫెసర్ డాక్టర్ డి.మల్లికార్జునరెడ్డి, అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ కృష్ణ కుమ్మరి సమన్వయం చేశారు.

బహుభార్యత్వంపై కొరడా..

# నిర్లక్ష్యానికి గురైన భార్యల మాటేంటి?

సంపాదకీయం

అసోం ప్రభుత్వం బహుభార్యత్వం పాటించే ఉద్యోగులపై కఠిన చర్యలు తీసుకుంటామని 2026–27 బడ్జెట్‌లో ప్రకటించింది. ఒకటి కంటే ఎక్కువ మందిని పెళ్లాడే ప్రభుత్వ ఉద్యోగులను ఉద్యోగాల నుంచి తొలగిస్తామని, వారికి సంక్షేమ పథకాలు కూడా అందవని ఆర్థిక మంత్రి జయంత మల్లా బారువా అసెంబ్లీలో స్పష్టం చేశారు. మహిళా సాధికారత, లింగ సమానత్వం దిశగా ఇది ఒక ముందడుగుగా అధికార పక్షం చెప్పుకుంటోంది. కానీ ఈ ప్రకటన స్వాగతించదగినదే అయినా, అసలు ప్రశ్న వేరే ఉంది. బహుభార్యత్వం ఒక సమస్యే కావొచ్చు, కానీ అంతకంటే ఎక్కువ మంది మహిళలు ఎదుర్కొంటున్న వాస్తవ సమస్య వేరొకటి ఉంది. విడాకులు ఇవ్వకుండానే భార్యను వదిలేసి, ఆమెను ఆర్థికంగా, సామాజికంగా అనిశ్చితిలో నెట్టేసే భర్తలు. చట్టపరంగా విడాకులు తీసుకోకపోవడం వల్ల ఆ మహిళలు మళ్లీ పెళ్లి చేసుకోలేరు, భరణం కోసం ఏళ్ల తరబడి కోర్టుల చుట్టూ తిరగాల్సి వస్తుంది, సమాజంలో గుర్తింపు కూడా అస్పష్టంగానే మిగిలిపోతుంది. ఈ దీర్ఘకాలిక వేధింపుపై ప్రభుత్వాలు ఇప్పటివరకు తీసుకున్న నిర్దిష్ట చర్యలు ఏంటి అన్నది స్పష్టత లేని అంశం.

మహిళా భద్రత, గౌరవం విషయంలో రాజకీయ పార్టీల చిత్తశుద్ధిని ప్రశ్నించే సందర్భాలు గతంలో కూడా ఉన్నాయి. గుజరాత్‌లో బిల్కిస్ బానో సామూహిక అత్యాచార కేసులో దోషులుగా తేలిన వ్యక్తులను 2022లో జైలు నుంచి విడుదల చేసి, కొందరు వారికి సన్మానం చేసిన ఘటన దేశవ్యాప్తంగా తీవ్ర విమర్శలకు దారితీసింది. ఆ తర్వాత సుప్రీంకోర్టు జోక్యం చేసుకుని 2024లో ఆ శిక్ష తగ్గింపు నిర్ణయాన్ని రద్దు చేసింది. ఇలాంటి సంఘటనలు జరిగినప్పుడు మహిళా పక్షాన నిలబడాల్సిన రాజకీయ వ్యవస్థలు మౌనం వహించడం లేదా అస్పష్టంగా వ్యవహరించడం చూస్తే, కేవలం బహుభార్యత్వంపై బడ్జెట్ ప్రకటనలు చేయడం సరిపోతుందా అన్న సందేహం సహజంగానే తలెత్తుతుంది.

*నిజాయితీగా మహిళా సంక్షేమం కోరుకునే ఏ ప్రభుత్వమైనా కేవలం ఒక కోణంలో మాత్రమే కాకుండా, భార్యను నిర్లక్ష్యం చేయడం, విడాకులు ఇవ్వకుండా వదిలేయడం, గృహహింస, న్యాయస్థానాల్లో జాప్యం వంటి అంశాలపై కూడా అంతే స్పష్టమైన విధానాన్ని ప్రకటించాలి. లేకపోతే ఇలాంటి ప్రకటనలు ఎన్నికల ముందు మహిళా ఓటర్లను ఆకట్టుకునే ప్రచార అస్త్రాలుగానే మిగిలిపోయే ప్రమాదం ఉంది.*

# పువ్వులైనా,రాళ్లయినా సమానమే



పువ్వులు పడ్డాయని పొంగిపోయేది లేదు.రాళ్లు విసుర్తున్నారని కుంగిపోయేది లేదు.ఒక దారిని ఎంచుకుని నడుస్తున్నప్పుడు అడ్డదారులు తొక్కేదేలేదు.నా వ్యక్తిగత జీవితంలోనూ, సాహిత్య జీవితంలోనూ ఒక మనిషి పుట్టిన కులం, మతం, ప్రాంతం ఆధారంగా ద్వేషించడమనే సంకుచిత బుద్దులు ఎప్పుడూ లేవు.. నేనెప్పుడూ పీడిత ప్రజల పక్షపాతిని.పీడితుల్లో కూడా కులం,మతం, ప్రాంతం వెతికే కుత్సితుడ్ని కాను.పీడకుడు ఏ కులం వాడైనా,ఏ మతం వాడైనా వ్యతిరేకిస్తూనే రాశాను.నేను నమ్మిన ఇస్లామియా తాత్వికత చాలా విశాలమైనది,ప్రగతిశీలమైనది.భారత రాజ్యాంగం ప్రవచించిన లౌకిక విలువలకు కట్టుబడింది. ఎల్లప్పుడూ ముస్లింల జీవితాలపై మాత్రమే కవిత్వం రాయాలనే సంకుచిత భావాలేం లేవు.ఎక్కడ దుఃఖం ఉంటే అది నా దుఃఖమే అవుతుంది.ప్రస్తుత కాలంలో అత్యంత పీడనకు,వంచనకు గురి అవుతున్నది ముస్లిం సమాజమే.ముస్లింల చుట్టూ ఎన్నో అపోహలు, అపార్థాలు వ్యాపించి ఉన్నాయి.అలాంటప్పుడు ఈ సమాజంలో పుట్టి పెరిగిన కవిగా వీటిని తొలిగించడమనే బాధ్యత నాపై ఉందనుకున్నాను.అందుకే ముస్లిం అస్థిత్వం, అభద్రత, ఆవేదన, ఇస్లామోఫోబియా, ముస్లిం ఫోబియా నా కవితా వస్తువులయ్యాయి. వీటిని కవిత్వీకరించటం నా సాహిత్య జీవితంలో ఓ భాగమయ్యింది. గత ముప్పయి అయిదు సంవత్సరాల నుండి కవిత్వం రాస్తున్న నేను ఇస్లాం శాంతిని, ప్రేమను బోధిస్తుంది అని చెప్పిన కారణంగా, ముస్లిం అస్థిత్వం, అభద్రత,ఆవేదన వ్యక్తీకరించిన కారణంగా తెలుగు సాహిత్యంలో ఎంతో వివక్షతను ఎదుర్కొన్నాను.. ఇప్పటికీ ఎదుర్కొంటున్నాను.అయినా వెనుకడుగు వేసేదే లేదు.

చాలామంది ప్రోగ్రెసివ్ అని చెప్పుకునే వాళ్ల అంతరాలలో కూడా ముస్లిం సంస్కృతి పట్ల అంతులేని విద్వేషం గమనించాను.ఏ ముస్లిం కవి ఐనా ఇస్లాంను, ముస్లిం జీవన విధానంలో భాగమైన టోపీలను,గడ్డాలను, హిజాబ్లను విమర్శిస్తే గొప్ప సంస్కరణవాది అని కితాబులిస్తారు,వేదికలిస్తారు. ఆశ్చర్యం ఏమంటే దీనినే ముస్లిం సాహిత్యమని దబాయిస్తారు.వీరి మెప్పు కోసం ముస్లిం సంస్కృతిని బోనులో నిలబెట్టే మునాఫిక్లు(కపటులు) ఎంతో కొంత శాతం ముస్లిం కవుల్లో ఎప్పుడూ ఉంటారు.ఇస్లాం శాంతిని బోధిస్తుంది అంటే మాత్రం అది మతం,మతం గురించి మాట్లాడకూడదంటూ ఆంక్షలు విధిస్తారు.మా రాజ్యాంగ హక్కుల్ని నిరాకరిస్తారు.అంటే ముస్లిం జీవన విధానం ఎల్లప్పుడూ దూషించబడుతూ,ద్వేషించబడుతూ ఉండాలన్నదే వీరి కోరిక..ప్రపంచాన్ని గుప్పిట్లో పెట్టుకున్న సామ్రాజ్యవాద శక్తులు , దేశీయ ఫాసిస్టు శక్తులు ఇస్లాం ఉగ్రవాదమని, ముస్లింలు హింసావాదులని దుష్ప్రచారం చేస్తుంటే –ఈ ఫోబియా మూకుమ్మడి దాడులకు కారణమౌతుంటే కనీసం ఇస్లాం శాంతిని బోధిస్తుందని,మా జీవన విధానం శాంతి,ప్రేమలతో ముడిపడిఉందని మేం సాహిత్యంలో చెప్పు కోకూడదా? అలా చెప్పుకుంటే మతమౌతుందా ?ఇస్లామే రాజ్యమేలాలని,ముస్లింలే పల్లకీలెక్కాలని మేం కోరుకోవడం లేదు.భిన్న విశ్వాసాలు,భిన్న సంస్కృతులు ఉన్న సాగర సంగమం భారతదేశం.అన్ని వర్గాల ప్రజలు ప్రాతినిధ్యం వహించే మతాతీత ,కులాతీత,సామాజిక, ఆర్థిక అసమానతలు లేని నిజమైన సెక్యులర్, సోషలిస్టు రాజ్యమే మా ఆకాంక్ష.మా మురసం సాహిత్యోద్యమ అంతిమ లక్ష్యం ఇదే...

**- కవి కరీముల్లా**

## 'మన బడి- మన భవిష్యత్తు'

నిన్నటి లాగే ఇవ్వాళ కూడా
చాంతాడంత వరుస క్రమం..
కాసింత చాటు కల్పించడానికి
ఎన్నేళ్ళు కావాలి??
తమ వంతు కోసం
వేచి ఉండటానికి
వరుసలో నిలబడి.. నిలబడీ..
ఆ బంగారు తల్లుల మనస్సు
ఎన్నిసార్లు గాయపడిందో!!
లెక్కకట్ట గలమా??
పొత్తి కడుపును చేత్తో పట్టుకొని
కాల చాక్రాన్ని మోసే ఆడపిల్లల
భరించలేని బాధకు
నాలుగు గోనె సంచులతో
అడ్డు తెరలుగా ఇంత చాటు
ఏర్పాటు చేసుకోవడం
ఎంత దౌర్భాగ్యం!?
కాలకృత్యాలు తీర్చుకోవడం కోసం
కోడి కూతకన్న ముందే లేచి
చెరువులు, వాగులు చెంతకు
చేరుతున్న
వసతి గృహ విద్యార్థులు ఎందరో?!
ఆరు బయట పొంచి వుండే
ప్రమాదాలతో
నిత్యం వాళ్లకు ఒక పోరాటమే!
80 సంవత్సరాల పాలనలో
భావి పౌరులు మరుగుదొడ్లు లేక, బహిరంగ
ప్రదేశాలలో
కాలకృత్యాలు తీర్చుకోవడం స్వతంత్ర
భారతదేశంలో సిగ్గుపడాల్సిన విషయమే గదా!!
కనీస సౌకర్యాలకు నోచుకోని
ప్రభుత్వ పాఠశాలలు,
వసతి గృహాల గణాంకాలు చూసి
ఉలిక్కిపడ్డమే తప్ప
ఏమీ చెయ్యలేమా??
విద్యార్థులందరికి భయాలు లేని
కనీస సౌకర్యల వసతి కల్పన
నాణ్యమైన విద్య,ఆరోగ్యకరమైన
జీవనశైలి,వ్యాయామం ఇవ్వన్నీ
వుండే వికసిత్ భారత్ ఎప్పుడు వస్తుందో!!
ఆత్మవిశ్వాసమే ఆయుధమయ్యే
నవ భారత విద్యార్థుల కలలు
ఎప్పుడు ఫలిస్తాయో?
వేచి చూడాలి

**డా. ఇక్బాల్ పాషా**
**9440775732**



## పరిష్వంగం

దేశంలో భిన్నత్వం!
వేల కులాలు
బహు మతాలు
భాషలు ప్రాంతాలు!
ఐనా ఏకత్వం!
భారతీయులంతా
అన్నదమ్ములు
అక్కాచెల్లెళ్ళు!
నాటి నాయకులు
ఇచ్చిన నినాదం
ఇన్నాళ్లు మనల్ని
కలిపి ఉంచింది!
ఇప్పుడు దేశంలో
గాలి దుమారం
దెయ్యాల ఘోష
భూత మాంత్రికం!
దేశానికేమైంది?
మతంమతంఅంటూ
మత పిచ్చిపట్టింది
పట్టించారు 'వీళ్లు'!
రాజ్యాంగం గొప్పదే!
నడిపించేవాళ్ళ
దుష్టత్వం ఇదంతా!
భ్రష్టుపట్టించారు!
రాజ్యాంగం దుష్టుల
చేతిలో పడితే
ఏమౌతుందో
అంబేద్కర్ ఆనాడే
విస్పష్టంగా చెప్పాడు!
ప్రపంచం దిశగా
మనిషి
విశాల మౌతుంటే
మతం దిశగా
సంకుచిత
పరచే మూర్ఖులు
వీళ్లు!
మతం దుష్ట 'అస్త్రం'
మనకది పాత
చరిత్రే!
సైన్స్ రాకడతో
మతం
పాత్ర ముగిసింది!
మనిషి ప్రయాణం
అరణ్యాలనుండి
లక్షలసంవత్సరాల
ప్రజా ప్రస్థానం!
అంధకారం నుండి
వెలుగులోకి!ఇంతలో
మతదెయ్యాలు
దీపం ఆర్పేశాయి!
ఐనా ఆగదు
ఈ ప్రయాణం!
జ్యోతి వెలిగిస్తాం!
చీకటి తొలగిస్తాం!
జ్ఞానులందించిన
నినాదం మదిలో
ప్రతిధ్వనిస్తోంది!
భిన్నత్వంలోఏకత్వం!
వివక్షలు విభేదాలు
ఎన్నికల్పించినా
పాలకుల కౌంట్
డౌన్
ప్రారంభమైంది!
భారతీయులేకాదు
ప్రపంచమంతా
ఒకే నినాదం!
మానవులంతాఒక్కటే!
ప్రపంచ మానవుల
సుదీర్ఘ ప్రయాణం
ఆనంద సహోదర
'పరిష్వంగం'లోనికి!

**-తమ్మినేని అక్కిరాజు**
హైదరాబాద్

# ఆ రాత్రి వరదలో...

**(ఒక జ్ఞాపకం, ఒక రాత్రి, ఒక కథ)**



జూలై 10, 2005.

వర్షాకాలం తన అసలు రూపాన్ని చూపిస్తున్న రోజులు. సాయంత్రం నెమ్మదిగా చీకటిని తన ఒడిలోకి తీసుకుంటోంది. హనుమకొండ రాంనగర్ అంబేద్కర్ విగ్రహం పక్కన ఇద్దరు యువకులు బస్సు కోసం ఎదురు చూస్తున్నారు. ఒకరు రవీందర్. మరొకరు రమేష్.

ఉదయం నుంచి యువజన సంఘం జిల్లా కమిటీ సమావేశంలో పాల్గొని తిరుగు ప్రయాణానికి సిద్ధమయ్యారు. చర్చలు, తీర్మానాలు, ఉద్యమ ప్రణాళికలు, రేపటి కార్యక్రమాలు... ఇంకా వారి మాటల్లోనే తిరుగుతున్నాయి.

"బస్సులు రావట్లేదు రమేష్..." అని రవీందర్ గడియారం వైపు చూశాడు.

"ఇంకా కొంచెం చూస్తాం. రాత్రి అవుతోంది అన్నా," అన్నాడు రమేష్.

అప్పుడే దూరంగా హెడ్‌లైట్లు కనిపించాయి. కాస్త దగ్గరకు రాగానే బస్సు మీద ఉన్న అక్షరాలు స్పష్టంగా కనిపించాయి.

"విద్యాజ్యోతి స్కూల్ -- పాలకుర్తి."

రవీందర్ నవ్వుతూ అన్నాడు:

"రమేష్... మీ స్కూల్ బస్సు వచ్చింది!"

"పద ఎక్కుదాం. పాలకుర్తి వరకు ఇబ్బంది లేకుండా వెళ్లొచ్చు."

అని చెప్పి చేయి చూపించాడు.

బస్సు ఆగింది. లోపల తెలిసిన ముఖాలు కనిపించాయి.

"నమస్తే అన్నా!"

"ఏం పని మీద వరంగల్ వచ్చారు?"

"మీటింగ్ ముగించుకుని వస్తున్నాం." అంటూ పలకరింపులు.

బస్సులో నవ్వులు. మాటలు. పరిచయాలు.

జీవితం ఎంత సహజంగా ప్రవహిస్తుందో అలా ఆ ప్రయాణం కూడా ప్రారంభమైంది.

బస్సు వేగంగా దూసుకుపోతోంది. కాజీపేట దాటింది. మడికొండ దాటింది. ఆకాశం ఒక్కసారిగా నల్లటి మేఘాలతో నిండిపోయింది. మొదట చిన్న చినుకులు. తర్వాత పెద్ద చినుకులు.

ఆ తరువాత... ఆకాశమే పగిలిపోయిందేమో అన్నట్టు కుండపోత వర్షం. కిటికీ అద్దాలపై వర్షపు చినుకులు బలంగా తాకుతున్నాయి. లోపల వాళ్లు ఇంకా మాటల్లోనే ఉన్నారు.

రేపటి కార్యక్రమాలు... గ్రామాల్లో యువతను ఎలా సమీకరించాలి... ఏ సమస్యలపై పోరాటాలు చేయాలి... చర్చలు కొనసాగుతూనే ఉన్నాయి. అయితే ప్రకృతి కూడా తనకంటూ ఒక ప్రణాళిక సిద్ధం చేసుకుందని అప్పుడెవరూ ఊహించలేదు.

వరంగల్ – హైదరాబాద్ ప్రధాన రహదారిపై ఉన్న నిష్కల్ బ్రిడ్జి సమీపానికి బస్సు చేరుకుంది.

అక్కడ... రోడ్డు కనిపించడం లేదు.

ఎదురుగా అంతా నీరే. వరద నీరు రహదారిని మింగేసింది.

డ్రైవర్ కాసేపు ఆలోచించాడు. తర్వాత నెమ్మదిగా బస్సును నీటిలోకి దింపాడు. బస్సు కదులుతోంది.

కానీ కొద్ది దూరం వెళ్లగానే... ఆగిపోయింది. నీటి ఉధృతి పెరుగుతోంది. అలలు బస్సును తాకుతున్నాయి. నీటిలో చెట్ల కొమ్మలు కొట్టుకువస్తున్నాయి. ఎక్కడో సమీపంలోని రాజవరం చెరువు మత్తడి పోస్తోందో... లేదా కట్ట తెగిందో... ఎవరికీ అర్థం కాలేదు. బస్సులో ఒక్కసారిగా నిశ్శబ్దం. ఒకరి ముఖాలు ఒకరు చూసుకున్నారు.

అప్పుడే వెనుక నుంచి వచ్చిన ఒక కారు కూడా బస్సు పక్కనే ఆగిపోయింది. కారులోకి నీరు చేరుతోంది. అందులో ఉన్నవారి కేకలు ఆ చీకటిలో మరింత భయాన్ని పుట్టించాయి.

డ్రైవర్ బస్సు నుంచి కిందికి దిగి పరిస్థితి చూశాడు. "ఇంకా ముందుకు వెళ్తే ప్రమాదం. వరద తగ్గే వరకు ఇక్కడే ఉండాలి." అని చెప్పాడు.

ఆ ఒక్క మాటతో అందరి గుండెల్లో ఒక చలి పరిగెత్తింది. రాత్రి మరింత గాఢమైంది. చుట్టూ చీకటి. పై నుంచి కుండపోత వర్షం. కింద వరద. మధ్యలో ఒక బస్సు. అందులో కొన్ని ప్రాణాలు. మనిషి ఎంత గొప్పవాడో అనుకుంటాడు. కానీ ప్రకృతి ఒక్కసారి తన శక్తిని చూపిస్తే... మనిషి తన అసహాయతను గుర్తు చేసుకుంటాడు.

కొంతమంది భయంతో దేవుడి పేర్లు జపిస్తున్నారు. మరికొందరు మౌనంగా కూర్చున్నారు. మరికొందరు ఏడుస్తున్నారు.

ఎవరో అన్నారు "ఈరోజు బతికి బయటపడతామా?"

ఆ ప్రశ్నకు ఎవరి దగ్గరా సమాధానం లేదు.

ఆ సమయంలో రవీందర్ ఫోన్ తీసుకున్నాడు.

జిల్లా అధికారులకు కాల్ చేశాడు. పరిస్థితిని వివరించాడు. స్థానిక విలేకరులకు సమాచారం ఇచ్చాడు. వరదలో చిక్కుకున్నామని చెప్పాడు.

ఇదంతా జరుగుతుండగా రమేష్ మాత్రం ఒక్కొక్కరి దగ్గరకు వెళ్లి ధైర్యం చెబుతున్నాడు. "ఏమీ కాదు... ధైర్యంగా ఉండండి." "వరద తగ్గుతుంది." "మనమంతా సురక్షితంగా బయటపడతాం." అని భరోసా ఇస్తున్నాడు.

ఆ చీకటిలో... ఆ మాటలే కొందరికి వెలుగులా అనిపించాయి.

దూరంగా అరుపులు వినిపిస్తున్నాయి. ఎవరో చెట్ల మీదకు ఎక్కి ప్రాణాలు కాపాడుకునేందుకు ప్రయత్నిస్తున్నారు. వరద నీటిలో పెద్ద పెద్ద చెట్లు కొట్టుకుపోతున్నాయి.

రాత్రి క్షణాలు గడియారపు ముళ్లలా కదలడం లేదు. ప్రతి నిమిషం... ఒక యుగంలా అనిపిస్తోంది. ఆకలి మరిచిపోయారు. దాహం మరిచిపోయారు. ఇప్పుడు ఒక్క కోరిక మాత్రమే.. బతికి బయటపడాలి.

మధ్యరాత్రి దాటింది. వర్షం కొద్దిగా తగ్గింది. కానీ చీకటి ఇంకా అలాగే ఉంది. ఆ రాత్రి బస్సులో కూర్చున్న ప్రతి మనిషి ఒక సత్యాన్ని అర్థం చేసుకున్నాడు. జీవితంలో మనం పోగేసుకున్న డబ్బు... పదవులు... అహంకారాలు... వివాదాలు... ఏవీ ఆ క్షణంలో గుర్తుకు రావు. ఒక్క ప్రాణమే గుర్తుకు వస్తుంది. ఒక్క కుటుంబమే గుర్తుకు వస్తుంది. ఒక్క "బతకాలి" అనే కోరిక మాత్రమే మిగులుతుంది.

తెల్లవారుజామున. ఆకాశం నెమ్మదిగా వెలుగుతోంది. వరద ఉధృతి కొద్దిగా తగ్గింది. బస్సులోని వాళ్లు కిందికి దిగారు. పరిస్థితిని పరిశీలించారు. ఇక ప్రమాదం తక్కువేనని భావించి డ్రైవర్ బస్సును స్టార్ట్ చేశాడు.

నెమ్మదిగా... చాలా జాగ్రత్తగా...

బస్సు ముందుకు కదిలింది. వెనుక కారు కూడా వచ్చింది. కొన్ని నిమిషాల తర్వాత... బ్రిడ్జి దాటేశారు. అందరూ ఒక్కసారిగా ఊపిరి పీల్చుకున్నారు.

కొంతమంది కళ్లలో నీళ్లు. కొంతమంది చేతులు జోడించి దేవుడికి నమస్కారం. కొంతమంది నవ్వుతున్నారు. ఆ నవ్వుల్లో ఒక కొత్త జీవితం కనిపించింది. స్టేషన్ ఘన్‌పూర్ వద్ద రవీందర్ దిగిపోయాడు. మిగతా వాళు పాలకుర్తి చేరుకున్నారు. ఉదయం ఆరు గంటల సమయంలో రమేష్ ఒక చిన్న హోటల్‌లో టీ తాగుతూ పేపర్ తిరగేస్తున్నాడు. అప్పుడే ఒక వార్త అతని కంటపడింది.

"వరదలో చిక్కుకున్న ప్రయాణికులను పోలీసులు సాహసోపేతంగా రక్షించారు..." అంటూ పెద్ద కథనం.

వార్త చదువుతున్న కొద్దీ అతని పెదవులపై చిరునవ్వు. ఎందుకంటే... వరద తగ్గాక తామే బయటపడ్డారు. ఎటువంటి సహాయక చర్యలు అక్కడ కనిపించలేదు. అయినా వార్త మాత్రం మరో కథను రాసేసింది. కొద్దిసేపటికి రవీందర్‌కు ఫోన్ చేశాడు.

"వార్త చూశావా?" అన్నాడు. అవతల నుంచి నవ్వు.

"అవును... మనల్ని మనమే కాపాడుకున్నాం. కానీ వార్తల్లో మాత్రం హీరోలు ఇంకెవరో అయ్యారు!" ఇద్దరూ నవ్వుకున్నారు.

ఇప్పుడు ఆ ఘటనను తలచుకుంటే... వరద గుర్తుకు రావడం కంటే... ఆ రాత్రి బస్సులో ఉన్న మనుషులు గుర్తుకు వస్తారు. భయంతో వణికిన కళ్ళు గుర్తుకు వస్తాయి. ధైర్యం చెప్పిన మాటలు గుర్తుకు వస్తాయి. చీకటిలో కూడా ఆశను వెతికిన మనుషులు గుర్తుకు వస్తారు.

జీవితం చాలా విచిత్రమైనది. ఒక రాత్రి... ఒక వరద... ఒక బస్సు... కొన్ని గంటలు... ఇవే కొన్ని జ్ఞాపకాలను జీవితాంతం చెరగని అక్షరాలుగా మార్చేస్తాయి.

ఆ రాత్రి మాకు మరో సత్యాన్ని కూడా నేర్పింది.. మనిషి ప్రణాళికలు వేస్తాడు. కానీ చివరి మాట చాలా సార్లు ప్రకృతిదే.

అయినా... ప్రతి విపత్తును జయించేది మనిషి ధైర్యమే. ప్రతి చీకటిని దాటించేది మరొక మనిషి ఇచ్చే భరోసానే.


ఎందుకంటే... వరదల్లో కొట్టుకుపోని ఒక శక్తి ఉంది. అది మనిషి మనిషిపై ఉంచుకున్న నమ్మకం. ఆ నమ్మకమే... ఆ రాత్రి మమ్మల్ని ఒడ్డుకు చేర్చింది.



**- మామిండ్ల రమేష్ రాజా**
**సెల్ : 78932 30218**

కాళేశ్వరం ఒక రాజకీయ ఆట కాదు..

# కోట్లాది ప్రజల బతుకు సమస్య





**కాళేశ్వరం రిపేర్ చేసి వెంటనే నీళ్లువ్వండి**

కాళేశ్వరం ప్రాజెక్టు పేరిట రాజకీయ ఆట మళ్లీ మొదలైంది. కాళేశ్వరం సందర్భంగా తెలంగాణ నీటి ప్రాజెక్టుల గురించి చర్చలు మళ్లీ ఘాటెక్కుతున్నాయి. మంచిదే. అధికారంలో ఉండి రిపేర్ చేయకుండా చర్చలు చేయడం రాజకీయమే తప్ప రైతుల నీటి అవసరాలు తీర్చదు. చిన్న రిపేర్ చేసి ఎల్లంపల్లి ప్రాజెక్టుకు పంపింగ్ చేయడం తక్షణ కర్తవ్యం.

జరిగిందేదో జరిగి పోయింది. ప్రతి సారి అరిస్తే సమస్య పరిష్కారం అయినట్టు కాదు.

కాళేశ్వరం, మేడిగడ్డ తదితర ప్రాజెక్టులు బ్యారేజీలు స్వతంత్రంగా డైరెక్టుగా పొలాలకు నీళ్లిచ్చే ప్రాజెక్టులు కాదు. ప్రధానంగా ఎల్లంపల్లి ప్రాజెక్టులోకి నీళ్లు తోడిపోసే ప్రాజెక్టులు మాత్రమే. ఈ విషయం ముఖ్యమంత్రికి తెలియదా? తెలుసు. ఎల్లంపల్లి నుండి ఏయే ప్రాంతాలకు నీరందుతుందో తెలుసు. తెలుసు కాబట్టే పగ బట్టినట్టు నీళ్లందకుండా కాళేశ్వరం మేడిగడ్డ, పంపుల ముంపును రిపేర్ చేయడం లేదని స్పష్టమవుతున్నది.

ఈ విషయాలు తెలంగాణ ఇంజనీర్లు, ఆ ప్రాజెక్టులలో పని చేసిన ఇంజనీర్లు గట్టిగా ఎందుకు నిలదీయడం లేదు? నిలదీస్తే తమ సంతకాలతోనే అవినీతి జరరిగిందని బయట పడి ఐఏఎస్ అధికారి శ్రీలక్ష్మి బలి అయినట్టు తమ అవినీతి బయట పడి బతుకులు బజారు పాలవుతాయని నిశ్శబ్దంగా క్రికెట్ వినోదంలా చోద్యం చూస్తున్నారు.

**ఆర్టిఫిషియల్ ఇంటలిజెన్సుతో 'బట్ట' బయలు**

ఆర్టిఫిషియల్ ఇంటలిజెన్సు నిమిషాల్లో ఎక్కడ ఎంత అవినీతి జరిగిందో లెక్కలతో సహా వివరించ గలదు. అంతర్ జాతీయంగా ఖర్చుల లెక్కలతో పోల్చి చూపుతున్నది. శ్రీశైలం ఎడమ కాలువ, సొరంగం (ఎస్ఎల్‌బీసీ) దశాబ్దాలైనా పూర్తి కాలేదు. నాయకులకు డబ్బు అవసరం పడ్డపుడల్లా సంచులు నింపే ఏ టి యం గా మారింది. ఇప్పటి వరకు 60,000 కోట్ల రూపాయలు దీనిపేరిట ఖర్చయ్యాయి. ఒక్క చుక్క నీరు అంద లేదు. ఈ డబ్బుతో ఇజ్రాయిల్ లో కట్టిన ప్రాజెక్టులను నాలుగు సార్లు కట్ట వచ్చు అని ప్రాణం లేని ఆర్టిఫిషియల్ ఇంటలిజెన్సు వాపోయింది. కాని ప్రాణమున్న నిపుణులు మౌనంగా ఉంటున్నారు.

కాళేశ్వరం మేడిగడ్డ, తోక ప్రాజెక్టులకు ఖర్చు చేసింది 80,000 వేల కోట్లు. ఈ డబ్బుతో ఇజ్రాయిల్ కట్టిన ప్రాజెక్టులను ఆరుసార్లు కట్టవచ్చు అని ఆర్టిఫిషియల్ ఇంటలిజెన్సు చెపుతున్నది. ఆ లెక్కల్లో కొంత తేడా ఉండవచ్చు. చిత్తశుద్ధిని లెక్కలతో కొలవడానికి ఈ పోలికలు ఉపయోగ పడుతాయి.

కాళేశ్వరం, మేడిగడ్డ ప్రాజెక్టు బ్యారేజీలు ఎలంపల్లిని నింపి అక్కన్ని ఎత్తి పోసి అన్ని చెరువులు కుంటలు నింపి ఉత్తర తెలంగాణను సస్యశ్యామలం చేయడం లక్ష్యం.

ఓవరాల్ గా ప్రాజెక్టు పేరిట అవుతున్న ఖర్చులో పది శాతమే భూమ్మద, మిగతా 90 శాతం కాగితాల మీద అని ఆర్టిఫిషియల్ ఇంటలిజెన్సు అంతర్జాతీయసప్రమాణాలతో లెక్క తీసి చెపుతున్నది. ఈ విషయాలు ఇంజనీర్లకు తెలుసు. నాయకులకు తెలుసు. ఇంతగా ప్రజల డబ్బు దోచుకోవడం చూసి ఒకరిద్దరు ఇంజనీర్లు తమ సంతకానికి పాపం అంటద్దని, అవినీతిలో భాగస్వామ్యం వద్దని అతి పెద్ద ఇంజనీర్ హోదా వదిలి, రాజీనామా చేసి చిన్న ఉద్యోగాలు చేస్తున్నారు.

**కె ఎల్ రావు కుట్ర ఫలితంగా కాళేశ్వరం**

కాళేశ్వరం ప్రతిపాదన స్థాయిలోనే కే సీ ఆర్ నాతో కూడా సుదీర్ఘంగా వివరించారు. నేను ఒకటే ప్రశ్న వేశాను. 220 కిలోమీటర్లు దిగువకు చేరాక ఆ నీటిని తిరిగి 220 కిలో మీటర్లు ఎత్తి పోయడం తప్ప మార్గం లేదా? ఈ ప్రశ్నకు కెసీఆర్ సుదీర్ఘంగా జవాబు చెప్పుకొచ్చారు. 1940 లలో నిజాం హయాంలో ప్రసిద్ధ ఇంజనీర్నవాబ్ అలీ నవాబ్ జంగ్ సముద్ర మట్టానికి 1150 అడుగుల ఎత్తుమీద కట్టాలని ప్రతిపాదనలు చేశారు. అది 330 టి యంసీల ప్రాజెక్టు. దాన్ని కె ఎల్ రావు 1090 అడుగులకు , కొన్నిచోట్ల 950 అడుగులకు తగ్గించారు. 112 టియంసీల ప్రాజెక్టుగా పోచంపాడు ప్రాజెక్టు గా మ్రుబడింది. పూడిక వల్ల ఇపుడు 80–90 టియంసీలకు కుదించుక పోయి ది. ఇలా కేంద్ర మంత్రగా వున్న కె ఎల్ రావు దిగువకు మార్చారు. కుట్ర కె ఎల్ రావుదే. ఎందుకలా చేశారు?

తెలంగాణలో జూన్లో రుతు పవనాలతో వర్ష పాతం. ఆంధ్ర తమిళనాడు లో అక్టోబర్ లో రుతు పవనాలు. గోదావరి నీళ్లతో ఆంధ్రలో తొలి పంట పండించాలంటే తెలంగాణ లో గోదావరిపై ఆనకట్టలు కట్ట కూడదు. ఆ నీల్లు ఆంధ్రకు మళ్లి చుకోనాలి. ఇలా కె ఎల్ రావు చేసిన ద్రోహం వల్ల పోచంపాడ్ ప్రాజెక్టుగా కుదించ బడింది.

ఇపుడు మేన్ కెనాల్ కు గోదావరికి మధ్య 35 కిలో మీటర్లు మాత్రమే సాగు నీరు.

మొదట అనుకున్న ప్రకారం గోదావరికి మేన్ కెవాల్ కు మధ్య 120 కిలో మీటర్లు. 35 కిలో మీటర్లకు ఆయకట్టు కుదించుక పోవడం వల్ల సిద్ధిపేట హుస్నా బాద్ మీదుగా పోవలసిన మేన్ కెనాల్ కేవలం కోరుట్ల జగిత్యాల మీదుగా సాగింది. అందువల్ల మారిన రాష్ట్రాల సరిహద్దులు రాజకీయాలు , ఆంధ్ర కుట్రలు ఫలితంగా కాళేశ్వరం మేడి గడ్డ ఎల్లంపలి మీదుగా తిరిగి పోచంపాడును ఎత్తి పోతలతో నింపడం అనివార్యమవుతున్నది. ఇది ఆ రోజు కెసిఆర్ ఇచ్చిన వివరణల సారాంశం. ఎత్తి పోతలు సరే! అదిలాబాద్ జిల్లాకు నీళ్లు ఎలా? ఈ ప్రశ్నకు జవాబుగా కాగితాల మీద రెండు ప్రాజెక్టు చూపారు. వాటిని కట్టింది లేదు. నీళ్లు ఇచ్చింది లేదు. పెద్ద ప్రాజెక్టులకు పెద్ద కమిషన్లు కద!

**చిన్న ప్రాజెక్టుల వల్ల ప్రయోజనాలు.**

మొదటి నుంచి నా ప్రతి పాదనలు వేరు. కాకతీయుల చెరువులు నా ఆదర్శం. ప్రతి ఐదు కిలోమీటర్లకు ఆనకట్ట నా ప్రతిపాదన. అది బ్యారేజీ కావచ్చు పెద్ద చెరువు కావచ్చు. చిన్న ప్రాజెక్టు కావచ్చు. వాటి వల్ల చేపల పెంపకం పెరుగుతుంది. చుట్టు పక్కల భూగర్భ జలాలు పెరుగుతాయి. చెట్లు పెరుగుతాయ. ఆరు తడి పంటలు కకూడా పెరుగుతాయి. రోడ్లు పెరుగుతాయి. బావుల్లో ఉపునీరు బదులు మంచి నీటి ఊటలు పెరుగుతా యి. ఎక్కడి నీళ్లు అక్కడే ఆగుతాయి. భూసారం కొట్టక పోదు. వరద కష్టాలు తగ్గుతాయి. పశువుల పెంపకం పెరుగుతుంది


**భారీ ప్రాజెక్టులతో నష్టాలు**

భారీ ప్రాజెక్టుల వల్ల నీల్లు తప్ప ఈ ప్రయోజనాలేవీ లేవు. పైగా వందల ఊర్లు లక్షల ఎకరాలు మునిగి పోయాయి. అడవులు నీట మునిగాయి. ఇలాంటి లెక్కలన్ని నర్మదా నది ప్రాజెక్టు సందర్భంగా అంతర్జాతీయ స్థాయి లో విశ్లేషణలు సాగాయి. భారీ ప్రాజెక్టుతో భూమి పై బరువు పెరిగిన ఎక్కడో భూకంపంగా మారుతున్నది.

చిన్ననీటి ప్రాజెక్టులకు నీటి లెక్కలు టీయంసీల ద్వారా కాదు. క్యూసెక్కు ద్వారా కాదు. ఆ నీటి లెక్కలు వాన కురిసే లెక్కల ద్వారా సాగుతుతుంది. ఎక్కడి నీళ్లు అక్కడే ఇంకే విధానం. పూర్వం తమ పెరట్లో పడ్డనీళ్లు బయటకు పోకుండా చూట్టూ కట్టలు పోసుకనేవారు. దానివల్ల భూసారం కూడ రక్షించ బడుతుంది.

**అమెరికాలో 2000 ప్రాజెక్టు కూల్చి వేసారు**

ప్రపంచ వ్యాప్తంగా భారీ ప్రాజెక్టుల వల్ల జరిగిపోయిన విధ్వంసం గుర్తిస్తున్నారు. అమెరికాలో 2000 ప్రాజెక్టులను కూల్చి వేసారు. ఇక నుండి భారీ ప్రాజెక్టుల మీద ఆధార పడడం మానేసి చినిన చిన్న ప్రాజెక్టులు పెద్ద చెరువులు కుంటలు నిర్మాణంపై దృష్ట పెట్టాలి. పాత చెరువుల పూడిక తీయాలి. కొత్తవి కట్టాలి. పూడిక తీయడం యుద్ద ప్రాతిపదికన టీఆర్ ఎస్ ప్రభుత్వం చేపట్టడం వల్లనే తెలంగాణ రైస్ బౌల్ గా మారింది. చెరువులను నింపే కాళేశ్వరంను వెంటనే రిపేర్ చేయాలి దక్షిణ తెలంగాణకు మేలు చేయడానికి ఉత్తర తెలంగాణను కరువు ప్రాంతంగా మార్చాల్సిన అవసరం లేదు. ఉభయ గోదావరి జిల్లాలకు ,పోలవరం , గోదావరి కృష్ణా బేసిన్ కు నిరంతరం నీటి కోసం కాళేశ్వరం ను రిపేర్ చేయకుండా వాయిదా వేయడం భావ్యం కాదు.



**- బి ఎస్ రాములు**
**సామాజిక తత్వ వేత్త**
**ఫో: 8331966987**

# జూలై 15 నుంచి ఉద్యోగుల ఈహెచ్ఎస్ హెల్త్ కార్డుల అమలు

- త్వరలో సీఎం చేతుల మీదుగా హెల్త్ కార్డుల పంపిణీ
- 943 ఆసుపత్రుల్లో క్యాష్‌లెస్ వైద్యం



**ముషీరాబాద్, జూలై 10 (జనం సాక్షి) :** తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులు, పెన్షనర్ల కోసం ఎంప్లాయిస్ హెల్త్ స్కీమ్ కింద నూతన హెల్త్ కార్డులను జూలై 15 నుంచి అమలు చేయాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించింది. ఈ మేరకు శుక్రవారం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సంజయ్ జాజు, ఐఏఎస్ అధ్యక్షతన నిర్వహించిన ఉన్నతస్థాయి సమీక్ష సమావేశంలో నిర్ణయం తీసుకున్నారు. ఉద్యోగులు, పెన్షనర్లకు నాణ్యమైన, నగదు రహిత వైద్య సేవలను అందించడమే లక్ష్యంగా రూపొందించిన ఈ పథకంలో భాగంగా, త్వరలో ముఖ్యమంత్రి అనుముల రేవంత్ రెడ్డి చేతుల మీదుగా హెల్త్ కార్డులను అధికారికంగా పంపిణీ చేయనున్నట్లు సమావేశంలో వెల్లడించారు. అమలుకు సంబంధించిన ఏర్పాట్లను వేగంగా పూర్తి చేయాలని ప్రధాన కార్యదర్శి అధికారులను ఆదేశించారు. నూతన హెల్త్ కార్డులకు క్యూఆర్ కోడ్‌ను జోడించడంతో పాటు, వాటిని మొబైల్ ఫోన్‌లోనే డౌన్‌లోడ్ చేసుకునే సౌకర్యాన్ని కల్పించనున్నారు. అన్ని వివరాలు అందుబాటులో ఉండేలా ప్రత్యేకంగా ఈహెచ్ఎస్టి యాప్‌ను రూపొందించనున్నారు. చికిత్సలకు సిజిహెచ్ఎస్ రేట్లు వర్తింపజేయనున్నట్లు అధికారులు తెలిపారు. నాలుగు రోజుల్లో నూతన ఈహెచ్ఎస్ మార్గదర్శకాలపై ప్రభుత్వ ఉత్తర్వులు (జీఓ) జారీ చేయనున్నట్లు సమావేశంలో వెల్లడించారు. రాష్ట్రవ్యాప్తంగా 943 గుర్తింపు పొందిన ఆసుపత్రుల్లో హెల్త్ కార్డుల ద్వారా నగదు రహిత వైద్య సేవలు అందుబాటులో ఉండగా, మొత్తం 2,594 వైద్య ప్రొసీజర్లు ఈ పథకం పరిధిలోకి రానున్నాయి. కొత్త మార్గదర్శకాలపై చర్చించేందుకు ఈ నెల 13న సీఈవో తో సమావేశం నిర్వహించనున్నట్లు తెలిపారు. ప్రభుత్వ వ్యయంతో రాష్ట్రంలోని అన్ని జిల్లా కేంద్రాల్లో వెల్‌నెస్ సెంటర్లను ఏర్పాటు చేయనున్నట్లు ప్రకటించారు. ఈ సమావేశంలో ప్రత్యేక ప్రధాన కార్యదర్శులు బి.ఎం.డి. ఎక్కా, క్రిస్టినా చోంగ్తూ, సిక్తా పట్నాయక్, హనుమంత్ కొండిబా, షికా గోయల్, పాపిరెడ్డి, వాణి తదితర ఉన్నతాధికారులతో పాటు ఉద్యోగ సంఘాల ప్రతినిధులు మారం జగదీశ్వర్, ఏలూరి శ్రీనివాసరావు, దామోదర్ రెడ్డి, చావా రవి, శ్రీనివాసరెడ్డి, వంగా రవీందర్ రెడ్డి, సదానంద గౌడ్, సైదులు, దాస్య నాయక్, పెన్షనర్ల సంఘాల ప్రతినిధులు వెంకటరెడ్డి, కృష్ణమూర్తి, ఉమాదేవి, బి. శ్యామ్ తదితరులు పాల్గొన్నారు.

## బీయంఆర్ కృషితో తాండూర్ బైపాస్ భూ నిర్వాసితులకు రూ.25.13 కోట్లు విడుదల



**తాండూరు, జూలై 10 (జనంసాక్షి) :** దాదాపు 13 సంవత్సరాలుగా పెండింగ్‌లో ఉన్న తాండూర్ బైపాస్ రోడ్డు భూ నిర్వాసితులకు సీఎం రేవంత్ రెడ్డి, మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి సహకారంతో ఎమ్మెల్యే బుయ్యని మనోహర్ రెడ్డి బీయంఆర్ ప్రత్యేక కృషి ఫలితంగా తీపి కబురు అంది.నేడు జిల్లా కలెక్టర్ ఖాతాలో రూ.25,13,01,000 అంటే రూ.25.13 కోట్ల నిధులు జమ అయ్యాయి. గతంలో నిర్ణయించిన మొత్తం కంటే పెరిగిన నష్టపరిహారాన్ని భూ నిర్వాసితులకు అందించనున్నట్లు ప్రభుత్వం తెలిపింది. భూ నిర్వాసితుల వ్యక్తిగత బ్యాంకు ఖాతాల్లో సాధ్యమైనంత త్వరగా నిధులు జమ చేస్తామని ఎమ్మెల్యే బీయంఆర్ స్పష్టం చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే బుయ్యని మనోహర్ రెడ్డి మాట్లాడుతూ, ప్రజల సమస్యల పరిష్కారమే మా ప్రాధాన్యత. 13 ఏళ్లుగా ఎదురుచూస్తున్న భూ నిర్వాసితుల కుటుంబాలకు న్యాయం చేయాలన్నదే మా లక్ష్యం. సీఎం రేవంత్ రెడ్డి, మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి సహకారంతో ఈ నిధులు సాధ్యమయ్యాయి అని అన్నారు. ఎమ్మెల్యే కృషిని గుర్తించిన దాదాపు 140 మంది భూ నిర్వాసితులు బీయంఆర్‌కు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. ఈ నిధుల విడుదలతో బైపాస్ రోడ్డు పనులకు ఉన్న అన్ని అడ్డంకులు తొలగిపోనున్నాయి. త్వరలోనే అసంపూర్తిగా ఉన్న బైపాస్ రోడ్డు పనులు తిరిగి ప్రారంభమవుతాయని అధికారులు తెలిపారు.

## పట్టణాభివృద్ధికి కాంగ్రెస్ ప్రభుత్వం కృషి

- ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్



**ఫరూక్‌నగర్, జూలై 10 (జనంసాక్షి) :** షాద్‌నగర్ పట్టణ అభివృద్ధిలో భాగంగా మున్సిపాలిటీ 5వ వార్డులోని చౌడమ్మ గుట్ట ఆంజనేయస్వామి ఆలయ సమీపంలో రూ.36 లక్షల మున్సిపల్ సాధారణ నిధులతో చేపట్టనున్న అండర్ డ్రైనేజీ నిర్మాణ పనులకు ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ, పట్టణ ప్రజలకు మెరుగైన పారిశుద్ధ్య వాతావరణం కల్పించడమే ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని తెలిపారు. ప్రజల అవసరాలను దృష్టిలో ఉంచుకుని మౌలిక వసతుల అభివృద్ధికి కాంగ్రెస్ ప్రభుత్వం ప్రత్యేక ప్రాధాన్యత ఇస్తోందన్నారు. డ్రైనేజీ, రోడ్లు, తాగునీరు వంటి మౌలిక సదుపాయాల కల్పన ద్వారా పట్టణాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేస్తున్నామని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ అగ్గనూర్ బసవేశ్వర్, వైస్ చైర్మన్ అందే మోహన్ ముదిరాజ్, మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ బాబర్ అలీ ఖాన్, మున్సిపల్ కమిషనర్ సునీత రెడ్డి, మున్సిపల్ ఏఈ సాయి కిరణ్, నరేష్, కౌన్సిలర్ కొప్పినూరు ప్రవీణ్, రాజు నాయక్, మురళీమోహన్ (అప్పి), అనిల్ కుమార్, కో-ఆప్షన్ సభ్యులు సయ్యద్ ఖదీర్, లతా శ్రీశైలం గౌడ్, సాదిక్, కొత్తూరు మున్సిపాలిటీ అధ్యక్షుడు సుదర్శన్ గౌడ్, రవికుమార్ గుప్తా, సర్పంచ్ చందు నాయక్, మహబూబ్, రవితేజ, మనీష్ తదితర ప్రజాప్రతినిధులు, నాయకులు మరియు కార్యకర్తలు పాల్గొన్నారు.

## ఫుట్‌పాత్‌పై పాదాచారులు స్వేచ్ఛగా నడవాలి



**శేరిలింగంపల్లి, జూలై 10 (జనంసాక్షి) :** మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని ప్రధాన రహదారులకు ఇరువైపులా ఉన్న ఫుట్ పాతులు, పేమెంట్ లపై స్థానికులు, పాదాచారులు స్వేచ్ఛగా నడవాల్సిన అవసరం ఉందని సైబరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ అధికారులు తెలియజేశారు. సిఎంసి పరిధిలోని మూడు జోన్లలో శుక్రవారం ఫుట్పాత్ ఆక్రమణల తొలగింపు కార్యక్రమాన్ని స్పెషల్ డ్రైవ్ గా నిర్వహించారు. సిఎంసి కమిషనర్, సీనియర్ ఐఏఎస్ అధికారిని సృజన ఆదేశాల మేరకు సిఎంసి పరిధి మూడు జోన్లలో ఒకేసారి 'వాక్ ఫ్రీ' పేరుతో ఫుట్పాత్ ఆక్రమణల తొలగింపు కార్యక్రమాన్ని నిర్వహించినట్లు సంబంధిత అధికారులు తెలియజేశారు. ఆయా జోనల్ కమిషనర్లు, సర్కిల్ అధికారులు, పట్టణ ప్రణాళిక విభాగం అధికారులు, ఇంజనీరింగ్ విభాగం అధికారులు, ఎన్ఫోర్స్మెంట్ ప్రత్యేక బృందాలు సమన్వయంగా కదిలి నిర్వహించిన ఫుట్ పాతులపై ఆక్రమణల తొలగింపు కార్యక్రమం విజయవంతమైనట్లు అధికారులు మీడియాకు తెలిపారు. ఈ సందర్భంగా ఆయా ఫుట్ పాతులపై ఉన్న ఆక్రమణలను, అక్రమ నిర్మాణాలను తొలగించి పాదచారులు స్వేచ్ఛగా, సురక్షితంగా నడిచేందుకు మార్గం సుగమం చేయడమైనదన్నారు. ఈ క్రమంలో శేరిలింగంపల్లి జోన్ పరిధిలో 9.86 చదరపు కిలోమీటర్ల నిడివిలో ఐదు రహదారుల వెంబడి 193 ఆక్రమణలను తొలగించడం జరిగిందని, కూకట్పల్లి జోన్ పరిధిలో మూడున్నర కిలోమీటర్ల నిడివిలో 3 రహదారుల వెంబడి 89 ఆక్రమణలను అధికారులు పూర్తిగా తొలగించడం జరిగిందన్నారు. అలాగే కుత్బుల్లాపూర్ జోన్ పరిధిలో దాదాపు 9 చదరపు కిలోమీటర్ల నిడివిలో 7 రహదారులను పరిగణలోకి తీసుకొని 206 ఆక్రమణలను, అక్రమ నిర్మాణాలను తొలగించినట్లు అధికారులు వెల్లడించారు. ఈ సందర్భంగా సిఎంసి కమిషనర్ మాట్లాడుతూ రహదారుల వెంబడి ఫుట్ పాతులు, పేవ్ మెంట్లు నిర్మించేది ఇతరులు ఆక్రమించుకోవడానికి కాదని, పాదచారులకు సురక్షితమైన నడకమార్గాన్ని అందించడమే లక్ష్యమన్నారు. ఫుట్ పాతులు, పేమ్మెంట్లను మునుముందు ఎలాంటి ఆక్రమణలు చేయకుండా తోపుడుబండ్లు, చిరు వ్యాపారులు, వాణిజ్య సంస్థలు సహకరించాలని, మునుముందు చేపట్టబోయే మరింత కఠినమైన చర్యలకు వారు ఇబ్బందులు పడకూడదని స్పష్టం చేశారు.

## వరుస చోరీలకు పాల్పడిన నిందితుడు అరెస్ట్

- ముగ్గురు పరారీ




**రాజేంద్రనగర్, జూలై 10 (జనంసాక్షి) :** వరుస చోరీ కేసుల్లో ప్రమేయం ఉన్న నేర చరిత్ర కలిగిన నిందితుడిని అత్తాపూర్ పోలీసులు అరెస్టు చేశారు. రాజేంద్రనగర్ జోన్ డీసీపీ ఎస్. శ్రీనివాస్ పర్యవేక్షణలో, ఏసీపీ టి. శ్రీనివాస్, అత్తాపూర్ ఎస్‌హెచ్ఓ కె. నాగేశ్వరరావు, డీఐ బి. రాజు నాయక్ వారి బృందం ఆధ్వర్యంలో కేసును చేదించారు. అత్తాపూర్ పోలీస్ స్టేషన్ పరిధిలో జరిగిన చైన్ స్నాచింగ్ కేసుల్లో నిందితుడైన పాత నేరస్థుడు హతకాడే విశాల్ (25)ను పోలీసులు అరెస్ట్ చేశారు. నిందుతుని వద్ద నుంచి మొత్తం నాలుగు కేసులకు సంబంధించిన సుమారు 29.7 గ్రాముల బంగారు గొలుసులను స్వాధీనం చేసుకున్నారు. ఈ కేసుల్లో రవి, జహంగీర్, శ్యామ్ సుందర్ పరారీలో ఉన్నట్లు పోలీసులు తెలిపారు. 2025 అక్టోబర్ 16న ఆరాంఘర్ బస్ స్టాండ్ వద్ద ప్రయాణికుడి దృష్టి మరల్చి 1.25 తులాల బంగారు గొలుసును దొంగిలించిన ఘటనతో పాటు మరో మూడు చైన్ స్నాచింగ్ కేసులను పోలీసులు ఛేదించారు. పరారీలో ఉన్న మిగతా ముగ్గురు నిందితుల కోసం గాలింపు కొనసాగిస్తున్నారు.

## ట్రాఫిక్ అడ్డుగా ఉన్న చెట్లను శాస్త్రీయ పద్ధతిలో మార్పిడి

- ఇప్పటివరకు 41 చెట్ల మార్పిడి
- ట్రాఫిక్ ఏసిపి శంకర్ రాజు



**సికింద్రాబాద్, జూలై 10 (జనంసాక్షి) :** ట్రాఫిక్ నిబంధనలు పాటిస్తూ పర్యావరణ పరిరక్షణకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని తిరుమలగిరి ట్రాఫిక్ ఏసిపి శంకర్ రాజు సూచించారు. ట్రాఫిక్ నిర్వహణను మెరుగుపరచడంతో పాటు పర్యావరణ పరిరక్షణకు ప్రాధాన్యం ఇస్తూ బోయిన్‌పల్లి ఆర్మీ గేట్ ఎదురుగా ఉన్న ఏడు చెట్లను ఏసీపీ శంకర్ రాజు ఆధ్వర్యంలో శాస్త్రీయ పద్ధతిలో మార్పిడి చేశారు. తిరుమలగిరి ట్రాఫిక్ డివిజన్ పరిధిలో ఇప్పటివరకు శాస్త్రీయ విధానంలో 41 చెట్లను మార్పిడి చేశారు. బోయిన్‌పల్లి ఎక్స్‌రోడ్స్ నుంచి పోస్ట్ ఆఫీస్ మీదుగా సేఫ్ ఎక్స్‌ప్రెస్ వైపు వెళ్లే మార్గంలో వాహనాల రాకపోకలకు ఈ చెట్లు ఆటంకంగా ఉన్నట్లు గుర్తించారు. దీంతో హైదరాబాద్ మెట్రోపాలిటన్ డెవలప్‌మెంట్ అథారిటీ, ఆర్మీ అధికారులతో సమన్వయం చేసుకుని, మల్కాజిగిరి పోలీస్ కమిషనర్ బి. సుమతి, ట్రాఫిక్-1 డిప్యూటీ కమిషనర్ ఆఫ్ పోలీస్ కె. రాహుల్ రెడ్డి, పర్యవేక్షణలో తిరుమలగిరి ట్రాఫిక్ ఏసిపి శంకర్ రాజు చెట్ల మార్పిడి కార్యక్రమాన్ని చేపట్టారు. అవసరమైన అన్ని అనుమతులు పొందిన అనంతరం చెట్లను పర్యావరణానికి ఎలాంటి హాని కలగకుండా ఆర్మీ ప్రాంగణంలోకి శాస్త్రీయ పద్ధతిలో మార్పిడి చేశారు. ఈ ప్రక్రియలో చెట్లకు ఎలాంటి నష్టం జరగకుండా ప్రత్యేక జాగ్రత్తలు తీసుకున్నట్లు ఆయన తెలిపారు. ఈ చర్యతో బోయిన్‌పల్లి ఎక్స్‌రోడ్స్ నుంచి సేఫ్ ఎక్స్‌ప్రెస్ వరకు ట్రాఫిక్ రాకపోకలు మరింత సులభతరం కావడంతో పాటు నగర హరిత వాతావరణ పరిరక్షణకు కూడా తోడ్పాటు అందుతుందని అధికారులు పేర్కొన్నారు. కార్యక్రమం విజయవంతానికి సహకరించిన హెచ్ఎండీఏ, ఆర్మీ అధికారులు, ఇతర శాఖల అధికారులకు తిరుమలగిరి ట్రాఫిక్ పోలీసులు కృతజ్ఞతలు తెలిపారు. ట్రాఫిక్ సౌకర్యాలతో పాటు పర్యావరణ పరిరక్షణకు సమాన ప్రాధాన్యం ఇస్తూ ఇటువంటి కార్యక్రమాలను కొనసాగిస్తామని శంకర్ రాజు తెలిపారు.

## వేతనాల పెంపు కోరుతూ ఓయూలో కాంట్రాక్టు కార్మికుల ర్యాలీ

- రూ.26 వేల కనీస వేతనం ఇవ్వాలంటూ నిరసన
- సమానపనికి సమాన వేతనం అమలు చేయాలని ఓయూ కార్మికుల డిమాండ్
- ఓయూలో కాంట్రాక్టు, ఔట్‌సోర్సింగ్ ఉద్యోగుల ఆందోళన



**సికింద్రాబాద్, జూలై 10 (జనంసాక్షి) :** ఉస్మానియా యూనివర్సిటీలో పనిచేస్తున్న కాంట్రాక్టు, ఔట్‌సోర్సింగ్ కార్మికుల వేతనాలను పెంచాలని, కనీస వేతనంగా రూ.26 వేల చెల్లించాలని డిమాండ్ చేస్తూ సీఐటీయూ ఆధ్వర్యంలోని ఓయూ కాంట్రాక్టు, ఔట్‌సోర్సింగ్ ఎంప్లాయిస్ అండ్ వర్కర్స్ యూనియన్ శుక్రవారం ఆర్ట్స్ కళాశాల నుంచి పరిపాలన భవనం వరకు ర్యాలీ నిర్వహించారు. అనంతరం యూనివర్సిటీ రిజిస్ట్రార్ ప్రొఫెసర్ జి. నరేష్ రెడ్డికి తమ డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా ఓయూ కాంట్రాక్టు, ఔట్‌సోర్సింగ్ ఎంప్లాయిస్ అండ్ వర్కర్స్ యూనియన్ అధ్యక్షులు మహేందర్ మాట్లాడుతూ.. గత నాలుగేళ్లుగా కార్మికుల వేతనాలు పెంచలేదని ఆరోపించారు. ఈఎస్ఐ, పీఎఫ్ అమలులో కూడా పలు లోపాలు ఉన్నాయని పేర్కొన్నారు. సమాన పనికి సమాన వేతనం అమలు చేయడంతో పాటు ప్రభుత్వ సెలవులు కల్పించాలని డిమాండ్ చేశారు. తమ న్యాయమైన డిమాండ్లను విశ్వవిద్యాలయ యాజమాన్యం వెంటనే పరిష్కరించాలని, లేకపోతే ఉద్యమాన్ని మరింత ఉధృతం చేస్తామని హెచ్చరించారు.

## తలసేమియా చిన్నారుల కోసం 60 యూనిట్ల రక్తం సేకరణ



**హయత్‌నగర్, జూలై 10 (జనం సాక్షి) :** తలసేమియా బాధిత చిన్నారుల కోసం జైభారత్ ఆధ్వర్యంలో శుక్రవారం ఎల్‌బీనగర్‌లోని విజయ విహారం ఖల్సా భవన్‌లో నిర్వహించిన రక్తదాన శిబిరంలో 60 యూనిట్ల రక్తాన్ని సేకరించారు. ఖదిజ్ఞాసి ఆత్మ సమర్పణ దీక్ష--2026, దీక్షా విరమణ దినం సందర్భంగా జైభారత్ పూర్వ జాతీయ అధ్యక్షుడు ఆజాద్ షేక్ 9వ వర్ధంతిని పురస్కరించుకుని ఈ శిబిరాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా జైభారత్ జాతీయ ప్రధాన కార్యదర్శి విజయవిహారం రమణమూర్తి మాట్లాడుతూ తలసేమియా చిన్నారులకు ప్రతి నెల రెండు సార్లు రక్తం ఎక్కించాల్సిన అవసరం ఉంటుందని తెలిపారు. తలసేమియాతో బాధపడుతున్న వారికి రక్తదానం జీవనాధారంగా నిలుస్తుందని పేర్కొంటూ, ఇటువంటి సేవా కార్యక్రమాలు మరింత విస్తరించాలని అన్నారు. జై భారత్ జాతీయ కార్యదర్శి రజని మాట్లాడుతూ ఒక్క యూనిట్ రక్తం ఒక తలసేమియా చిన్నారి ప్రాణాలను కాపాడగలదని, ప్రతి ఒక్కరూ స్వచ్ఛందంగా రక్తదానం చేయాలని పిలుపునిచ్చారు. జాతీయ కార్యదర్శి లోక్‌నాథ్ మాట్లాడుతూ గత 20 ఏళ్లుగా జైభారత్ తలసేమియా చిన్నారుల కోసం నిరంతరంగా రక్తదాన శిబిరాలు నిర్వహిస్తూ వస్తోందని తెలిపారు. ఖాదీ - 2026 మహా ప్రవర్తక్ యోధ వంశీ కూడా రక్తదానం యొక్క ప్రాముఖ్యతను వివరించి, యువత ముందుకు రావాలని కోరారు. ఈ కార్యక్రమంలో జైభారత్ రాష్ట్ర నాయకులు స్వాతి, దుర్గారెడ్డి, రాజు, లక్ష్మి, ఉమా, లక్ష్మేశ్వర్, రాహెల్ ఖాన్, మల్లికా వల్లభ, బెనజీర్, సత్యనారాయణ గోల, తదితరులు పాల్గొన్నారు.

## ప్రజలకు రోడ్డు భద్రతపై అవగాహన కల్పించాలి



**మహేశ్వరం, జూలై 10 (జనంసాక్షి) :** ప్రజలకు రోడ్డు భద్రతపై అవగాహన కల్పించాలని ఫ్యూచర్ సిటీ కమిషనరేట్ సీపీ తరుణ్ జోషి అన్నారు. శుక్రవారం కందుకూరు పోలీస్ స్టేషన్ ను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా సీపీ తరుణ్ జోషి మాట్లాడుతూ... ప్రతి పోలీసు ఉద్యోగి తన వంతు బాధ్యతగా మొక్కలు నాటి సంరక్షించాలన్నారు. ప్రజలకు పోలీసుల ఉనికి స్పష్టంగా కనిపించేలా సమర్థవంతంగా విధులు నిర్వహించాలన్నారు. సైబర్ నేరాల నియంత్రణకు ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. ప్రజలకు చట్టాలపై అవగాహన కల్పించాలన్నారు. పెండింగ్ లో ఉన్న గ్రేవ్ కేసుల దర్యాప్తును వేగవంతం చేసి త్వరగా పూర్తి చేయాలన్నారు. పోలీస్ స్టేషన్ రికార్డులను క్రమబద్ధంగా నిర్వహించాలన్నారు. ఈ కార్యక్రమంలో మహేశ్వరం జోన్ డీసీపీ నారాయణరెడ్డి, ఏసిపి జానకి రెడ్డి, కందుకూరు సిఐ వెంకటేశ్వర్లు, పోలీసు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## నిమ్స్‌లో లీన్ సిక్స్ సిగ్మా బ్లాక్ బెల్ట్ శిక్షణా కార్యక్రమం ప్రారంభం



**ఖైరతాబాద్, జూలై 10 (జనం సాక్షి) :** నిజామ్స్ ఇన్స్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్(నిమ్స్) పరి పాలన విభాగం ఆధ్వర్యంలో మాస్టర్ ఆఫ్ హాస్పి టల్ మేనేజ్‌మెంట్(ఎంహెచ్ఎం) విద్యార్థులు, రెసి డెంట్ మెడికల్ ఆఫీసర్స్(ఆర్ఎంఓలు) కోసం మూ డు రోజుల లీన్ సిక్స్ సిగ్మా బ్లాక్ బెల్ట్ ప్రత్యేక శిక్ష ణా కార్యక్రమం శుక్రవారం ప్రారంభమైంది. సిక్స్ సిగ్మా ట్రైనింగ్ కోఆర్డినేటర్ డా.మార్త రమేష్ సమ న్వయంతో నిమ్స్ పాత భవనంలోని లెర్నింగ్ సెం టర్‌లో ఈ కార్యక్రమం నిర్వహించారు. నిమ్స్ డైరెక్టర్ ప్రొఫెసర్ రాహుల్ దేవరాజ్ ముఖ్య అతి థిగా హాజరై జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లా డుతూ.. ఆసుపత్రి పరిపాలనలో నాణ్యతా ప్రమా ణాలను మెరుగుపరచడంలో సిక్స్ సిగ్మా విధానం కీలక పాత్ర పోషిస్తుందని అన్నారు. నాణ్యమైన వైద్య సేవలు అందించాలంటే ఆధునిక నిర్వహణ విధానాలపై విద్యార్థులు, వైద్య అధికారులు సమగ్ర అవగాహన పెంపొందించుకోవాలని సూచించారు. ఇటువంటి శిక్షణా కార్యక్రమాలు భవిష్యత్ ఆసు పత్రి నిర్వాహకులు, వైద్య అధికారుల నైపుణ్యాలను మరింత పెంపొందిస్తాయని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో నిమ్స్ డీన్ ప్రొఫెసర్ పి.చంద్రశేఖర్, ఎగ్జిక్యూటివ్ రిజిస్ట్రార్ ప్రొఫెసర్ పరంజ్యోతి, మెడి కల్ సూపరింటెండెంట్ డా.నిమ్మ సత్యనారాయణ, పరిపాలన విభాగం హెచ్ఓడీ డా.లక్ష్మి భాస్కర్, అడిషనల్ మెడికల్ సూపరింటెండెంట్ డా.కృష్ణా రెడ్డి, అసిస్టెంట్ మెడికల్ సూపరింటెండెంట్లు డా. రాకేష్, డా.చరణ్ రాజ్, డా.సల్మాన్, అంతర్జాతీయ సిక్స్ సిగ్మా నిపుణుడు నవీన్ కుమార్, పరిపాలన విభాగం అధికారులు, అధ్యాపకులు, ఎంహెచ్ఎం విద్యార్థులు, ఆర్ఎంఓలు పాల్గొన్నారు.

# తెలంగాణ సైకాలజిస్టుల కౌన్సిల్ ఏర్పాటు చేయాలి

- కేంద్ర మంత్రి జి. కిషన్ రెడ్డికి టీపీఏ వినతి



**హయత్‌నగర్, జూలై 10 (జనం సాక్షి) :** తెలంగాణ సైకాలజిస్టుల అసోసియేషన్ (టిపిఏ) ఆధ్వర్యంలో తెలంగాణ రాష్ట్ర సైకాలజిస్టుల కౌన్సిల్ ఏర్పాటు చేయాలని కోరుతూ కేంద్ర బొగ్గు, గనుల శాఖ మంత్రి జి. కిషన్ రెడ్డికి వినతిపత్రం సమర్పించారు. అసోసియేషన్ ఉపాధ్యక్షులు డా. ఎన్. వెంకటేశ్వర్లు నాయకత్వం లోని సైకాలజిస్టులు, వైద్య నిపుణులు, విద్యావేత్తల ప్రతినిధి బృందం హైదరాబాద్‌లోని తాజ్ డెక్కన్ హోటల్‌లో మంత్రిని కలిసి ఈ వినతిపత్రాన్ని అందజేసింది. ఫోరం ఫర్ నేషనలిస్ట్ థింకర్స్ ఆధ్వర్యంలో నిర్వహించిన మేధావుల సదస్సు సందర్భంగా ఈ సమావేశం జరిగింది. ఈ సదస్సులో కేంద్ర ఆరోగ్య, కుటుంబ సంక్షేమ శాఖ మంత్రి జె.పీ. నడ్డా, కేంద్ర మంత్రి జి. కిషన్ రెడ్డి, ఈఎఫ్ఎల్యూ ఉపకులపతి ప్రొఫెసర్ ఎన్. నాగరాజు, హైదరాబాద్ విశ్వవిద్యాలయం ఉపకులపతి ప్రొఫెసర్ అనురాధ జొన్నలగడ్డ తదితరులు ప్రసంగించారు. ఈ సందర్భంగా ప్రతినిధి బృందం సైకాలజిస్టులకు చట్టబద్ధమైన గుర్తింపు, రిజిస్ట్రేషన్, వృత్తి నియంత్రణ, నైతిక ప్రమాణాల పరిరక్షణతో పాటు ప్రజలకు నాణ్యమైన మానసిక ఆరోగ్య సేవలు అందించేందుకు తెలంగాణ రాష్ట్ర సైకాలజిస్టుల కౌన్సిల్ ఏర్పాటు చేయడం అత్యవసరమని వివరించింది. వినతిపత్రాన్ని స్వీకరించిన కేంద్ర మంత్రి జి. కిషన్ రెడ్డి ఈ అంశాన్ని కేంద్ర ఆరోగ్య శాఖ మంత్రి జె.పీ. నడ్డా దృష్టికి తీసుకెళ్తానని హామీ ఇచ్చారు. ప్రతినిధి బృందంలో పద్మశ్రీ డా. పి. హనుమంతరావు, డా. ధనశ్రీ నాయుడు, డా. తులసి రావు ( ఐ ఎఫ్ ఎస్), డా. మార్కండేయులు, డా. శాంతన్, డా. రాజు (సీఈఓ, తారా హాస్పిటల్స్), డా. శ్రీనాథ్ పేటల్, డా. శృతి, డా. జ్యోత్స్న, డా. కొడాటి విజయలక్ష్మి, డా. కె.ఎల్. నారాయణరావు, ప్రొఫెసర్ డా. రామస్వామి తదితరులు పాల్గొన్నారు. డా. ఎన్. వెంకటేశ్వర్లు మాట్లాడుతూ మానసిక ఆరోగ్య సేవల విస్తరణకు, సైకాలజిస్టుల వృత్తిపరమైన గుర్తింపుకు ప్రత్యేక కౌన్సిల్ ఏర్పాటు కీలకమని తెలిపారు. రాష్ట్ర అధ్యక్షులు డా. మోటుకూరి రామచందర్ ఈ ప్రయత్నాన్ని సైకాలజిస్టుల వృత్తి చరిత్రలో ఒక ముఖ్యమైన ముందడుగుగా అభివర్ణిస్తూ, అసోసియేషన్ తరఫున పూర్తి మద్దతు ప్రకటించారు.

## ఫిర్యాదుదారుల పట్ల సానుకూలంగా స్పందించాలి


- జిల్లా ఎస్పీ శ్రీనివాసరావు



**ఇటిక్యాల, జూలై 10 (జనం సాక్షి) :** పోలీస్ స్టేషనుకు వచ్చే ఫిర్యాదుదారుల పట్ల పోలీసులు సానుకూలంగా స్పందిస్తూ విధులు నిర్వహించాలని జిల్లా ఎస్పీ శ్రీనివాసరావు పోలీసులను ఆదేశించారు. వార్షిక తనిఖీలో భాగంగా శుక్రవారం ఇటిక్యాల పోలీస్ స్టేషను తనిఖీ చేశారు. పోలీస్ సిబ్బంది యూనిఫామ్, స్టేషన్ రికార్డులతో పాటు పరిసరాలను పరిశీలించారు. అంతకుముందు ఎస్పీ పోలీస్ సిబ్బందిచే గౌరవ వందనం స్వీకరించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ మారుతున్న సమాజానికి అనుగుణంగా రాష్ట్ర పోలీస్ శాఖ అందుబాటులోకి తీసుకొచ్చిన నూతన విధివిధానాలను అవలంబించాలన్నారు. జాతీయ రహదారిపై నేరాల నియంత్రణకు పోలీస్ సిబ్బంది సహకరించాలని, నేరాలను నియంత్రించడంలో సీసీ కెమెరాల ప్రాధాన్యతను ప్రజలకు వివరిస్తూ, ప్రజలే స్వచ్ఛందంగా సీసీ కెమెరాలను ఏర్పాటు చేసుకునేలా ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. విధి నిర్వహణలో అంకితభావంతో పని చేసినప్పుడే మంచి గుర్తింపు వస్తుందని, ఒకే చోట పనిచేసే సిబ్బంది మధ్య ఎలాంటి విభేదాలు రాకుండా సమన్వయంతో పని చేసుకోవాలని సూచించారు. ప్రజలు పోలీస్ యూనిఫామ్ కు ఇచ్చే గౌరవంను అంతే గౌరవంతో బాధ్యతగా విధులు నిర్వహించాలన్నారు. ఈ తనిఖీలో డీఎస్పీ మొగులయ్య అలంపూర్ సిఐ ప్రదీప్, ఇటిక్యాల ఎస్ఐ రవి, పోలీస్ సిబ్బంది ఉన్నారు.

## కార్యాచరణ ప్రణాళికతో గ్రామాల సమగ్రాభివృద్ధికి కృషి చేయాలి

- గ్రామ అభివృద్ధిలో సర్పంచుల పాత్ర కీలకం
- అందుబాటులో ఉన్న నిధులతో గ్రామాలను అభివృద్ధి చేయాలి
- 248 గ్రామపంచాయతీ సర్పంచులకు అవగాహన శిక్షణ
- అదనపు కలెక్టర్ నగేష్




**నర్సాపూర్, జూలై 10 (జనం సాక్షి) :** గ్రామ పంచాయతీల సమగ్ర అభివృద్ధికి సర్పంచులు స్థానిక అవసరాలను గుర్తించి కార్యాచరణ ప్రణాళిక రూపొందించి అమలు చేయాలని అదనపు కలెక్టర్ నగేష్ సూచించారు. నర్సాపూర్‌లోని బీవీఆర్ఐటీ కళాశాలలో శుక్రవారం నర్సాపూర్, తూప్రాన్ డివిజన్‌ల పరిధిలోని 248 గ్రామ పంచాయతీల సర్పంచులు, పంచాయతీ కార్యదర్శులకు గ్రామ పంచాయతీ సమగ్ర అభివృద్ధి ప్రణాళిక, వి.బి.గ్రామ్‌జీ, జలసిరి, ఓఎస్ఆర్, ఘన వ్యర్థాల నిర్వహణ (ఎస్‌డబ్ల్యూఎం) నిబంధనలు, 16వ ఆర్థిక సంఘం మార్గదర్శకాలు తదితర అంశాలపై ఒక రోజు అవగాహన శిక్షణా కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన అదనపు కలెక్టర్ నగేష్ మాట్లాడుతూ, గ్రామ స్థాయిలో చేపట్టే ప్రతి అభివృద్ధి కార్యక్రమంలో సర్పంచులు, వార్డు సభ్యుల భాగస్వామ్యం కీలకమని అన్నారు. గ్రామాల్లో ఉన్న సమస్యలను అందుబాటులో ఉన్న వనరులతో, ప్రభుత్వ నిబంధనలకు అనుగుణంగా పరిష్కరించేలా ప్రణాళికలు రూపొందించాలని సూచించారు. గ్రామ పంచాయతీలకు లభించే 15వ, 16వ ఆర్థిక సంఘం నిధులు, రాష్ట్ర ఆర్థిక సంఘం నిధులు, సాధారణ నిధులు, పన్నుల ద్వారా వచ్చే ఆదాయం, వి.బి.గ్రామ్‌జీ వంటి పథకాల నిధులను సమర్థవంతంగా వినియోగించి గ్రామాభివృద్ధికి ప్రాధాన్యం ఇవ్వాలని అన్నారు. గ్రామాల్లో పెరుగుతున్న వీధి కుక్కల సమస్యను శాశ్వతంగా పరిష్కరించేందుకు జంతు పునరుత్పత్తి నియంత్రణ కేంద్రాలు ఏర్పాటు చేయాలని సూచించారు. పశువైద్య శాఖ ఆధ్వర్యంలో శస్త్రచికిత్సలు, యాంటీ రేబిస్ టీకాలు ఉచితంగా అందుబాటులో ఉంటాయని తెలిపారు. అలాగే మురుగునీటి కాలువలు, ఇంకుడు గుంతలు, కమ్యూనిటీ హాళ్లు, తాగునీటి సౌకర్యాలు, సౌర విద్యుత్ వీధి దీపాల ఏర్పాటు వంటి పనులకు ప్రభుత్వ పథకాల ద్వారా ప్రత్యేక నిధులు అందుబాటులో ఉన్నాయని చెప్పారు. ఉపాధి హామీ, వి.బి.గ్రామ్‌జీ పథకాల కింద చేపట్టిన పనులకు సంబంధించిన బిల్లులు, యుటిలైజేషన్ సర్టిఫికెట్లు సకాలంలో సమర్పిస్తే చెల్లింపులు త్వరితగతిన జరుగుతాయని పేర్కొన్నారు. గ్రామ పంచాయతీ నిధులను ప్రజా ప్రయోజనాల కోసమే వినియోగించాలని, నిధుల దుర్వినియోగం లేదా మళ్లింపు జరిగినట్లయితే సంబంధిత అధికారులపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ప్రతి గ్రామంలో గ్రామ పంచాయతీ భవనం, మహిళా సంఘాల భవనాలు, ఇతర మౌలిక వసతుల నిర్మాణానికి అవసరమైన భూమి, పరిపాలనా అనుమతులు జిల్లా యంత్రాంగం నుంచి అందజేస్తామని తెలిపారు. చిన్న, సన్నకారు రైతులకు కూరగాయల సాగు కోసం పందిళ్ల ఏర్పాటు, బీటీ రహదారులు, మ్యాజిక్ డ్రైన్లు, సౌర విద్యుత్ ఆధారిత వీధి దీపాలు వంటి అభివృద్ధి కార్యక్రమాలను గ్రామాల్లో విస్తృతంగా అమలు చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో జెడ్పీ సీఈఓ ఎల్లయ్య, డీఆర్‌డీఓ శ్రీనివాసరావు, డీపీఓ యాదయ్య, నర్సాపూర్, తూప్రాన్ డివిజన్‌ల డీఎల్‌పీఓలు, ఎంపీడీవోలు, ఎంపీవోలు, సర్పంచులు, పంచాయతీ కార్యదర్శులు, ఆర్‌డబ్ల్యూఎస్, పంచాయతీరాజ్ ఇంజినీరింగ్ శాఖ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## ఏడాదైనా అమలుకు నోచుకోని భూభారతి చట్టం

- అసహనంలో రైతులు
- భూ సమస్యల వైపు కన్నెత్తి చూడని రెవెన్యూ అధికారులు
- దశాబ్దాల కాలం నుంచి పరిష్కారానికి నోచుకోని వైనం..
- కొత్త పట్టా బుక్కులు అందని రైతులు




**కోహీర్, జూన్ 10 (జనం సాక్షి) :** కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వస్తే ధరణిని బంగాళాఖాతంలో కలిపి, 'భూభారతి' చట్టం ద్వారా ప్రతీ రైతు భూ సమస్యను పరిష్కరిస్తామని ఇచ్చిన హామీలు క్షేత్రస్థాయిలో అమలు కావడం లేదు. భూభారతి వ్యవస్థను ప్రవేశపెట్టి ఏడాది గడుస్తున్నా, మర్పల్లి మండలంలోని రైతుల భూ సమస్యలు ఇప్పటికీ అపరిష్కృతంగానే మిగిలిపోయాయి. అధికారులు మారుతున్నా, వ్యవస్థలు మారుతున్నా తమ తలరాతలు మారడం లేదనీ ఇక్కడి రైతాంగం తీవ్ర ఆవేదన వ్యక్తం చేస్తోంది. అసైన్మెంట్ గా మారిన పట్టా భూములు, మండలంలో ప్రధానంగా ఖరీఫ్ ఖాతా, సొంత పట్టా భూములు కూడా రికార్డుల్లో తప్పుల తడకగా మారి అసైన్మెంట్ (ప్రభుత్వ) భూములుగా నమోదవుతున్నాయి. దీనివల్ల తరతరాలుగా సాగు చేసుకుంటున్న భూములపై రైతులకు హక్కులు కోల్పోయే పరిస్థితి వచ్చింది. గత కాంగ్రెస్ ప్రభుత్వాల హయాంలో పంపిణీ చేసిన భూములకు ఇప్పటివరకు ఆన్లైన్ రికార్డుల్లో చోటు దక్కకపోవడం గమనార్హం. అధికారులు చేసిన తప్పులకు అవసరానికి అమ్ముకోలేక.. అప్పు పుట్టక. భూ పంపకాలు జరగక, ఆన్లైన్ సమస్యల కారణంగా కనీసం అత్యవసర సమయాల్లో (పిల్లల చదువులకు, పెండ్లిలకు, వైద్య ఖర్చులకు భూములు అమ్ముకుందామన్నా కుదరని పరిస్థితి నెలకొంది. బ్యాంకుల్లో పంట రుణాలు తీసుకుందామన్నా ఆన్లైన్ రికార్డులు సరిగ్గా లేకపోవడంతో బ్యాంకర్లు నిరాకరిస్తున్నారు. ముఖ్యంగా తాతల కాలం నుంచి సాగు చేసుకుంటున్న దళిత రైతుల భూ సమస్యలు దశాబ్దాలుగా నలుగుతూనే ఉన్నాయి కానీ తార్కాణానికి నోచుకోవడం లేదు అనే ఆరోపణలు ఉన్నాయి .ఇప్పటికైనా ఉన్నతాధికారులు, రెవెన్యూ యంత్రాంగం వెంటనే స్పందించి, మండలంలో ఏడాది క్రితం ప్రత్యేక రెవెన్యూ సదస్సుల లో వచ్చిన దరఖాస్తుల సమస్యలను వెంటనే పరిష్కరించాలని స్థానిక రైతులు కోరుతున్నారు. క్షేత్రస్థాయిలో ప్రతి సమస్యనూ పరిశీలించి, లోపాలను సవరించి కోహిర్ మండలాన్ని "భూ సమస్యలు లేని మండలంగా తీర్చిదిద్దాలని రైతులు డిమాండ్ చేస్తున్నారు.

## పాత కక్షలతో వ్యక్తిపై తీవ్రంగా దాడి

- పోతుల నరేందర్‌కు తీవ్ర గాయాలు



**మక్తల్, జూలై 10 (జనంసాక్షి) :** పాత కక్షలతో వ్యక్తి పై దాడి చేసిన సంఘటన మక్తల్ మండల కేంద్రంలో చోటుచేసుకుంది. ఎస్సై రాజు తెలిపిన వివరాల ప్రకారం గురువారం రాత్రి అందాజా 10:22 గంటల సమయంలో శాంతమ్మ వైన్స్ వెనకాల మక్తల్ టౌన్ లో పోతుల నరేందర్ అనే వ్యక్తి మద్యం సేవిస్తూ ఉండగా ఉప్పరపల్లి గ్రామానికి చెందిన పెద్ద అశోక్, హరీష్, అభిరామ్, నరేష్, హనుమంతు, చిన్న అశోక్ వ్యక్తులు పాత కక్షలు మనసులో పెట్టుకుని తీవ్రంగా దాడి చేసినట్లు తెలిపారు. అనంతరం పోలీసులు సంఘటన స్థలానికి చేరుకొని గాయపడిన వ్యక్తిని ప్రభుత్వ ఆసుపత్రికి తరలించినట్లు తెలిపారు. అనంతరం గాయపడిన పోతుల నరేందర్ మామ అయినా పట్నం నరేందర్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

### నిందితులను వెంటనే అరెస్టు చేయాలి

మక్తల్ పట్టణంలో గురువారం రాత్రి నరేందర్ అనే వ్యక్తిపై కొందరు వ్యక్తులు దాడి చేసి తీవ్రంగా గాయపరిచారు. ఇట్టి విషయమై కేసు నమోదు చేసిన నిందితులను ఇంకా ఎందుకు అదుపులోకి తీసుకోలేదని ప్రశ్నిస్తూ మాజీ ఎమ్మెల్యే చిట్టెం రామ్మోహన్ రెడ్డి మక్తల్ పోలీస్ స్టేషన్లో శుక్రవారం ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా పోలీసులకు వ్యతిరేకంగా నినాదాలు చేశారు. అనంతరం మాట్లాడుతూ పోలీసులు వెంటనే సదురు నిందితులను అరెస్టు చేయాలని ఆగ్రహం వ్యక్తం చేశారు. చర్యలు తీసుకోకపోతే మరోసారి పోలీస్ స్టేషన్ ముట్టడిస్తామని హెచ్చరించారు.

## ప్రభుత్వ పాఠశాలల మూసివేత నిర్ణయాన్ని విరమించుకోవాలి

- ఏఐఎస్ఎఫ్ మాజీ జిల్లా ఉపాధ్యక్షులు అందె అశోక్



**చేర్యాల, జూలై 10 (జనంసాక్షి) :** ప్రభుత్వ పాఠశాల మూసివేత నిర్ణయాన్ని వెంటనే ప్రభుత్వం వెనక్కి తీసుకోవాలని ఏఐఎస్ఎఫ్ మాజీ ఉమ్మడి వరంగల్ జిల్లా ఉపాధ్యక్షులు అందె అశోక్ డిమాండ్ చేశారు. విద్యారంగ సమస్యల పరిష్కారానికి వామపక్ష విద్యార్థి సంఘాలు ఇచ్చిన బంద్ పిలుపుమేరకు శుక్రవారం చేర్యాల మండల వ్యాప్తంగా ఏఐఎస్ఎఫ్, ఎస్ఎఫ్ఐ విద్యార్థి సంఘాల ఆధ్వర్యంలో ప్రభుత్వ పాఠశాలను తరగతులు బహిష్కరించారు. ప్రైవేటు పాఠశాలలు తెరుచుకోలేదు. విద్యాసంస్థల బంద్ విజయవంతమైంది. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. విద్యాహక్కు చట్టం ప్రకారం ప్రైవేటు బడుల్లో పేద విద్యార్థులకు 25 శాతం సీట్లు కేటాయించాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు ఏకరూప దుస్తుల్ని వెంటనే అందజేయాలన్నారు. 16 వస్తువులతో కూడిన కిట్స్ అందించాలన్నారు. ప్రతి పాఠశాలలో కంప్యూటర్ ల్యాబ్ ను అందుబాటులోకి తేవాలని, ఖాళీగా ఉన్న ఉపాధ్యాయ, ఎంఈఓ పోస్టులను వెంటనే భర్తీ చేయాలని, రేషలైజేషన్ పేరుతో ప్రభుత్వ పాఠశాల విలీనం పాఠశాలలను తగ్గింపు చేసే నిర్ణయాన్ని విరమించుకోవాలని డిమాండ్ చేశారు. డీఎస్సీ నిర్వహించి తక్షణమే ఉపాధ్యాయ ఖాళీలను భర్తీ చేయాలన్నారు. విద్యార్థులకు పెండింగ్లో ఉన్న ఫీజు రియంబర్స్మెంట్స్ స్కాలర్షిప్ లు వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేశారు. విద్యారంగంలో నెలకొన్న అనేక సమస్యలను వెంటనే పరిష్కారం చేసి విద్యాభివృద్ధికి ప్రభుత్వం కృషి చేయాలని కోరారు. కార్యక్రమంలో విద్యార్థి నాయకులు పోరండ్ల చందు, కరెడ్ల రంజిత్ రెడ్డి, ఎండీ. అజీమద్దిన్, వెంకట్, నరేష్, తదితరులు పాల్గొన్నారు.

## ఆధునిక పోలీసింగ్‌లో సాంకేతిక పరిజ్ఞానం వినియోగం కీలకం

- ఎస్పీ పరితోష్ పంకజ్



**సంగారెడ్డి బ్యూరో, జూలై 10 (జనం సాక్షి) :** ఆధునిక పోలీసింగ్‌లో సాంకేతిక పరిజ్ఞానం వినియోగం కీలకమని జిల్లా ఎస్పీ పరితోష్ పంకజ్ పేర్కొన్నారు. జిల్లా పోలీసు సిబ్బందిలో సాంకేతిక నైపుణ్యాలను పెంపొందించేందుకు సంగారెడ్డి జిల్లా మునిపల్లి మండలంలోని కంకోల్ వోక్సెన్ యూనివర్సిటీలో నిర్వహిస్తున్న ఎంఎస్ ఆఫీస్ ప్రత్యేక శిక్షణ తొలి బ్యాచ్ శుక్రవారం ముగిసింది. ముగింపు కార్యక్రమానికి జిల్లా ఎస్పీ పరితోష్ పంకజ్ ముఖ్య అతిథిగా హాజరై శిక్షణ పూర్తి చేసిన పోలీసు సిబ్బందికి పార్టిసిపేషన్ సర్టిఫికెట్లు అందజేశారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ... ఆధునిక పోలీసింగ్‌లో సాంకేతిక పరిజ్ఞానం వినియోగం కీలకమైందని, వర్డ్, ఎక్సెల్ వంటి సాఫ్ట్‌వేర్‌లలో ప్రావీణ్యం పెంపొందించుకోవడం ద్వారా కార్యాలయ పనితీరు మరింత వేగవంతంగా, సమర్థవంతంగా మారుతుందని అన్నారు. జిల్లా పోలీసు కార్యాలయ సిబ్బంది, స్టేషన్ రైటర్లు, సైబర్ వారియర్లు, టెక్ టీమ్ సభ్యులు కలిపి 180 మందికి మూడు బ్యాచ్‌లుగా, ఒక్కో బ్యాచ్‌కు మూడు రోజుల చొప్పున శిక్షణ అందిస్తున్నట్లు తెలిపారు. శిక్షణలో నేర్చుకున్న అంశాలను రోజువారీ విధుల్లో సమర్థంగా వినియోగించుకోవాలని సూచించిన ఎస్పీ, ఇటువంటి నైపుణ్యాభివృద్ధి కార్యక్రమాలు పోలీసు సేవల నాణ్యతను పెంచడంలో కీలక పాత్ర పోషిస్తాయని పేర్కొన్నారు. కార్యక్రమంలో శిక్షణ విజయవంతంగా పూర్తి చేసిన తొలి బ్యాచ్ సిబ్బందిని అభినందించిన ఎస్పీ, శిక్షణ అందించిన వోక్సెన్ యూనివర్సిటీ యాజమాన్యం, అధ్యాపకులకు పోలీసు శాఖ తరపున కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో వోక్సెన్ యూనివర్సిటీ అధ్యాపకులు, జిల్లా పోలీసు అధికారులు, శిక్షణ పొందిన సిబ్బంది పాల్గొన్నారు.

## ఆయిల్‌పామ్ సాగుపై రైతులకు విజ్ఞాన యాత్ర



**సంగారెడ్డి బ్యూరో, జూలై 10 (జనం సాక్షి) :** ఉద్యాన శాఖ ఆధ్వర్యంలో ఆయిల్ పామ్ సాగుపై ఆసక్తి ఉన్న రైతులకు విజ్ఞాన యాత్ర నిర్వహించారు. సంగారెడ్డి జిల్లాలోని వివిధ మండలాలకు చెందిన 22 మంది రైతులను ఖమ్మం జిల్లా కొనిజర్ల మండలంలోని ఆయిల్ పామ్ తోటలకు తీసుకెళ్లి క్షేత్రస్థాయిలో సాగు విధానాలపై అవగాహన కల్పించారు. కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న జాతీయ ఆయిల్ పామ్ అభివృద్ధి కార్యక్రమంలో భాగంగా నిర్వహించిన ఈ యాత్రలో రైతులు మొక్కల పెంపకం, తోటల నిర్వహణ, ఎరువుల వినియోగం, నీటి యాజమాన్యం, పంట సంరక్షణ, దిగుబడులు, పండ్ల కోత, రవాణా, నూనె తయారీ ప్రక్రియ, విక్రయ విధానాలపై ప్రత్యక్షంగా తెలుసుకున్నారు. అలాగే ఆయిల్ పామ్ సాగు చేస్తున్న రైతులతో సమావేశమై వారి అనుభవాలు, ఆదాయం, ఎదురవుతున్న సమస్యలు, వాటి పరిష్కారాలను తెలుసుకుని సందేహాలను నివృత్తి చేసుకున్నారు. విజ్ఞాన యాత్రను ఉద్యాన అధికారి కె. మౌనికా రెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఆయిల్ పామ్ దీర్ఘకాలికంగా స్థిరమైన ఆదాయాన్ని అందించే వాణిజ్య పంట అని తెలిపారు. ప్రభుత్వం అందిస్తున్న ప్రోత్సాహకాలు, రాయితీలను సద్వినియోగం చేసుకుని శాస్త్రీయ పద్ధతుల్లో సాగు చేపడితే అధిక దిగుబడులతో మంచి ఆదాయం పొందవచ్చని రైతులకు సూచించారు. ఈ కార్యక్రమంలో ఉద్యాన శాఖ అధికారులు, గోద్రెజ్ ఆగ్రోవెట్ సంస్థ ప్రతినిధులు, సంగారెడ్డి జిల్లాలోని వివిధ మండలాలకు చెందిన రైతులు పాల్గొన్నారు.

## యుద్ధాలు, అంతరాలు లేని సమాజమే కమ్యూనిస్టుల లక్ష్యం




**వనపర్తి రూరల్, జూలై 10 (జనం సాక్షి) :** యుద్ధాలు, సామాజిక అంతరాలు లేని సమ సమాజ స్థాపనే కమ్యూనిస్టుల లక్ష్యమని సీపీఐ జాతీయ కమిటీ సభ్యుడు, మాజీ ఎమ్మెల్యే చాడ వెంకట్ రెడ్డి అన్నారు. వనపర్తిలో శుక్రవారం ప్రారంభమైన ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లా సీపీఐ కార్యవర్గ సభ్యుల మూడు రోజుల శిక్షణ శిబిరాన్ని ఆయన ప్రారంభించి మాట్లాడారు. అంతర్జాతీయంగా యుద్ధ వాతావరణం పెరుగుతోందని, యుద్ధాలు శాంతికి కాకుండా హింస, విధ్వంసానికే దారి తీస్తాయని పేర్కొన్నారు. దేశంలో మత రాజకీయాలతో ప్రజల అసలు సమస్యలను పక్కన పెడుతున్నారని కేంద్ర ప్రభుత్వంపై విమర్శలు చేశారు. రామ మందిరానికి సంబంధించిన అవకతవకలపై సీబీఐ విచారణ జరపాలని డిమాండ్ చేశారు. రాష్ట్ర ప్రభుత్వం ఎన్నికల హామీల అమలులో విఫలమైందని ఆరోపించిన ఆయన, ఇందిరమ్మ ఇళ్ల కేటాయింపులో అర్హులకు ప్రాధాన్యం ఇవ్వాలని, భూదాన భూములపై పేదల ఇళ్ల కూల్చివేతలను నిలిపివేయాలని కోరారు. మహిళలకు ప్రకటించిన ఆర్థిక సాయం, నిరుద్యోగులకు ఉద్యోగాల భర్తీ, పాలమూర - రంగారెడ్డి ఎత్తిపోతలతో పాటు జిల్లాలోని పెండింగ్ సాగునీటి ప్రాజెక్టులను త్వరగా పూర్తి చేయాలని డిమాండ్ చేశారు. హామీల అమలు, ప్రజా సమస్యల పరిష్కారం కోసం సీపీఐ ప్రజా ఉద్యమాలను మరింత ఉద్ధృతం చేస్తుందని చాడ వెంకట్ రెడ్డి తెలిపారు. ఈ కార్యక్రమంలో సీపీఐ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు బాల నరసింహ, జిల్లా కార్యదర్శులు విజయరాములు, ఎస్.ఎం.డి. ఫయాజ్, బాలకిషన్, బి. ఆంజనేయులు తదితర నాయకులు పాల్గొన్నారు.

## ఎస్ఐఆర్ ప్రక్రియను గడువులోగా పక్కా ప్రణాళికతో పూర్తి చేయాలి

- కలెక్టర్ ప్రతిమా సింగ్



**మెదక్ బ్యూరో, జూలై 10 (జనం సాక్షి) :** భారత ఎన్నికల సంఘం ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ (ఎస్ఐఆర్) ప్రక్రియను పారదర్శకంగా, పక్కా ప్రణాళికతో నిర్దేశిత గడువులోగా పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ ప్రతిమా సింగ్ అధికారులను ఆదేశించారు. ఎస్ఐఆర్‌లో భాగంగా కొనసాగుతున్న ఎన్యూమరేషన్ ఫారాల పంపిణీ, స్వీకరణ, వివరాల డిజిటలైజేషన్ పురోగతిపై శుక్రవారం ఆర్డీవోలు, తహసీల్దారులతో గూగుల్ మీట్ ద్వారా ఆమె సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, జిల్లాలో ఎస్ఐఆర్ ప్రక్రియను పూర్తిస్థాయిలో పారదర్శకంగా అమలు చేయాలని సూచించారు. ఎన్యూమరేషన్ ఫారాల పంపిణీ, స్వీకరణ, నమోదు ప్రక్రియ ఎంత శాతం పూర్తయిందో వివరాలు అడిగి తెలుసుకున్నారు. ప్రతి అర్హ ఓటరికి ఫారం అందేలా చర్యలు తీసుకోవాలని, అందుబాటులో లేని ఓటర్లకు కూడా సమాచారం చేరవేసి గడువులోగా ఫారాలు తిరిగి సమర్పించేలా చూడాలని ఆదేశించారు. జీవనోపాధి కోసం విదేశాలకు వెళ్లిన ఓటర్ల ఎన్యూమరేషన్ ఫారాలను జాగ్రత్తగా పరిశీలించి, వివరాలు నిర్ధారించిన అనంతరం వారి కుటుంబ సభ్యుల సంతకంతో స్వీకరించవచ్చని సూచించారు. ఫారాల స్వీకరణ, వివరాల డిజిటలైజేషన్‌ను ఏకకాలంలో సమాంతరంగా నిర్వహించాలని చెప్పారు. ఓటర్లు ఫారాల్లో నమోదు చేసిన వివరాలను క్షుణ్ణంగా పరిశీలించి, ఖచ్చితత్వం నిర్ధారించేలా చర్యలు చేపట్టాలని, ఓటర్లతో మర్యాదపూర్వకంగా వ్యవహరిస్తూ ఓటరు మ్యాపింగ్‌లో వారి సహకారం పొందాలని సూచించారు. ప్రతి బీఎల్ఓ వద్ద తాజా ఓటరు జాబితా తప్పనిసరిగా అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. మరణించిన వారు, శాశ్వతంగా వలస వెళ్లిన వారు, డబుల్ ఓట్లు కలిగిన వారిని గుర్తించి ఓటరు జాబితాలో తగిన విధంగా మార్కింగ్ చేయాలని కలెక్టర్ పేర్కొన్నారు. ఎస్ఐఆర్ ప్రక్రియను సకాలంలో పూర్తి చేసేందుకు రాజకీయ పార్టీల బూత్ లెవల్ ఏజెంట్లు బీఎల్ఓలకు పూర్తి సహకారం అందించాలని ఆమె కోరారు. ఈ సమీక్ష సమావేశంలో మెదక్ ఆర్డీవో రమాదేవి, ఎన్నికల సూపరింటెండెంట్ గఫార్, ఆర్డీవోలు, తహసీల్దారులు, ఎన్నికల విభాగం సిబ్బంది పాల్గొన్నారు.

## రెండు రోజుల్లో 50శాతం డిజిటలైజేషన్ పూర్తి చేయాలి

- కలెక్టర్ ప్రతీక్ జైన్




**సంగారెడ్డి బ్యూరో, జూలై 10 (జనంసాక్షి) :** ఓటరు జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ (ఎస్ఐఆర్) కార్యక్రమాన్ని వేగవంతం చేయాలని జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్ అధికారులను ఆదేశించారు. వచ్చే సోమవారం నాటికి కనీసం 50 శాతం ఎన్యూమరేషన్ ఫారాల డిజిటలైజేషన్ పూర్తి చేయాలని సూచించారు. ఏఈఆర్‌వోలు పోలింగ్ స్టేషన్ వారీగా ప్రతిరోజూ సమీక్ష నిర్వహించాలని, ఎస్ఐఆర్ అమలులో అలసత్వం ప్రదర్శిస్తే ఎన్నికల సంఘం నిబంధనల ప్రకారం చర్యలు తప్పవని హెచ్చరించారు. ఓటర్లు పూరించిన ఎన్యూమరేషన్ ఫారాలను వెంటనే బీఎల్‌ఓలకు అందించాలని, బూత్ లెవల్ ఏజెంట్లు (బీఎల్‌ఏలు) క్షేత్రస్థాయిలో అందుబాటులో ఉండి బీఎల్‌ఓలకు సహకరించాలని కోరారు. వీడియో కాన్ఫరెన్స్‌లో అదనపు కలెక్టర్ సంగీత, నారాయణఖేడ్ సబ్ కలెక్టర్ ఉమాహారతి, ఆర్‌డీఓలు, మున్సిపల్ కమిషనర్లు, తహసీల్దార్లు తదితర అధికారులు పాల్గొన్నారు.

# అభివృద్ధిలో అశ్రద్ధ చూపొద్దు

- ఆదర్శవంతమైన నగరంగా వరంగల్ ను తీర్చిదిద్దడమే మా లక్ష్యం
- వరంగల్ పశ్చిమ నియోజకవర్గ శాసనసభ్యులు నాయిని రాజేందర్ రెడ్డి



**హనుమకొండ, జూలై 11, (జనం సాక్షి):** వరంగల్ నగరాన్ని ఆదర్శవంతమైన నగరంగా తీర్చిదిద్దే దిశగా రాష్ట్ర ప్రభుత్వం వేగంగా ముందుకు సాగుతోందని, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి వరంగల్ నగర అభివృద్ధిపై ప్రత్యేక దృష్టి సారించారని వరంగల్ పశ్చిమ నియోజకవర్గ శాసనసభ్యులు నాయిని రాజేందర్ రెడ్డి పేర్కొన్నారు. శుక్రవారం వరంగల్ పశ్చిమ నియోజకవర్గ పరిధిలోని 50వ డివిజన్ సహకార్ నగర్, రెవెన్యూ కాలనీ, అలాగే 9వ డివిజన్ కాకతీయ కాలనీలోని సిక్కులవాడ ప్రాంతాల్లో సుమారు రూ.1 కోట్ల వ్యయంతో చేపట్టనున్న పలు అభివృద్ధి పనులకు ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి శంకుస్థాపన చేశారు. స్థానిక ప్రజల అవసరాలను దృష్టిలో ఉంచుకుని ఈ పనులను మంజూరు చేయించినట్లు తెలిపారు. నిర్ణీత గడువులోగా అన్ని పనులు పూర్తి కావాలి. చిన్న పనులైనా ప్రజల దైనందిన జీవితాలతో ముడిపడి ఉంటాయి. కాబట్టి ప్రతి పనిని బాధ్యతగా తీసుకుని పూర్తి చేయాలి అని ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి అధికారులకు సూచించారు. ఈ పనులు పూర్తయితే కాలనీల్లో రవాణా సౌకర్యాలు మెరుగుపడటంతో పాటు పారిశుద్ధ్య పరిస్థితులు కూడా మెరుగవుతాయని వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో స్థానిక ప్రజాప్రతినిధులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, డివిజన్ నాయకులు, అధికారులు, కాలనీవాసులు, మహిళలు, యువకులు తదితరులు పాల్గొన్నారు.

# కాలం ముగిసిన టాబ్లెట్స్‌తో గర్భిణీకి అస్వస్థత

- ఓ మహిళా తల్లి కాబోతుందనే సంతోషం కొద్దిరోజులు కూడా లేకపాయే..
- తీవ్రమైన చర్యలు తీసుకోవాలి : అదిలాబాద్ జిల్లా ఆర్టీఐ అధ్యక్షుడు షేక్ షాకీర్




**బజార్ హత్నూర్, జూన్ 10 (జనం సాక్షి):** మండల కేంద్రంలోని ప్రభుత్వ ఆసుపత్రిలో కాలం ముగిసిన మాత్రలు ఇవ్వడం వల్ల ఓ గర్భిణి తీవ్ర అస్వస్థతకు గురైన ఘటన మండల కేంద్రంలో కలకలం రేపింది. బాధిత కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం.. మండల కేంద్రానికి చెందిన ఓ మహిళకు ఇటీవల గర్భం నిర్ధారణ కావడంతో ప్రభుత్వ ఆసుపత్రిలో వైద్య పరీక్షలు చేయించుకుంది. అనంతరం వైద్య సిబ్బంది ఫోలిక్ యాసిడ్ మాత్రలను అందించారు. ఆ మాత్రలను వాడిన కొద్ది సమయంలోనే గర్భిణికి తీవ్ర రక్తస్రావం కావడంతో కుటుంబ సభ్యులు వెంటనే ఆందోళనకు గురై ఆమెను ప్రైవేట్ ఆసుపత్రికి తరలించి చికిత్స అందించారు. ప్రస్తుతం ఆమె ఆరోగ్య పరిస్థితి నిలకడగా ఉన్నట్లు సమాచారం. ఈ ఘటనపై ఆగ్రహం వ్యక్తం చేసిన కుటుంబ సభ్యులు శుక్రవారం ప్రభుత్వ ఆసుపత్రికి వెళ్లి వైద్య సిబ్బందిని నిలదీశారు. అయితే, "ఆ మాత్రలు మా ఆసుపత్రికి చెందినవి కావు" అని అక్కడి సిబ్బంది చెప్పడం మరింత అనుమానాలకు తావిస్తోంది. ఇదిలా ఉండగా, ఆసుపత్రిలో విధులు నిర్వహించే ఫార్మసిస్ట్ తరచూ విధులకు సక్రమంగా హాజరుకావడం లేదని స్థానికులు ఆరోపిస్తున్నారు.

**విచారణ జరుపుతాం : డీఎంహెచ్వో**

రోగులకు ఇచ్చే మందుల గడువు తేదీలను పరిశీలించి పంపిణీ చేయాల్సిన బాధ్యత ఫార్మసిస్టు ఉన్నప్పటికీ, ఆ బాధ్యతను నిర్లక్ష్యం చేస్తున్నారనే విమర్శలు వ్యక్తమవుతున్నాయి. ప్రభుత్వ ఆసుపత్రిలో కాలం చెలిన మందులు ఎలా పంపిణీ అయ్యాయి? వాటిని ఎవరు ఇచ్చారు? అనే అంశాలపై సమగ్ర విచారణ చేపట్టి బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని బాధిత కుటుంబ సభ్యులు, స్థానికులు డిమాండ్ చేస్తున్నారు. ఈ ఘటనపై జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారిని (డీఎంహెచ్వో) సాధనను చరవాణిలో వివరణ కోరగా, ఆమె సానుకూలంగా స్పందిస్తూ.. "గడువు ముగిసిన మాత్రలు ఎక్కడి నుంచి వచ్చాయి. వాటిని ఎవరు అందించారు. ప్రభుత్వ ఆసుపత్రి నుంచే ఇచ్చారా లేదా. అనే అన్ని అంశాలపై సమగ్ర విచారణ జరిపి. ఆసుపత్రిలో విధులు నిర్వహించే ఫార్మసిస్ట్ రోజువారీగా మందుల గడువు తేదీలను పరిశీలించి, కాలం ముగిసిన మందులు మాత్రలు రోగులకు వెళ్లకుండా చూడాల్సిన బాధ్యత వారిదే. ఈ ఘటనలో ఏమైనా నిర్లక్ష్యం జరిగిందా అనే విషయాన్ని కూడా విచారిస్తాం. విచారణలో ఎవరి నిర్లక్ష్యం ఉన్నట్లు తేలినా, వారి మీద చట్టపరమైన చర్యలు తీసుకుంటాం." అని డీఎంహెచ్వో తెలిపారు. ఇలాంటి సంఘటనలు మళ్ళీ జరగకుండా చూడాలని అదిలాబాద్ జిల్లా ఆర్ టి ఐ ఉపాధ్యక్షులు షేక్ షాకీర్ అన్నారు.

# జనంసాక్షి వార్త కథనానికి స్పందన


మూగబోయిన
'తెలంగాణ క్రీడా ప్రాంగణం'
జనంసాక్షి

**పలిమేల, జులై 10 (జనంసాక్షి) :** భూపాలపల్లి జిల్లా పలిమెల మండలం పంకెన గ్రామంలోని 'తెలంగాణ క్రీడా ప్రాంగణం' స్థానిక యువతకు అందుబాటులో లేకపోవడంపై ఈ నెల 9న 'జనంసాక్షి' దినపత్రికలో ప్రచురితమైన కథనానికి జిల్లా యంత్రాంగం తక్షణమే స్పందించింది. ఈ వార్తపై జిల్లా యువజన మరియు క్రీడల శాఖ అధికారి (డివైఎస్ఓ) సానుకూలంగా స్పందిస్తూ యాక్షన్ టేకెన్ రిపోర్టును విడుదల చేశారు. కస్తూరిబా గాంధీ బాలికల విద్యాలయం (కేజీబీవీ) ఆవరణలోని బాలికల వసతి గృహ భద్రతకు భంగం కలగకుండా, యువత ఆడుకోవడానికి వీలుగా క్రీడా మైదానం వైపు ప్రహరీ గోడకు ప్రత్యేకంగా ఒక కొత్త గేటును ఏర్పాటు చేయాలని నిర్ణయించారు. దీనివల్ల క్రీడాకారులు నేరుగా మైదానంలోకి ప్రవేశించే అవకాశం ఉంటుంది. ఒకవేళ కేజీబీవీ లోపల ఇది సాధ్యం కాకపోతే, గ్రామంలోని ఇతర ప్రభుత్వ భూములను పరిశీలించి, ఈ క్రీడా ప్రాంగణాన్ని బయట ఉండే మరో స్థలంలోకి మార్చడానికి డి ఆర్ డి ఓ మరియు రెవెన్యూ అధికారులతో సమన్వయం చేసుకుంటూ తగిన చర్యలు చేపడతామని డివైఎస్ఓ స్పష్టం చేశారు. 'జనంసాక్షి' పత్రికా కథనం ద్వారా సమస్య వెలుగులోకి వచ్చి, పరిష్కారం వైపు అడుగులు పడటంపై పలిమెల మండల క్రీడాకారులు, స్థానిక యువత హర్షం వ్యక్తం చేస్తున్నారు.

# సమగ్ర ప్రణాళికతోనే గ్రామాల సుస్థిర అభివృద్ధి

- సర్పంచులు, కార్యదర్శులు సమన్వయంతో పనిచేయాలి
- హనుమకొండ జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్ పాయి



**హనుమకొండ ప్రతినిధి/ దామెర, జూలై 10 (జనంసాక్షి) :** గ్రామాల అవసరాలకు అనుగుణంగా రూపొందించే గ్రామ పంచాయతీ సమగ్ర అభివృద్ధి ప్రణాళిక ద్వారానే సుస్థిర అభివృద్ధి సాధ్యమవుతుందని హనుమకొండ జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్ పాయి అన్నారు. శుక్రవారం దామెర మండలంలోని ఏఎన్ఆర్ ఫంక్షన్ హాల్‌లో సర్పంచులు, గ్రామ పంచాయతీ కార్యదర్శులకు గ్రామ పంచాయతీ సమగ్ర ప్రణాళికపై నిర్వహించిన శిక్షణ కార్యక్రమంలో కలెక్టర్ ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. గ్రామాల అవసరాలను గుర్తించి ప్రాధాన్యతా క్రమంలో దశలవారీగా అభివృద్ధి పనులు చేపట్టాలని సూచించారు. పెండింగ్‌లో ఉన్న గ్రామ పంచాయతీ భవనాలు, అంగన్‌వాడీ కేంద్రాలు, ఇతర ప్రభుత్వ భవనాల నిర్మాణాలను త్వరితగతిన పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం కింద జాబ్ కార్డు కలిగిన ప్రతి అర్హ కుటుంబానికి 125 రోజుల ఉపాధి కల్పించేందుకు చర్యలు తీసుకోవాలని సూచించారు. గ్రామీణ కుటుంబాల ఆర్థికాభివృద్ధికి ఈ పథకం సమర్థవంతంగా ఉపయోగపడేలా కృషి చేయాలని అన్నారు. ఈ సందర్భంగా జాయింట్ కలెక్టర్ రవి మాట్లాడుతూ, ప్రత్యేక సమగ్ర సవరణ ప్రక్రియను నిర్ణీత గడువులో పూర్తి చేయడానికి బీఎల్ఓలకు సర్పంచులు, ప్రజాప్రతినిధులు పూర్తి సహకారం అందించాలని కోరారు. ఎలాంటి సందేహాలు ఉన్నా మండల తహసీల్దార్ కార్యాలయాల్లో ఏర్పాటు చేసిన హెల్ప్‌డెస్క్‌ల ద్వారా వివరాలు తెలుసుకుని ప్రక్రియను సకాలంలో పూర్తి చేయాలని సూచించారు. పార్టీలకు అతీతంగా అందరూ సహకరించి ఎస్ఐఆర్‌ను విజయవంతం చేయాలని ఆయన పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో జిల్లా పరిషత్ సీఈఓ శేషాద్రి జిల్లా పంచాయతీ అధికారి లక్ష్మీనమాకాంత్. తాహసిల్దార్ జ్యోతి వరలక్ష్మి దేవి. కల్పన తదితరులు పాల్గొన్నారు

**ఎస్ఐఆర్ డిజిటలైజేషన్ ప్రక్రియను పరిశీలించిన కలెక్టర్**

ప్రత్యేక సమగ్ర ఓటర్ల జాబితా సవరణ కార్యక్రమంలో భాగంగా చేపడుతున్న డిజిటలైజేషన్ లో వేగం పెంచి నిర్ణీత గడువులోగా పూర్తి చేయాలని హనుమకొండ జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్ పాయి బూత్ లెవల్ అధికారులను ఆదేశించారు. మండలంలోని ఊరుకొండ గ్రామపంచాయతీలో ఎస్ఐఆర్ డిజిటలైజేషన్ ప్రక్రియను కలెక్టర్ చాహత్ బాజ్ పాయి క్షేత్రస్థాయిలో పరిశీలించారు. బీఎల్ఓలు మొబైల్ ఫోన్ ద్వారా ఓటర్ల వివరాల మ్యాపింగ్, డిజిటలైజేషన్, దరఖాస్తుల నమోదు ప్రక్రియను ఎలా నిర్వహిస్తున్నారో స్వయంగా పరిశీలించి పలు సూచనలు చేశారు.



# గడువులోగా ఎస్ఐఆర్ డిజిటలీకరణ పూర్తి చేయాలి

- కలెక్టర్ భవేశ్ మిశ్రా

**నిర్మల్ బ్యూరో, జూలై 10 (జనంసాక్షి):** జిల్లాలో ఎస్ఐఆర్ డిజిటలీకరణ ప్రక్రియను నిర్దేశిత గడువులోగా పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ భవేశ్ మిశ్రా అధికారులను ఆదేశించారు. శుక్రవారం లోకేశ్వరం, నర్సాపూర్(జి), నిర్మల్ అర్బన్ మండలాల్లో కొనసాగుతున్న పనులను ఆయన పరిశీలించారు. హవర్గా గ్రామంలో ఆన్‌లైన్ నమోదు ప్రక్రియను తనిఖీ చేసి రోజువారీ లక్ష్యాల మేరకు పనులు పూర్తి చేయాలని సూచించారు. నర్సాపూర్(జి) మండలంలో ఓటర్ల వివరాలు, ఫారాల పంపిణీ, ఆన్‌లైన్ నమోదుపై అధికారులను అడిగి తెలుసుకుని ప్రక్రియను వేగవంతం చేయాలని ఆదేశించారు. నిర్మల్ పట్టణంలోని బర్కత్‌పురాలో ఓటర్లకు అధికారులు సహకారం అందించాలని, సందేహాలుంటే అధికారులను సంప్రదించాలని సూచించారు. పరిశీలనలో తహసీల్దార్లు, మున్సిపల్ కమిషనర్, ప్రజాప్రతినిధులు, ఇతర అధికారులు పాల్గొన్నారు.

# డీసీసీబీ, డీసీఎంఎస్ పీఠాలు బీసీలకే ఇవ్వాలి

- బీసీ సంక్షేమ సంఘం డిమాండ్

**నిర్మల్ బ్యూరో, జూలై 10 (జనంసాక్షి) :** 30 ఏళ్లుగా డీసీసీబీ, సహకార సంఘాల చైర్మన్ పదవుల్లో బీసీలకు తగిన ప్రాధాన్యం దక్కలేదని నిర్మల్ జిల్లా బీసీ సంక్షేమ సంఘం అధ్యక్షుడు చంద్రశేఖర్ అన్నారు. ప్రభుత్వం నామినేషన్ విధానంలో నియామకాలు చేపట్టనున్న నేపథ్యంలో ఉమ్మడి జిల్లా డీసీసీబీ, డీసీఎంఎస్ చైర్మన్ పదవులతో పాటు పీఏసీఎస్, ఎఫ్ఎస్‌సీఎస్ చైర్మన్ పదవులను బీసీలకే కేటాయించాలని ప్రభుత్వాన్ని కోరారు. ఈ కార్యక్రమంలో జిల్లా కో-కన్వీనర్ జింక లక్ష్మీనారాయణ, చందు పాల్గొన్నారు.

# బాధిత మహిళలకు సత్వర న్యాయం అందించాలి

- జిల్లా ఎస్పీ అఖిల్ మహాజన్
- భార్యాభర్తల వివాదాల పరిష్కారంలో సున్నితంగా వ్యవహరించాలి
- మహిళ పోలీస్ స్టేషన్‌ను ఆకస్మికంగా తనిఖీ చేసిన జిల్లా ఎస్పీ




**మావల, జూలై 11( జనం సాక్షి) :** మహిళల సమస్యల పట్ల ప్రత్యేక శ్రద్ధ వహిస్తూ బాధితులకు సత్వర న్యాయం అందించాలని ఆదిలాబాద్ జిల్లా ఎస్పీ అఖిల్ మహాజన్ అధికారులను ఆదేశించారు. శుక్రవారం ఆదిలాబాద్ పట్టణంలోని ఉమెన్ పోలీస్ స్టేషన్‌ను జిల్లా ఎస్పీ ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా పోలీస్ స్టేషన్‌లోని రికార్డులు, పెండింగ్ కేసులు, ఫిర్యాదుల పరిష్కార విధానం, పోలీస్ స్టేషన్ నిర్వహణ, పరిశుభ్రతను పరిశీలించి అధికారులకు పలు సూచనలు చేశారు. పోలీస్ స్టేషన్‌కు వచ్చే ప్రతి మహిళా ఫిర్యాదుదారితో గౌరవంగా, మర్యాదపూర్వకంగా వ్యవహరించాలని, వారి సమస్యలను పూర్తిగా తెలుసుకుని వెంటనే స్పందించి అవసరమైన చట్టపరమైన చర్యలు చేపట్టాలని సూచించారు. ముఖ్యంగా భార్యాభర్తల మధ్య తలెత్తే కుటుంబ వివాదాల విషయంలో అత్యంత సున్నితంగా వ్యవహరిస్తూ బాధితులకు న్యాయం జరిగేలా కౌన్సెలింగ్, చట్టపరమైన చర్యలను సమన్వయంతో చేపట్టాలని తెలిపారు. మహిళల రక్షణ, భద్రతకు ఉమెన్ పోలీస్ స్టేషన్ కీలకమని పేర్కొంటూ, ప్రతి ఫిర్యాదును ప్రాధాన్యతగా తీసుకుని బాధితుల్లో విశ్వాసం కల్పించే విధంగా పనిచేయాలని సూచించారు. పోలీస్ స్టేషన్ రికార్డులను ఎప్పటికప్పుడు నవీకరిస్తూ ఎలాంటి పెండింగ్ లేకుండా చూడాలని, కేసుల దర్యాప్తును నాణ్యత ప్రమాణాలతో వేగవంతంగా పూర్తి చేసి బాధితులకు సత్వర న్యాయం జరిగేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో ఆదిలాబాద్ డీఎస్పీ ఎల్. జీవన్ రెడ్డి, ఉమెన్ పోలీస్ స్టేషన్ ఇన్‌స్పెక్టర్ కె ఫణిదర్, ఏఎస్ఐలు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# విద్యకు ప్రభుత్వం పెద్దపీట

**ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు**



**చిట్యాల, జులై 10 (జనంసాక్షి) :** విద్యా వ్యవస్థను బలోపేతం చేసేందుకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పకడ్బందీ వ్యూహంతో ముందుకు వెళ్తున్నారని ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలోని వివిధ గ్రామాలలో పలు అభివృద్ధి పనులను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ మండలంలోని చల్లగరిగె గ్రామంలో రూ,, 10 కోట్లతో తెలంగాణ పబ్లిక్ స్కూల్ ఏర్పాటు చేస్తామని, ఈ ప్రాంత రోడ్లను కూడా పూర్తి స్థాయిలో అభివృద్ధి చేస్తామని అన్నారు. తెలంగాణలో అభివృద్ధి, సంక్షేమ పథకాలు వేగంగా అమలవుతు న్నాయని అన్నారు. ముఖ్యంగా విద్యా వ్యవస్థను బలోపేతం చేసేందుకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పకడ్బందీ వ్యూహంతో ముందుకు వెళు న్నారని చెప్పారు. ఇందులో భాగంగా నియోజకవర్గానికి ఒకటి తెలంగాణ పబ్లిక్ స్కూల్ ఏర్పాటు చేయడం జరుగుతుందన్నారు. భూపాలపల్లి నియోజకవర్గంలో చల్లగరిగ గ్రామాన్ని ఎంపిక చేసినట్లు తెలిపారు. స్థానిక ప్రభుత్వ హైస్కూల్ లో రూ.10కోట్లతో ముందుగా తెలంగాణ పబ్లిక్ స్కూల్ ఏర్పాటు చేసి తరువాత మరిన్ని నిధులు మంజూరు చేయడం జరుగుతుందని వివరించారు. భూపాలపల్లి నియోజకవర్గం లో ఇంటిగ్రేటెడ్ స్కూల్ కోసం రూ.200 కోట్లతో గాంధీనగర్ గ్రామంలో నిర్వహించబోతున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో చల్లగరిగే సర్పంచ్ సిరిపెల్లి జంపయ్య, నైన్ పాక సర్పంచ్ నక్క భాస్కర్,కాంగ్రెస్ పార్టీ నాయకులు పులి తిరుపతి రెడ్డి, గూట్ల తిరుపతి, ముకిరాల మధువంశికృష్ణ, కట్కూరి నరేందర్, బుర్ర శ్రీనివాస్, నల్ల రాజిరెడ్డి, ఆకుల సుధాకర్, దూదిపాల బుచ్చిరెడ్డి, మేరుగు సంపత్ కుమార్, ఎంపీడీఓ, తహశీల్దార్, స్థానిక వార్డు సభ్యులు, పంచాయితీ కార్యదర్శి మహేష్, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# ఇంటి పన్నుల వసూళ్లలో గోల్‌మాల్

- విచారణ చేసి తగిన చర్యలు తీసుకోవాలి
- గ్రామస్తుల డిమాండ్



**చెన్నారావుపేట, జూలై 10 (జనం సాక్షి) :** చెన్నారావుపేట గ్రామపంచాయతీలో ఇంటి పన్నుల వసూళ్లలో గోల్ మాల్ జరిగిందని గ్రామ ప్రముకులు సాదు మధుసూదన్ రెడ్డి, నన్నెబోయిన రమేష్, గట్ల కృష్ణయ్య, సిపిఐ మండల కార్యదర్శి పత్తి అనంత రెడ్డిలు ఆరోపించారు. చెన్నారావుపేట గ్రామ పంచాయతీలో పనిచేస్తున్న గ్రామ కారోబార్ కుసుమ సురేష్ ప్రభుత్వం నిర్ధారణ చేసిన ఇంటి పన్నుల కంటే రెట్టింపు ఇంటి పన్నులను వసూలు చేస్తున్నాడన్నారు. కారోబార్ ఇచ్చిన ఇంటి పన్ను రశీదులు ఆన్ లైన్ లో పరిశీలించగా అదనంగా వసూలు చేస్తున్నట్లు నిర్ధారణ అయిందన్నారు. ఇంటి పన్నుల రశీదులు కొన్ని జమ చేసి గ్రామ పంచాయతిలో ఉండే ఇంటి పన్నుల ఆన్ లైన్ బుక్ ను వెళ్లి పరిశీలించగా రెట్టింపు వసూలు చేసినట్లు తేలిందన్నారు. ఇంటి పన్నుల అదనపు వసూళ్ల విషయం పై గ్రామపంచాయతీ కార్యాలయంలో గ్రామపంచాయతీ కార్యదర్శి సుప్రజకు శుక్రవారం విషయం తెలుపగా పరిశీలించి గ్రామ ఇంటి పన్నుల వసూళ్ల విషయంలో పొరపాటు జరిగిందని ఇకపై ఆన్ లైన్ లో ఉన్నట్లుగా ఇంటి పన్నులు తీసుకుంటామని తెలిపినట్లు వారు పేర్కొన్నారు. ఇంటి పన్నులు ఆన్ లైన్ లో ఉన్నట్లు కాకుండా ఇష్టం వచ్చినట్లు వసూలు చేశారని ఈ విధానము ఎన్ని సంవత్సరాల నుండి జరుగుతుందని వారు ప్రశ్నించారు. జిల్లా పంచాయతీ ఉన్నతాధికారులు ఇంటి పన్నుల డబ్బుల గోల్ మాల్ పై పూర్తిస్థాయిలో విచారణ చేసి బయటపెట్టాలని కోరారు. ఇంటి పన్నులు గ్రామంలో తిరిగి వసూలు చేయకుండా గ్రామపంచాయతీలో ఏ కాగితం కావాలన్నా అదనంగా ఇంటి పన్నులు వసూలు చేస్తున్నారని ఆరోపించారు. అధిక ఇంటి పన్నుల వసూలు విషయంలో కారోబార్ కుసుమ సురేష్ అలాగే ఇందులో ఏ అధికారికి సంబంధం ఉన్నా పూర్తిస్థాయిలో విచారణ చేసి చర్యలు తీసుకోవాలని అంతేకాకుండా అదనంగా చెల్లించిన ఇంటి పన్ను డబ్బులను వెంటనే తిరిగి చెల్లించాలన్నారు. గ్రామ ప్రజలు ఇంటీ పన్నులు కట్టే ముందు గ్రామ పంచాయతీలో ఉన్న ఆన్ లైన్ బుక్ లో చూసుకొని చెల్లించుకోవాలని వారు కోరారు.

# గంజాయి కేసులో నేరస్తులకు 10 ఏళ్ల కఠిన కారాగార శిక్ష

- లక్ష రూపాయల జరిమానా
- దర్యాప్తు అధికారులను కోర్టు సిబ్బందిని అభినందించిన జిల్లా ఎస్పీ



**ములుగు ప్రతినిధి, జూలై10 (జనంసాక్షి) :** ములుగు జిల్లా న్యాయస్థానంలో ములుగు స్టేషన్ కు సంబంధించిన గంజాయి కేసులో కీలకతీర్పు వెలువడింది. 2020లో ములుగు పోలీస్ స్టేషన్ పరిధిలో నమోదైన క్రైమ్ నెంబర్ 180/2020 కేసులో జిల్లా జడ్జి ఎస్.వి.పి. సూర్య చంద్రకళ ముగ్గురు నిందితులకు 10 సంవత్సరాల కఠిన కారాగార శిక్ష తో పాటు లక్ష రూపాయల జరిమానా విధించారు. కేసు వివరాలు క్రైమ్ నెంబర్ 180/2020, సెక్షన్ నెంబర్ 39/2022, అండర్/సెక్షన్ 8(సి) 20(బి)ఎన్డిపిఎస్ యాక్ట్ ములుగు స్టేషన్ ప్రకారం నేరస్థుల వివరాలు కేసులో ఎ1 గా చెక్క కుమారస్వామి తండ్రి కొమ్మలు, వయసు 35 సం.లు,కులం ముదిరాజ్ వృత్తి డ్రైవర్ నివాసం పందికుంట గ్రామం ములుగు మండలం, ఎ2 గా రాయనేని శంకర్ తండ్రి మల్లయ్య వయస్సు 48 సం.లు, కులం ఎరుక వృత్తి బిజినెస్ నివాసం గోరుకొత్తపల్లి గ్రామం రేగొండ మండలం జయశంకర్ భూపాలపల్లి జిల్లా,ఎ3 గా రాగుల పోషకాలు ఐలయ్య వయసు 60 సం.రాలు కులం ముదిరాజ్ వృత్తి కూలి నివాసం పందికుంట గ్రామం ములుగు మండలం,ఈ ముగ్గురు నిందితులకు 10 సంవత్సరాల కఠిన కారాగార శిక్ష మరియు లక్ష రూపాయల జరిమానా ను విధించారు. విచారణలో దర్యాప్తు అధికారి గా ఉన్న సీఐ దేవేందర్ రెడ్డి (ప్రస్తుతం డీఎస్పీగా వరంగల్ పనిచేస్తున్నారు) నీ, కోర్టు మానిటరింగ్ అధికారి డిఎస్పి కిషోర్ కుమార్, కేసు వాయిదాలను సమర్థవంతంగా నడిపిన స్పెషల్ పీపీ రామ్ సింగ్, ప్రస్తుత సీఐ సురేష్, కోర్టు కానిస్టేబుల్ స్రవంతి లను జిల్లా ఎస్పీ సుధీర్ రామ్నాథ్ కేకాన్ ప్రత్యేకంగా అభినందించారు. జిల్లా ఎస్పీ మాట్లాడుతూ ములుగు జిల్లాలో ఎవరైనా అక్రమంగా గంజాయి రవాణా చేస్తున్నట్లు తెలిస్తే వారి వివరాలను వెంటనే ములుగు జిల్లా పోలీస్ వారికి సమాచారం అందించాలని,ఇట్టి సమాచారం అందించిన వారికి నగదు బహుమతి ఇవ్వడంతో పాటు వారి వివరాలు గోప్యంగా ఉంచబడతాయని జిల్లా ఎస్పీ తెలియజేశారు.

# కలెక్టర్‌కు నివేదిక సమర్పించిన పీవో

- జనం సాక్షి కథనానికి స్పందన


ఆగని అక్రమ వసూళ్లు అధికారుల మౌనం
జనంసాక్షి
09 Jul 2026 - Page 7
https://epaper.janamsakshi.org/clip/512236

**కాళేశ్వరం , జూలై 10 (జనంసాక్షి) :** జూలై 9న జనంసాక్షి దినపత్రి కలో ఆగని అక్రమ వసూళ్లు అధికారుల మౌనం పేరిట వార్త ప్రచురితం కాగా దీనికి సంబంధించి తెలంగాణ రాష్ట్ర మినరల్ డెవలప్మెంట్ కార్పొరేషన్ భూపాలపల్లి జిల్లా ప్రాజెక్ట్ ఆఫీసర్ పి రామకృష్ణ జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మకు ఒక నివేదిక సమర్పించారు. ఆ నివేదిక ప్రకారం కన్నెపల్లి ఇసుక లోడింగ్ పాయింట్ వద్ద అక్రమంగా డబ్బు వసూలు చేశారన్న ఆరోపణ పూర్తిగా అవాస్తవమని టిజిఎండిసి లిమిటెడ్ వారు ఇసుక బుకింగ్, చెల్లింపు, లోడింగ్, రవాణా కోసం పారదర్శ కమైన ఆన్‌లైన్ వ్యవస్థను అనుసరి స్తున్నారని తెలిపారు. వినియోగదా రులు అధికారిక ఆన్‌లైన్ పోర్టల్ ద్వారా మాత్రమే ఇసుకను బుక్ చేసుకోవచ్చు అని ఆన్‌లైన్ పద్ధతిలో చెల్లింపు చేయవచ్చు మరియు చెల్లుబాటు అయ్యే బుకింగ్ రసీదును పొందవచ్చని తెలిపారు. అన్ని ఇసుక స్టాక్‌యార్డులను సాండ్ రీచ్ అసిస్టెంట్లు, సెక్యూరిటీ గార్డులు పర్యవేక్షిస్తారని లోడింగ్, డిస్పాచ్ కార్యకలాపాలను పర్యవేక్షించడానికి సిసిటివి కెమెరాలు, వెయిబ్రిడ్జ్‌లు మరియు సెంట్రల్ మానిటరింగ్ సిస్టమ్ పనిచేస్తున్నాయి అని తెలిపారు. అన్ని రికార్డులు ఆన్‌లైన్ లో నిర్వహించబడతాయి మరియు క్రమం తప్పకుండా ధృవీక రించబడతాయని ఏ స్టాక్‌యార్డ్‌లోనూ చేతితో డబ్బు వసూలు చేయడం జరగదు, అన్ని చెల్లింపులు అధికారిక ఆన్‌లైన్ వ్యవస్థ ద్వారా మాత్రమే స్వీకరించబడతాయి అని తెలిపారు. ఎక్కడైనా డబ్బులు వసూలు చేసినట్లుగా తెలిస్తే తనకు తెలుప వలసిందిగా ఆయన కోరారు.




## ఎస్‌బీఐ ఫండ్స్ ఐపీవోకు అప్లయ్ చేస్తున్నారా?..

### అయితే ఇవి తప్పనిసరి



**న్యూఢిల్లీ:** స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఎస్‌బీఐ) అనుబంధ ఎస్‌బీఐ ఫండ్స్ మేనేజ్‌మెం ట్ లిమిటెడ్ పబ్లిక్ ఇష్యూకు రానుంది. ఎస్‌బీఐ అనుబంధ సంస్థగా 1992లో స్థాపితమైన ఈ సంస్థ.. దేశంలో అతిపెద్ద అసెట్ మేనేజ్‌మెంట్ కంపెనీగా కొనసాగుతోంది. జులై 14 నుంచి ప్రారంభం కానున్న ఐపీఓ గురించి 10 కీలక పాయింట్లు..ఎస్‌బీఐ మ్యూచువల్ ఫండ్ పేరిట దేశంలోనే అతిపెద్ద అసెట్ మేనేజ్‌మెంట్ కంపెనీని ఎస్‌బీఐ ఫండ్స్ మేనేజ్‌మెంట్ లిమిటెడ్ నిర్వహిస్తోంది. 15.5 శాతం మార్కెట్ వాటా ఉంది. వివిధ పథకాల కింద సుమారు రూ.12 లక్షల కోట్లకు పైగా ఆస్తులను నిర్వహిస్తోంది. పబ్లిక్ ఇష్యూ ద్వారా మార్కెట్ నుంచి రూ.11,693 కోట్లు సమీకరించనుంది. జులై 14న సబ్‌స్క్రిప్షన్ ప్రారంభమై 16న ముగుస్తుంది. ఐపీఓ ధరల శ్రేణిని రూ.545–574గా ప్రకటించింది. సుమారు రూ.1.17 లక్షల కోట్ల మార్కెట్ విలువతో ఐపీఓకు వస్తోంది. జులై 21న లిస్టింగ్‌కు రానుంది.పూర్తి ఆఫర్ ఫర్ సేల్ రూపంలో ఈ పబ్లిక్ ఇష్యూ జరగనుంది. కంపెనీకి ఎలాంటి నిధులూ రావు. మొత్తం 12 కోట్ల ఈక్విటీ షేర్లను విక్రయానికి ఉంచనున్నారు. ఎస్‌బీఐ, అముండీ ఇండియా హోల్డింగ్ ఐపీఓలో భాగంగా తమ వాటాలు విక్రయిస్తున్నాయి. రిటైల్ ఇన్వెస్టర్లకు 35 శాతం, స్మాల్ హెచ్‌ఎన్‌ఐలకు 5 శాతం, బిగ్ హెచ్‌ఎన్‌ఐలకు 10 శాతం, 50 శాతం క్వాలిఫైడ్ ఇన్‌స్టిట్యూషనల్ బిడ్డర్లకు రిజర్వ్ చేశారు. రిటైల్ ఇన్వెస్టర్లు ఈ ఐపీఓలో పాల్గొనాలంటే కనీసం 26 షేర్లు (లాట్) కొనుగోలు చేయాల్సి ఉంటుంది. గరిష్ఠ ప్రైస్ బ్యాండ్ వద్ద రూ.14,924 పెట్టుబడి పెట్టాల్సి ఉంటుంది. గరిష్ఠంగా 13 లాట్‌లు కొనుగోలు చేయొచ్చు. ఎస్‌బీఐ వాటాదారులకు రూ.750 కోట్ల విలువైన 1.3 కోట్ల షేర్లను రిజర్వ్ చేశారు. షేర్ హోల్డర్ కేటగిరీలో రూ.2 లక్షల వరకు బిడ్లు దాఖలు చేయొచ్చు. డిస్కౌంట్ లభించదు. ఎస్‌బీఐ ఉద్యోగులకు రూ.170 కోట్ల విలువైన ఈక్విటీ షేర్లను రిజర్వ్ చేశారు. ఒక్కో షేరుపై రూ.54 డిస్కౌంట్ లభిస్తుంది. ప్రీ ఐపీఓ ప్లేస్‌మెంట్ కింద ఎస్‌బీఐ.. ఫండ్స్ మేనేజ్‌మెంట్‌లో ఉన్న వాటాలో 1.42 శాతం వాటాను అమ్మేసింది. దీని ద్వారా రూ.1655 కోట్ల మేర నిధుల్ని సమీకరించింది. ఐసీఐసీఐ ప్రుడెన్షియల్ ఏఎంసీ, హెచ్‌డీఎఫ్‌సీ ఏఎంసీ, యూటీఐ ఏఎంసీ, ఆదిత్య బిర్లా సన్‌లైఫ్ ఏఎంసీ, శ్రీరామ్ ఏఎంసీ, నిప్పాన్ లైఫ్ ఇండియా అసెట్ మేనేజ్‌మెంట్ సంస్థలు ఇప్పటికే స్టాక్ మార్కెట్‌లో లిస్టయ్యాయి. వాటి సరసన ఎస్‌బీఐ ఫండ్స్ చేరనుంది.షేర్ మార్కెట్‌లో హెచ్చుతగ్గులు; మ్యూచువల్ ఫండ్స్ ఫీజులు, కమిషన్ల విషయంలో సెబీ ఎప్పటికప్పుడు తీసుకొచ్చే కఠిన నిబంధనలు, ఇప్పటికే ఉన్న కంపెనీలతో పాటు మరిన్ని డిజిటల్ కంపెనీలు అసెట్ మేనేజ్‌మెంట్‌లోకి ప్రవేశిస్తుండడంతో ఆ మేర లాభాల మార్జిన్ తగ్గే అవకాశం ఉంది.గ్రే మార్కెట్‌లో 22 శాతం ప్రీమియంతో ఎస్‌బీఐ ఫండ్స్ మేనేజ్‌మెంట్ షేర్లు ట్రేడవుతున్నాయి. ఆ లెక్కన రూ.701 వద్ద షేర్లు లిస్టయ్యే అవకాశం ఉంది.

# భారీ లాభాల్లో సూచీలు

### 24,200 పైకి నిఫ్టీ

**ముంబయి:** దేశీయ స్టాక్ మార్కెట్ సూచీలు భారీ లాభా ల్లో ముగిశాయి. అంతర్జాతీయ మార్కెట్‌ల నుంచి సానుకూల సంకేతాలకు తోడు ఐటీ, పీఎస్‌యూ బ్యాంక్, రియాల్టీ స్టాక్స్‌లో కొనుగోళ్ల మద్దతుతో సూచీలు వరుసగా రెండో రోజూ రాణించాయి. దీంతో బీఎస్‌ఈలో నమోదిత కంపెనీల మొత్తం మార్కెట్ విలువ ఒక్కరోజే దాదాపు రూ.6 లక్షల కోట్లు పెరిగి రూ.482 లక్షల కోట్లకు చేరింది.సెన్సెక్స్ ఉదయం 77,395.63 పాయింట్ల వద్ద (క్రితం ముగింపు 76,741.82) లాభాల్లో ప్రారంభమైంది. రోజంతా లాభాల్లోనే కదలాడింది. ఇంట్రాడేలో 77,642.23 పాయింట్ల వద్ద గరిష్ఠాన్ని తాకిన సూచీ.. చివరికి 827.57 పాయింట్ల లాభంతో 77,569.39 వద్ద ముగిసింది. నిఫ్టీ 244.10 పాయింట్ల లాభంతో 24,206.90 వద్ద స్థిరపడింది. డాలరుతో రూపాయి మారకం విలువ 95.31గా ఉంది.సెన్సెక్స్ 30 సూచీలో రిలయన్స్, టెక్ మహీంద్రా, బీఈఎల్,



యాక్సిస్ బ్యాంక్, టాటా స్టీల్ షేర్లు లాభపడ్డాయి. ఎటర్నల్, భారతీ ఎయిర్‌టెల్, సన్‌ఫార్మా, ట్రెంట్, ఐటీసీ షేర్లు నష్టపోయాయి. అంతర్జాతీయ విపణిలో బ్రెంట్ క్రూడ్ బ్యారెల్ ధర 76.17 డాలర్లుగా ఉంది. బంగారం ఔన్సు 4,108 డాలర్ల వద్ద కొనసాగుతోంది. షాంఘై మినహా ఆసియా మార్కెట్లు లాభాల్లో ముగియగా.. యూరోపియన్ మార్కెట్లు లాభాల్లో ట్రేడింగ్‌ను ఆరంభించాయి.

## కువైట్‌లో జులై 19 వరకు పాస్‌పోర్ట్, వీసా సేవలు నిలిపివేత

**న్యూఢిల్లీ:** కువైట్‌లో భారత ఎంబసీ కీలక అప్‌డేట్ ఇచ్చింది. జులై 19 వరకు భారతీయుల సాధారణ పాస్‌పోర్ట్, వీసా సేవలను తాత్కాలికంగా నిలిపివేస్తున్నట్లు ప్రకటించింది. పాలనాపరమైన కారణాల వల్ల ఈ నిర్ణయం తీసుకున్నామని, కేవలం అత్యవసర కేసుల్లో మాత్రమే సేవలు అందుబాటులో ఉంటాయని తెలిపింది. ఇందుకోసం ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 12 గంటల మధ్య కాన్సులర్ విభాగాన్ని సంప్రదించాలని పేర్కొంటూ కువైట్‌లోని భారత ఎంబసీ ఓ ప్రకటన విడుదల చేసింది.ఈ సమయంలో తత్కాల్ పాస్‌పోర్ట్ జారీ, ఎన్‌ఆర్‌ఐ సర్టిఫికెట్లు, ఈ–వీసాలు, సివిల్ ఐడీ గడువు ముగుస్తున్న వారికి స్వల్పకాలిక పాస్‌పోర్ట్ దరఖాస్తులను మాత్రమే స్వీకరిస్తామని పేర్కొంది. తాత్కాలిక ఆంక్షలు ఎత్తివేసే వరకు సాధారణ పాస్‌పోర్ట్, వీసా సేవల దరఖాస్తుల స్వీకరణ, పరిశీలన ఉండదని స్పష్టం చేసింది. తదుపరి ప్రకటన వచ్చేవరకు కువైట్‌లోని అన్ని ఇండియన్ కాన్సులర్ అప్లికేషన్ సెంటర్లు కూడా మూసివేసే ఉంటాయని తెలిపింది.ఇదిలాఉంటే, ఇటీవల యూఏఈలోనూ కొన్ని రోజులపాటు భారత్ పాస్‌పోర్ట్, వీసా, ఇతర సర్వీసులు తాత్కాలికంగా నిలిచిపోగా.. కొత్త సర్వీస్ ప్రొవైడర్‌కు కాన్సులర్ సేవలు మారినందునే ఆ అంతరాయం ఏర్పడినట్లు సమాచారం.





## జెరోదా వర్సెస్ గ్రో.. నితిన్ కామత్ పోస్ట్‌తో 'ఎక్స్' వార్

ఆన్‌లైన్ పెట్టుబడి సంస్థల్లో ట్రేడింగ్ ఛార్జీల విధానాల విషయంలో.. దేశంలోని రెండు ప్రధాన బ్రోకరేజీ ప్లాట్‌ఫామ్‌ల మధ్య బహిరంగ వాగ్వాదం నెలకొంది. ఈ అంశంపై జెరోదా సీఈఓ నితిన్ కామత్ 'ఎక్స్'లో స్పందిస్తూ.. 'గ్రో'పై పరోక్ష విమర్శలు గుప్పించారు. దీంతో 'గ్రో కూడా దీటుగా బదులిచ్చింది. ఇంతకీ వివాదం ఏంటంటే..?మ్యూచువల్ ఫండ్స్ ట్రేడింగ్ విధానాలపై నితిన్ కామత్ స్పందిస్తూ.. "2010లో మేం డిస్కౌంట్ బ్రోకరేజీని ప్రారంభించినప్పుడే.. ఇన్వెస్టర్ల పెట్టుబడి మొత్తం చిన్నదా.. పెద్దదా అనే సంబంధం లేకుండా స్థిరమైన ఫీజులు వసూలు చేయాలని నిర్ణయించుకున్నాం. ఒక లావాదేవీని పూర్తి చేయడానికి మేం చేసే పని ఒకేలా ఉన్నప్పుడు.. కస్టమర్లు ఎందుకు విభిన్న రుసుములు చెల్లించాలనేదే మా ఉద్దేశం. కస్టమర్లు పెద్దమొత్తాల్లో పెట్టుబడి పెట్టినంత మాత్రాన.. ట్రేడింగ్ విధానంలో ఎలాంటి అదనపు శ్రమ ఉండదు. ఇదే లాజిక్‌ను మేం మ్యూచువల్ ఫండ్స్‌కు కూడా అమలు చేస్తున్నాం. అందుకోసమే ప్రత్యేకంగా కాయిన్ ప్లాట్‌ఫామ్‌ను అందుబాటులోకి తీసుకొచ్చాం. లావాదేవీలపై పర్సంటేజీ విధానంతో ఫీజులు వసూలు చేస్తున్నప్పుడు దాన్ని డిస్కౌంట్ బ్రోకరేజీ అని అనరు. ఇక, మాతో పాటే మ్యూచువల్ ఫండ్ ప్లాట్‌ఫామ్స్‌ను ప్రారంభించిన కంపెనీలు ఇప్పుడు కన్పించకుండా పోయాయి. లేదా కొత్త రంగాన్ని ఎంచుకున్నాయి. ఇంకొన్ని కంపెనీలు కస్టమర్లను ఆకట్టుకునేందుకు కొత్త కొత్త ఆఫర్లు ప్రకటిస్తున్నాయి" అని నితిన్ కామత్ రాసుకొచ్చారు.ఇందులో ఎక్కడా ఆయన 'గ్రో' పేరును నేరుగా ప్రస్తావించలేదు. అయితే, ఇటీవల ఈ కంపెనీ మ్యూచువల్ ఫండ్స్ కోసం 'ప్రైమ్' సేవలను తీసుకురావడంతో నితిన్ కామత్ దాన్నుద్దేశించే పోస్ట్ చేశారని నెటిజన్లు చర్చించుకున్నారు. ఈ క్రమంలోనే 'గ్రో' స్పందిస్తూ కామత్‌కు కౌంటర్ ఇచ్చింది. "మా ఆఫర్లపై తప్పుడు సమాచార వ్యాప్తి జరుగుతోంది. 'ప్రైమ్' అనేది ఇన్వెస్టర్ల కోసం మా కంపెనీ తీసుకొచ్చిన అధునాతన ఫీచర్ మాత్రమే. ఏవి కొనాలి, ఏవి అమ్మాలి అనే దానిపై ఇన్వెస్టర్లకు గైడెన్స్ ఇచ్చే వేదిక.

## ఆల్కహాల్ కలిసిన మందులకూ చీటీ తప్పనిసరి

**దిల్లీ:** ఆల్కహాల్ కలిగిన ఔషధాల విక్రయానికి సంబంధించిన నిబంధనలను కేంద్ర ప్రభుత్వం కఠినతరం చేసింది. 12 శాతం కంటే ఎక్కువ ఇథైల్ ఆల్కహాల్ కలిగిన ఔషధాలను లైసెన్స్ లేకుండా విక్రయించడానికి వీల్లేదని స్పష్టంచేసింది. డాక్టర్ ప్రిస్క్రిప్షన్ ఉంటేనే ఈ మందులను విక్రయించాలని పేర్కొంది. 12 శాతం కంటే ఎక్కువ ఇథైల్ ఆల్కహాల్ కలిగి 30 మిల్లీలీటర్ల కంటే పెద్ద సీసాల్లో విక్రయించే సిరప్‌లు/టానిక్‌లను షెడ్యూల్ ఈ1 పరిధిలోకి తీసుకొస్తూ గెజిట్ నోటిఫికేషన్ జారీ చేసింది.కొన్ని రకాల దగ్గు సిరప్‌లు, టానిక్‌లలో ఆల్కహాల్ శాతం ఎక్కువగా ఉంటోంది. దీంతో వాటిని చికిత్స కోసం కాకుండా మత్తు కోసం దుర్వినియోగం చేస్తున్నారంటూ పలు రాష్ట్రాల నుంచి ఆందోళన వ్యక్తమైంది. ఈ నేపథ్యంలో డ్రగ్స్ టెక్నికల్ అడ్వైజరీ బోర్డ్ , డ్రగ్స్ కన్సల్టేటివ్ కమిటీ సిఫార్సుల మేరకు ప్రభుత్వం ఈ చర్యలు చేపట్టింది. దీనివల్ల అవసరమైన రోగులకు ఈ ఔషధాలు ఎప్పటిలాగే అందుబాటులో ఉంటాయి.






## సముద్రపు ఉప్పునీటితో విద్యుత్ ఉత్పత్తిలో జపాన్

# సరికొత్త అధ్యాయం

**ఫుకుయోకా, జూలై 10 (జనంసాక్షి):** పునరుత్పాదక ఇంధన రంగంలో జపాన్ మరో కీలక ముందడుగు వేసింది. ఫుకుయోకా నగరంలో దేశంలోనే తొలి ఒస్మోటిక్ పవర్ ప్లాంట్‌ను ప్రారంభించి, సముద్రపు ఉప్పునీటితో విద్యుత్ ఉత్పత్తికి శ్రీకారం చుట్టింది. సముద్రపు ఉప్పునీరు, శుద్ధి చేసిన మంచినీటి మధ్య ఉండే ఉప్పుదనం తేడాను వినియోగించి విద్యుత్ ఉత్పత్తి చేసే ఈ సాంకేతికత ప్రపంచవ్యాప్తంగా ఆసక్తిని రేకెత్తిస్తోంది. ఈ ప్లాంట్‌లో ప్రెజర్–రిటార్డెడ్ ఒస్మోసిస్ సాంకేతికతను వినియోగిస్తున్నారు. డీశాలినేషన్ ప్లాంట్ నుంచి వచ్చే అధిక ఉప్పుదనం కలిగిన నీరు, మురుగునీటి శుద్ధి కేంద్రం నుంచి వచ్చే శుద్ధి చేసిన నీటిని ప్రత్యేక మెంబ్రేన్ ద్వారా ప్రవహింపజేస్తారు. ఈ ప్రక్రియలో ఏర్పడే ఒత్తిడితో టర్బైన్లు తిరిగి విద్యుత్ ఉత్పత్తి చేస్తాయి.ఈ కేంద్రం ద్వారా ఏడాదికి సుమారు 8.8 లక్షల కిలోవాట్–గంటల విద్యుత్ ఉత్పత్తి చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నారు. ఇది సుమారు 220 గృహాల వార్షిక విద్యుత్ అవసరాలను తీర్చగల సామర్థ్యాన్ని కలిగి ఉంది.సౌర, పవన విద్యుత్‌ల మాదిరిగా వాతావరణ పరిస్థితులపై ఆధారపడకుండా, దాదాపు 90 శాతం సామర్థ్యంతో నిరంతరాయంగా విద్యుత్ ఉత్పత్తి



చేయగలగడం ఈ సాంకేతికత ప్రధాన ప్రత్యేకతగా నిపుణులు పేర్కొంటున్నారు. విద్యుత్ ఉత్పత్తిలో స్థిరత్వాన్ని అందించే ఈ విధానం భవిష్యత్తులో తీరప్రాంత నగరాలకు ఎంతో ఉపయోగపడే అవకాశముందని వారు అభిప్రాయపడుతున్నారు.కార్బన్ ఉద్గారాలను తగ్గిస్తూ ప్రత్యామ్నాయ ఇంధన వనరులను విస్తరించే దిశగా జపాన్ చేపట్టిన ఈ ప్రయోగం విజయవంతమైతే, ప్రపంచవ్యాప్తంగా సముద్ర తీర ప్రాంతాల్లో ఇలాంటి ఒస్మోటిక్ పవర్ ప్లాంట్ల ఏర్పాటుకు మార్గం సుగమం కానుందని నిపుణులు భావిస్తున్నారు.

## ఒకరి కంటే ఎక్కువ మందిని పెళ్లాడితే.. ఉద్యోగం నుంచి తొలగిస్తాం!

– అస్సాం సీఎం హిమంత బిశ్వశర్మ హెచ్చరిక

**గువాహటి(జనంసాక్షి):** బహుభార్యత్వం నిషేధం దిశగా కీలక చర్యలు చేపడుతోన్న అస్సాం ప్రభుత్వం.. తాజాగా మరో నిర్ణయం తీసుకుంది. ఒకరి కంటే ఎక్కువ మందిని పెళ్లి చేసుకునేవారికి ప్రభుత్వ సంక్షేమ పథకాలు రావని ప్రకటించింది. అలాంటి వారిని ప్రభుత్వ విధుల నుంచి తొలగిస్తామని వెల్లడించింది. ఈ మేరకు అస్సాం ప్రభుత్వం బడ్జెట్‌లో ఈ కీలక ప్రతిపాదనలు చేసింది. 2026–27 ఆర్థిక సంవత్సరానికి గానూ పూర్తిస్థాయి బడ్జెట్‌ను అస్సాం అసెంబ్లీలో శుక్రవారం ప్రవేశపెట్టారు. ఈ సందర్భంగా ఆర్థిక మంత్రి జయంత మల్లా బారువా మాట్లాడుతూ.. "మహిళా సాధికారత, లింగ సమానత్వాన్ని ప్రోత్సహించే దిశగా కీలక చర్యలు చేపట్టాం. బహుభార్యత్వాన్ని పాటించే వారు ప్రభుత్వ విధుల్లో ఏ స్థాయిలో ఉన్నా.. వారిని ఉద్యోగాల నుంచి తొలగిస్తాం. ఎక్కువ మందిని వివాహం చేసుకునే వారు ప్రభుత్వ సంక్షేమ పథకాలు పొందేందుకు కూడా అనర్హులే. అంతేకాదు.. ఏ క్రిమినల్ చట్టం కిందనైనా దోషిగా తేలిన వ్యక్తికీ సంక్షేమ పథకాలు అందించబోమని బడ్జెట్‌లో ప్రతిపాదిస్తున్నాం" అని వెల్లడించారు.బహుభార్యత్వాన్ని నిషేధించే దిశగా గతేడాది నవంబరులో అస్సాం అసెంబ్లీ కీలక బిల్లును ఆమోదించిన సంగతి తెలిసిందే. దీని కింద వివాహమైన వ్యక్తి విడాకులు తీసుకోకుండా లేదా భార్య బతికుండగానే మరో పెళ్లి చేసుకుంటే అతడిని దోషిగా పరిగణించనున్నారు. ఈ కేసుల్లో నిందితులకు ఏడేళ్ల పాటు కఠిన కారాగార శిక్ష విధించేలా బిల్లును రూపొందించారు. ఆరో షెడ్యూల్‌లోని ప్రాంతాలకు మినహా అస్సాం అంతటా ఈ బిల్లు వర్తిస్తుందని ముఖ్యమంత్రి హిమంత బిశ్వ శర్మ అప్పట్లో తెలిపారు.

## ఈక్విటీ, గోల్డ్ ఈటీఎఫ్‌ల్లోకి పెరిగిన పెట్టుబడులు

**దిల్లీ:** ఈక్విటీ ఆధారిత మ్యూచువల్ ఫండ్ స్కీముల్లోకి జూన్ నెలలో నిధుల ప్రవాహం పెరిగింది. మార్కెట్ ఒడుదొడుకులు ఉన్నా రూ.28,973 కోట్ల నికర పెట్టుబడులు నమోదయ్యాయి. అంతకుముందు నెలతో పోలిస్తే 26 శాతం మేర పెట్టుబడులు పెరిగాయి. ఈ మేరకు అసోసియేషన్ ఆఫ్ మ్యూచువల్ ఫండ్స్ ఇన్ ఇండియా (యాంఫీ) సంబంధిత గణాంకాలను శుక్రవారం విడుదల చేసింది.మొత్తం మ్యూచువల్ ఫండ్ పరిశ్రమ నుంచి జూన్ నెలలో నికరంగా రూ.52,949 కోట్ల నిధులు తరలిపోయాయి. మే నెలలో ఈ మొత్తం రూ.64,131 కోట్లతో పోల్చినప్పుడు ఇది ఊరట కల్పించే అంశం. ముఖ్యంగా డెట్ స్కీమ్‌ల నుంచి రూ.1.09 లక్షల కోట్ల మేర ఉపసంహరణలు నమోదు కావడం ఇందుకు కారణం. మ్యూచువల్ ఫండ్ సంస్థల నిర్వహణలో ఉన్న ఆస్తుల విలువ రూ.81.6 లక్షల కోట్ల నుంచి జూన్ చివరి నాటికి రూ.82.22 లక్షల కోట్లకు పెరిగింది.ఈ ఏడాది ఈక్విటీ మ్యూచువల్ ఫండ్స్‌లో ట్రెండ్‌ను గమనించినట్లయితే.. మే నెలలో రూ.22,908 కోట్ల మేర పెట్టుబడులు రాగా.. జూన్‌లో రూ.28,973 కోట్లకు పెరిగాయి. ఏప్రిల్‌లో రూ.38,440 కోట్లు, మార్చిలో రూ.40,450 కోట్లు, ఫిబ్రవరిలో రూ.25,978 కోట్లు, జనవరిలో రూ.24,028 కోట్ల పెట్టుబడులు నమోదయ్యాయి.మిడ్‌క్యాప్‌లోకి అత్యధికంగా: ఈక్విటీ కేటగిరీలో మిడ్‌క్యాప్ ఫండ్స్ రూ.6,090 కోట్లతో అత్యధిక పెట్టుబడులను సాధించినట్లు యాంఫీ తెలిపింది. స్మాల్ క్యాప్ ఫండ్స్‌లోకి రూ.5,602 కోట్లు, ఫ్లెక్సీ క్యాప్ ఫండ్స్‌లోకి రూ.5,231 కోట్లు, లార్జ్ క్యాప్ ఫండ్స్‌లోకి రూ.2,067 కోట్లు చొప్పున పెట్టుబడులు వచ్చాయి. డివిడెండ్ ఈల్డ్ ఫండ్స్, ఈక్విటీ లింక్డ్ సేవింగ్స్ స్కీమ్‌ల్లో (ఇఎల్‌ఎస్ఎస్) జూన్‌లో పెట్టుబడుల ఉపసంహరణ కనిపించింది. అలాగే గోల్డ్ ఎక్స్ఛేంజ్ ట్రేడెడ్ ఫండ్స్‌లో మేలో రూ.725 కోట్లు తరలిపోగా.. జూన్ నెలలో రూ.3,443 కోట్ల మేర నికరంగా పెట్టుబడులు వచ్చాయి.

## ఎలక్ట్రానిక్స్ తయారీలో వాడే కీలక విడిభాగాలపై కస్టమ్స్ సుంకం రద్దు



**దిల్లీ:** దేశీయంగా స్మార్ట్‌ఫోన్లు, ల్యాప్‌టాప్‌లు, వేరబుల్స్, స్మార్ట్‌టీవీల వంటి ఎలక్ట్రానిక్ పరికరాల తయారీ (అసెంబ్లింగ్)ని ప్రోత్సహించే లక్ష్యంతో.. డిస్‌ప్లే అసెంబ్లీస్, లిథియం అయాన్ సెల్, ఇండక్టర్ కాయిల్ మాడ్యుల్ తయారీలో ఉపయోగించే వస్తువులపై ప్రాథమిక కస్టమ్స్ సుంకాన్ని ప్రభుత్వం రద్దు చేసింది. వీటిపై సుంకం మినహాయింపును అమల్లోకి తెస్తూ ఆర్థిక శాఖ మూడు వేర్వేరు నోటిఫికేషన్లు జారీ చేసింది. ఉత్పత్తి ఆధారిత ప్రోత్సాహక (పీఎల్ఐ) పథకం కింద దేశీయంగా ఎలక్ట్రానిక్స్ ఉత్పత్తుల తయారీని ప్రోత్సహించడానికి ప్రభుత్వం చేస్తున్న ప్రయత్నాల్లో భాగంగానే ఈ నిర్ణయం తీసుకుంది. దీనివల్ల దిగుమతులపై ఆధారపడటం తగ్గడమే కాక, దేశీయంగా ఎలక్ట్రానిక్స్ తయారీ రంగం బలోపేతం అవుతుంది. నూతన ఉద్యోగాలు లభిస్తాయి.డిస్‌ప్లే అసెంబ్లీస్, ఇండక్టర్ కాయిల్ మాడ్యూల్‌లో వాడే విడిభాగాలపై సుంకం మినహాయింపులు 2029 మార్చి 31 వరకు చెల్లుబాటులో ఉంటాయని ప్రభుత్వం వెల్లడించింది. మొబైల్ ఫోన్‌లు, విద్యుత్తు వాహనాల (ఈవీ)లో వాడే లిథియం–అయాన్ సెల్‌ల తయారీకి ఉపయోగించే యంత్రాలకు ఉన్న వేర్వేరు కస్టమ్స్ సుంకాలను ఏకీకృతం చేస్తూ ప్రభుత్వం తీసుకున్న నిర్ణయం వల్ల దేశీయంగా లిథియం– అయాన్ సెల్ తయారీలోకి కొత్త పెట్టుబడులు వస్తాయని ఏఎంఆర్‌జీ గ్లోబల్ మేనేజింగ్ పార్ట్‌నర్ రజత్ మోహన్ తెలిపారు. 'బ్యాటరీ గిగాఫ్యాక్టరీలు, ఈవీ తయారీదార్లు, కన్స్యూమర్ ఎలక్ట్రానిక్స్ కంపెనీలు, బ్యాటరీ ఎనర్జీ స్టోరేజ్ సిస్టమ్ తయారీదార్లు, పునరుత్పాదక ఇంధన ప్రాజెక్టులు, టెలికాం మౌలిక సదుపాయాల సంస్థలు, డేటా కేంద్రాలు, వైద్య పరికరాల తయారీదార్లు, డ్రోన్ల తయారీదార్లు, పారిశ్రామిక ఆటోమేషన్ రంగాలు ప్రభుత్వ తాజా నిర్ణయం వల్ల అధికంగా లబ్ధి పొందుతాయి.

## 'కరూర్' బాధిత కుటుంబాలకు ప్రభుత్వోద్యోగాలు

పోలీసులను నమ్మాను. కానీ, నా వల్లే మరణాలు జరిగాయని నాడు నాపై నిందలేశారు. ఘటన తర్వాత నేను పారిపోయానని ప్రత్యర్థులు నాపై బురదజల్లారు. కానీ, నేను పారిపోలేదు. ప్రజలకు సేవ చేసేందుకే రాజకీయాల్లోకి వచ్చా" అని విజయ్ అన్నారు. కరూర్ విషాదాన్ని తానెప్పటికీ మర్చిపోలేనని, మృతుల జ్ఞాపకార్థం పార్టీ తరఫున స్మారకాన్ని నిర్మిస్తానని సీఎం వెల్లడించారు.ఈ సందర్భంగా తన ప్రభుత్వాన్ని కూల్చేందుకు ఇటీవల జరిగిన ప్రయత్నాలపై విజయ్ స్పందించారు. ప్రజలు తనవైపే ఉన్నారని తెలిపారు. ఎవరెన్ని ప్రయత్నాలు చేసినా.. తమను అధికారంలో నుంచి దించలేరంటూ డీఎంకే– అన్నాడీఎంకేపై పరోక్ష విమర్శలు గుప్పించారు. గత ప్రభుత్వాలు భారీ ఎత్తున అవినీతికి పాల్పడ్డాయని విజయ్ విమర్శించారు. తమ హయాంలో ప్రభుత్వ ఆఫీసుల్లో అవినీతి పేరే వినిపించదని తెలిపారు. ఒక్క పైసా కూడా లంచం తీసుకోకుండా.. నిజాయతీగా ప్రజలకు సేవలందిస్తున్నట్లు పేర్కొన్నారు.తమిళనాడు అసెంబ్లీ ఎన్నికల సమయంలో గతేడాది సెప్టెంబరులో కరూర్ ఘటన జరిగిన సంగతి తెలిసిందే. విజయ్ ఎన్నికల ప్రచారం నిమిత్తం టీవీకే పార్టీ ఏర్పాటు చేసిన ర్యాలీలో తొక్కిసలాట జరిగి 41 మంది ప్రాణాలు కోల్పోయారు. ఈ ఘటనపై తీవ్రగ్భ్రాంతి వ్యక్తం చేసిన విజయ్.. అధికారంలోకి వచ్చిన తర్వాత బాధిత కుటుంబాలకు ప్రభుత్వ ఉద్యోగాలు ఇస్తానని ప్రకటించారు. అన్నట్లుగానే.. నేడు అర్హులైన వారికి నియామక పత్రాలు అందజేశారు.

## భలా టీసీఎస్

- అంచనాలను మించి
- రూ.13,349 కోట్లకు నికర లాభం



**హైదరాబాద్:** తొలి త్రైమాసికంలో మా వృద్ధి కొనసాగింది. భౌగోళిక–రాజకీయ, స్థూల ఆర్థిక అనిశ్చితుల్లో మా వ్యూహాత్మక స్థానానికి ఉన్న బలాన్ని ఇది సూచిస్తోంది. ఏఐ (కృత్రిమమేధ), ఆధునికీకరణ, సైబర్ భద్రత, సొంత క్లౌడ్‌పై పెట్టుబడులను మా ఖాతాదార్లు పెంచడం కలిసొచ్చింది. రెండో త్రైమాసికంలో గిరాకీ పుంజుకుంటుందన్న విశ్వాసం మాకుంది. దేశంలోనే అతిపెద్ద ఐటీ సేవల కంపెనీ టాటా కన్సల్టెన్సీ సర్వీసెస్ (టీసీఎస్), ప్రస్తుత ఆర్థిక సంవత్సరం తొలి త్రైమాసికంలో రూ.13,349 కోట్ల నికర లాభాన్ని నమోదు చేసింది. 2025–26 ఏప్రిల్–జూన్ లాభం రూ.12,760 కోట్లతో పోలిస్తే ఇది 4.61% అధికం. కృత్రిమ మేధ(ఏఐ) సాంకేతికత వల్ల, ఐటీ సేవల కంపెనీలకు ఆర్డర్లు తగ్గుతాయనే అంచనాలు వెలువడిన నేపథ్యంలో, టీసీఎస్ ఫలితాలు సంతృప్తి కలిగించాయి. ఇదే సమయంలో సంస్థ ఆదాయం రూ.63,437 కోట్ల నుంచి 14% వృద్ధితో రూ.72,275 కోట్లకు చేరింది. 2025–26 మార్చి త్రైమాసిక ఆదాయం రూ.70,698 కోట్లతో పోల్చినా ఇది 2.23% అధికం. ఈసారి ఏఐ విభాగ ఆదాయాలు 2.6 బి. డాలర్లు (రూ.24,700 కోట్లు)గా ఉన్నాయి. త్రైమాసికం వారీగా చూస్తే ఇందులో 13.6% వృద్ధి కనిపించింది. నిర్వహణ మార్జిన్ మార్చి త్రైమాసికం నాటి 25.3% నుంచి 24 శాతానికి చేరింది. ఏప్రిల్–జూన్‌లో టీసీఎస్ ఉద్యోగుల సంఖ్య 9,200కు పైగా పెరిగింది. ఫలితంగా జూన్ 30కి ఉద్యోగుల సంఖ్య 5,93,798కి చేరింది. ఐటీ సేవల్లో దీర్ఘకాల వలసల రేటు 13.6 శాతంగా నమోదైంది. ఏఐ మౌలిక వసతులు, తదుపరి తరం నైపుణ్యాభివృద్ధి ప్లాట్‌ఫామ్‌లపై పెట్టుబడులు పెట్టడం ద్వారా తమ సిబ్బందిని భవిష్యత్తుకు సిద్ధం చేస్తున్నట్లు ముఖ్య మానవ వనరుల అధికారి(సీహెచ్‌ఆర్‌ఓ) సుదీప్ కున్నుమాల్ పేర్కొన్నారు. తొలి త్రైమాసికంలో 14,000కు పైగా ఫ్రెషర్లకు ఆఫర్లను ఇచ్చామని, ఏఐ నైపుణ్యాలున్న వారికోసం కళాశాల ప్రాంగణాలకు వెళ్లడం కొనసాగిస్తామన్నారు.రాణించిన భారత ఆదాయాలు: ఏడాది క్రితంతో పోలిస్తే, ఈసారి జూన్ త్రైమాసికంలో లాటిన్ అమెరికా, బ్రిటన్ నుంచి తక్కువ ఆదాయాలు వచ్చాయి. భారత ఆదాయాలు ఏడాది వారీగా 22.9%, త్రైమాసికం వారీగా 7.6% రాణించాయి. వినియోగదారు వ్యాపారం మినహా మిగతా అన్ని రంగాల్లో ఆదాయ వృద్ధి కనిపించింది.
ఒక్కో షేరుకు రూ.12 మధ్యంతర డివిడెండును కంపెనీ బోర్డు ప్రకటించింది. బీఎస్‌ఈలో కంపెనీ షేరు 0.52% తగ్గి రూ.2047.75 వద్ద స్థిరపడింది.ఏప్రిల్–జూన్‌లో 9.5 బిలియన్ డాలర్ల (దాదాపు రూ.90,250 కోట్లు) విలువైన కాంట్రాక్టులను టీసీఎస్ దక్కించుకుంది. ఏఐ పరివర్తన కోసం బేరింగ్స్ తయారీ దిగ్గజ సంస్థ ఎస్‌కేఎఫ్ ఇచ్చిన 800 మి. డాలర్ల కాంట్రాక్టు ఇందులో భాగమే. ఏఐ సాంకేతికత వల్ల వైట్ కాలర్ ఉద్యోగాలు తగ్గవని సంస్థ సీఈఓ, ఎండీ కృతివాసన్ స్పష్టం చేశారు.
ఆంత్రోపిక్‌తో భాగస్వామ్యం: ఏఐ వ్యవస్థను మరింత విస్తరించడం కోసం ఆంత్రోపిక్, మిస్ట్రాల్‌తో వ్యూహాత్మక భాగస్వామ్య ఒప్పందాలపై సంతకాలు చేసినట్లు టీసీఎస్ చీఫ్ ఆపరేటింగ్ ఆఫీసర్ (సీఓఓ) ఆర్తి సుబ్రమణియన్ పేర్కొన్నారు.

## ఎన్‌టీపీసీ రామగుండం-తెలంగాణ ప్రాజెక్టులో
# ఎంజీఆర్ రైల్ నెట్‌వర్క్ ప్రారంభం

- ఆపరేషనల్ సేఫ్టీ, ట్రాఫిక్ మేనేజ్‌మెంట్ మెరుగు
- ఎస్ అండ్ టి ఇంటర్‌లాకింగ్ లెవల్ క్రాసింగ్స్ కమిషన్
- టెలంగాణ స్టేజ్-2 కన్‌స్ట్రక్షన్ కార్యకలాపాలకు ఊతం :ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ సమంత



**గోదావరిఖని, జులై 10 (జనంసాక్షి):** ఎన్‌టీపీసీ తెలంగాణ ప్రాజెక్ట్ సమర్థవంతంగా రామగుండం ఎంజీఆర్ రైల్ నెట్‌వర్క్‌ను ఇప్పటికే ఉన్న రూట్ రేలే ఇంటర్‌లాకింగ్ (ఆర్‌ఆర్‌ఐ) సిస్టమ్‌తో సమగ్రంగా ఉండే సిగ్నల్ అండ్ టెలికమ్యూనికేషన్ (ఎస్ అండ్ టి) ఇంటర్‌లాక్ లెవల్ క్రాసింగ్స్ (ఎల్‌సీఎస్)ని షెడ్యూల్ చేసిన నాన్-ఇంటర్‌లాకింగ్ (ఎన్‌ఐ) శుక్రవారం కమిషన్ చేసింది.
కొత్తగా కమిషన్ కావలసిన లెవల్ క్రాసింగ్స్‌ను చందన్ కుమార్ సమంత, ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ (రామగుండం అండ్ తెలంగాణ), ముకుల్ రాయి, సీజీఎం (ఓ అండ్ ఎం), తెలంగాణ; మనీష్ అగ్రవాల్, జీఎం (ఓ అండ్ ఎం), రామగుండం; బినాయ్ జోసే, జీఎం (ప్రాజెక్ట్), తెలంగాణ; ఏజీఎం (టీఎస్), హెచ్‌ఓ హెచ్‌ఆర్, జీఎస్ (నియర్), ఈఈడి, సీసీడి, ఎఫ్‌టి, ఎంజీఆర్, సేఫ్టీ, సీహెచ్‌పి తదితర విభాగాల హెడ్స్ సమక్షంలో ప్రారంభించారు. కమిషనింగ్ ఎంజీఆర్ రైల్ నెట్‌వర్క్ ఆపరేషనల్ సేఫ్టీని గణనీయంగా పెంచుతూ తెలంగాణ స్టేజ్-2 కన్‌స్ట్రక్షన్ కార్యకలాపాలు, ఆపరేషన్ అండ్ మెయింటెనెన్స్ (ఓ అండ్ ఎం) ట్రాఫిక్‌ను కవర్ చేస్తుందని ఎన్‌టీపీసీ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ సమంత తెలిపారు. సమగ్ర ఎస్‌డటి ఇంటర్‌లాక్ లెవల్ క్రాసింగ్స్ రైలు ట్రాఫిక్ మేనేజ్‌మెంట్‌ను బలపరిచి ఆపరేషనల్ సామర్థ్యాన్ని మెరుగుపరుస్తాయన్నారు.

# భూముల సర్వే ప్రక్రియ వేగవంతంగా చేపట్టాలి

- సాదా బైనామా - భూభారతి దరఖాస్తులను ఎప్పటికప్పుడు పరిష్కరించాలి
- అధికారులు పక్కా ప్రణాళికతో ముందుకెళ్లాలి : జిల్లా కలెక్టర్ చిత్రా మిశ్రా



**కరీంనగర్ బ్యూరో, జూలై 10 (జనంసాక్షి) :**
జిల్లాలో చేపడుతున్న భూముల సర్వే, రీ - సర్వే ప్రక్రియను మరింత వేగవంతంగా చేపట్టాలని జిల్లా కలెక్టర్ చిత్రా మిశ్రా అధికారులను ఆదేశించారు. సాదా బైనామా - భూభారతి దరఖాస్తులను ఎప్పటికప్పుడు పరిశీలించి త్వరితగతిన పరిష్కరించాలని సూచించారు. ప్రతి అంశంలో అధికారులు పక్కా ప్రణాళికతో ముందుకు సాగుతూ ప్రజలకు వేగంగా సేవలు అందించాలన్నారు. శుక్రవారం రాత్రి కలెక్టర్ క్యాంపు కార్యాలయంలో ఆర్డీవోలు, కలెక్టరేట్ సూపరింటెండెంట్లు, సంబంధిత శాఖల అధికారులతో భూముల సర్వే, రీ - సర్వే, భూభారతి - సాదా బైనామా దరఖాస్తుల పరిష్కారం, ప్రత్యేక ఓటరు సమగ్ర సవరణ (ఎస్‌ఐఆర్) ప్రక్రియ పురోగతిపై జిల్లా కలెక్టర్ సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ... తిమ్మాపూర్ మండలం కొత్తపల్లి గ్రామంలో చేపట్టిన భూముల సర్వే నంబర్లపై రీ - సర్వే పనులను వేగవంతం చేయాలని సూచించా రు. జిల్లాలో మొత్తం 70 గ్రామాల్లో భూముల సర్వే నంబర్లపై సర్వే చేపడుతున్నామని, ఇప్పటికే ఏడు గ్రామాల్లో పనులు ప్రారంభమైనట్లు తెలిపారు. మిగిలిన గ్రామాల్లో కూడా యుద్ధ ప్రాతిపదికన సర్వే నిర్వహించేందుకు ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేయాలని అధికారులను ఆదేశించారు. జిల్లాలో సుమారు 94,637 ఎకరాల భూముల సర్వే చేపట్టనున్నట్లు పేర్కొన్న కలెక్టర్, ఈ కార్యక్రమాన్ని విజయ వంతంగా పూర్తి చేయడానికి అధికారులు సమన్వయంతో పనిచేయాలని సూచించారు. ప్రత్యేక ఓటరు సమగ్ర సవరణ (ఎస్‌ఐఆర్) కార్యక్రమాన్ని మరింత వేగవంతం చేయాలని, బీఎల్‌వోలు ఇంటింటికి వెళ్లి ప్రతి ఓటరిని చేరుకోవాలని ఆదేశించారు. అందరికీ ఎనిమరేషన్ దరఖాస్తులు అందేలా చూడాలన్నారు. ప్రతి 10 మంది బీఎల్‌వోలకు ఒక క్లస్టర్ ఏర్పాటు చేసి, పకడ్బందీగా ఎస్‌ఐఆర్ ప్రక్రియ నిర్వహించేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. అలాగే రెవెన్యూ సదస్సుల నిర్వహణపై ప్రత్యేక దృష్టి సారించాలని తెలిపారు. అనంతరం గృహ నిర్మాణ శాఖ అధికారులతో నిర్వహించిన సమీక్షలో ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణం, డబుల్ బెడ్‌రూమ్ ఇళ్ల నిర్మాణ పనుల పురోగతి పై సమీక్షించి, నిర్మాణ పనులను వేగవంతం చేయాలని అధికారులను ఆదేశించారు. ఈ సమావేశంలో కరీంనగర్, హుజూరాబాద్ ఆర్డీవోలు షర్మిల, జలకుమారి, గృహ నిర్మాణ శాఖ అధికారులు, కలెక్టరేట్ సూపరింటెండెంట్లు మోబిన్, కాలీచరణ్, మాధవితో పాటు సంబంధిత శాఖల అధికారులు పాల్గొన్నారు.

## కోట్‌పల్లి కేజీబీవీలో నాన్-టీచింగ్ పోస్టుల భర్తీ

### స్థానిక మహిళా అభ్యర్థుల నుంచి దరఖాస్తుల ఆహ్వానం - జూలై 15 చివరి తేదీ

**కోట్ పల్లి జూలై 10 (జనంసాక్షి):**
వికారాబాద్ జిల్లా కోట్‌పల్లి మండలంలోని కస్తూర్బా గాంధీ బాలికా విద్యాలయం (కేజీబీవీ) లో ఖాళీగా ఉన్న నాన్-టీచింగ్ పోస్టులను కాంట్రాక్ట్ ప్రాతిపదికన భర్తీ చేయనున్నట్లు ప్రత్యేక అధికారి పల్లవి రెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. కోట్ పల్లి మండలానికి చెందిన అర్హత కలిగిన స్థానిక మహిళా అభ్యర్థుల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు పేర్కొన్నారు.
భర్తీ చేయనున్న పోస్టుల్లో హెడ్ కుక్ - 1, డ్రై స్వీపర్ - 1, వెట్ స్వీపర్ - 1 ఉన్నాయి. హెడ్ కుక్ పోస్టుకు 10వ తరగతి ఉత్తీర్ణతతో పాటు అధిక సంఖ్యలో వ్యక్తులకు వంట చేసిన అనుభవం ఉండాలి. డ్రై స్వీపర్, వెట్ స్వీపర్ పోస్టులకు 7వ తరగతి ఉత్తీర్ణత అర్హతగా నిర్ణయించారు. దరఖాస్తుదారులు తప్పనిసరిగా కోట్ పల్లి మండలానికి చెందిన స్థానిక మహిళలు కావాలని, వారి వయస్సు 25 నుంచి 55 సంవత్సరాల మధ్య ఉండాలని అధికారులు స్పష్టం చేశారు. ప్రభుత్వం నిర్దేశించిన విద్యార్హతలు, అర్హత ప్రమాణాలు మరియు ఇతర నిబంధనలను పాటించిన అభ్యర్థులను ప్రభుత్వ మార్గదర్శకాల మేరకు ఎంపిక చేస్తామని తెలిపారు. దరఖాస్తుతో పాటు విద్యార్హత ధ్రువ పత్రాలు, కుల ధ్రువీకరణ పత్రం, ఆధార్ కార్డు, నివాస ధ్రువీకరణ పత్రం, బోనాఫైడ్/స్థానికత ధ్రువీకరణ పత్రం, రెండు పాస్‌పోర్ట్ సైజు ఫోటోలు (ఒరిజినల్స్‌తో పాటు జిరాక్స్ ప్రతులు) సమర్పించాల్సి ఉంటుందని వెల్లడించారు.
అభ్యర్థులు తమ దరఖాస్తులను ప్రత్యేక అధికారి, కస్తూర్బా గాంధీ బాలికా విద్యాలయం (కేజీబీవీ), కరీంపూర్ గేట్, కోట్ పల్లి మండలం, వికారాబాద్ జిల్లా చిరునామాకు జూలై 15, 2026 సాయంత్రం 4 గంటలలోపు సమర్పించాలని సూచించారు. మరిన్ని వివరాలకు 83284 15565 నంబర్‌ను సంప్రదించవచ్చని అధికారులు తెలిపారు.

# 5వ తెలంగాణ పోలీస్ గేమ్స్‌లో సత్తా చాటిన సైబరాబాద్ పోలీసులు

- 37 పతకాలతో రాష్ట్రస్థాయిలో రెండో స్థానం
- 9 బంగారు, 8 వెండి, 20 కాంస్యాలు
- విజేతలను ఘనంగా సత్కరించిన సిపి డా. ఎం. రమేష్
- క్రీడా స్ఫూర్తిని కొనసాగించాలి



**శేరిలింగంపల్లి, జూలై 10 (జనంసాక్షి):** 5వ తెలంగాణ పోలీస్ గేమ్స్ అండ్ స్పోర్ట్స్ మీట్‌లో సైబరాబాద్ పోలీస్ కమిషనరేట్ అధికారులు తమ సత్తా చాటారు. మొత్తం 37 పతకాలతో రాష్ట్రస్థాయిలో రెండో స్థానం సాధించి కమిషనరేట్ ఖ్యాతిని ఇనుమడింపజేశారు.
ఈ మేరకు సైబరాబాద్ కమిషనరేట్ కార్యాలయ ఆవరణలో శుక్రవారం ఏర్పాటు చేసిన ప్రత్యేక కార్యక్రమంలో సైబరాబాద్ సిపి డా. ఎం. రమేష్ ముఖ్య అతిథిగా పాల్గొని విజేతలను ఘనంగా సత్కరించారు. ఆయన మాట్లాడుతూ సైబరాబాద్ కమిషనరేట్ పరిధి అధికారులు 9 స్వర్ణాలు, 8 రజతాలు, 20 కాంస్యాలతో అద్భుత ప్రదర్శన చేశారని హర్షం వ్యక్తం చేశారు. సరూర్‌నగర్ ఇండోర్ స్టేడియంలో జూలై 8, 9 తేదీల్లో నిర్వహించిన 5వ తెలంగాణ పోలీస్ గేమ్స్ అండ్ స్పోర్ట్స్ మీట్-2026లో సైబరాబాద్ క్లస్టర్-ఏ క్రీడాకారులు విశేష ప్రతిభ కనబరిచారని తెలిపారు. యోగా, ఆర్మ్ రెజ్లింగ్, వుషు, తైక్వాండో, బాక్సింగ్, కరాటే, జిమ్నాస్టిక్స్, పెన్‌చక్ సిలాట్, పవర్‌లిఫ్టింగ్, బాడీ బిల్డింగ్ తదితర వ్యక్తిగత, జట్టు విభాగాల్లో అత్యుత్తమ ప్రతిభ చూపారు. విధులు నిర్వహిస్తూనే పరిమిత సమయంలో సాధన చేసి ఈ విజయం సాధించడం హర్షణీయమన్నారు. ఇదే క్రీడా స్ఫూర్తిని అన్ని క్రీడల్లోనూ కొనసాగించాలని, సైబరాబాద్ పోలీసుల కీర్తి పతాకాన్ని మరింత ఎత్తుకు తీసుకెళ్లాలని సిపి ఆకాంక్షించారు. క్రీడాకారులకు అవసరమైన శిక్షణ, సామగ్రి, సౌకర్యాలు కల్పించడానికి పోలీసు శాఖ అండగా ఉంటుందని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో సైబరాబాద్ జాయింట్ సిపి (ట్రాఫిక్) సన్‌ప్రీత్ సింగ్, అడ్మిన్ డీసీపీ టి. అన్నపూర్ణ, ఎస్‌బీ డీసీపీ సుధీంద్ర, సైబర్ క్రైమ్స్ డీసీపీ పుష్ప, సీఏఆర్ హెడ్‌క్వార్టర్స్ డీసీపీ సంజీవ్, ఏడీసీపీలు, ఏసీపీలు, ఇతర అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

# ఎలక్ట్రిక్ బస్సులు వద్దు - డీజిల్ బస్సులు ముద్దు

### టిజిఎస్ ఆర్టీసి జెఎసి



**ముషీరాబాద్, జూలై 10 (జనంసాక్షి):** కాలుష్య నివారణ పేరుతో ఆర్టీసిలో ఎలక్ట్రిక్ బస్సులు ప్రవేశ పెట్టారని, ఈ మధ్య కాలంలో జెబిఎం, ఒలెక్ట్రా బస్సులు అకస్మాత్తుగా షార్ట్ సర్క్యూట్ సంభవించి దగ్ధం అవుతుండడంతో అటు ప్రజలు, ఇటు ఆర్టీసి సిబ్బంది భయభ్రాంతులకు గురవుతున్నారని, అలాకాకుం డా డీజిల్ బస్సుల వల్ల ప్రయాణికులకు భద్రత ఉంటుందని, ఆర్టీసీ యాజమాన్యం వెంటనే డీజిల్ బస్సులను కొని నడిపించాలని టీజీఎస్ ఆర్టిసి జెఎసి ఛైర్మన్ ఈదురు వెంకన్న, వైస్ ఛైర్మన్ ఎం.థామస్ రెడ్డి, కన్వీనర్ ఎండి మౌలానా, కో-కన్వీనర్లు కత్తుల యాదయ్య, బి. యాదగిరి లు డిమాండ్ చేశారు. ఈ మేరకు శుక్రవారం ఓ ప్రకటన విడుదల చేశారు. ఎలక్ట్రిక్ బస్సులను రిపేర్ చేయుట కొరకు ఆయా కంపెనీలకు తరలించటం వలన బస్సులు తగ్గిపోయి డిపోలలో పని చేస్తున్న కండక్టర్లకు డ్యూటీలు లేకపోవడంతో నిత్యం లీవులు వేయడం, మరికొంతమందిని ఇతర డిపోలకు బదిలీ చేయడం పట్ల కార్మికులు తీవ్ర అభద్రతా భావంతో ఉన్నారని వివరించారు. ఆర్టీసి సంస్థ మొదలైనప్పటి నుండి డీజిల్ బస్సులనే ఉపయోగిస్తున్నారని, ఇవి ఎలాంటి ప్రమాదాలు సంభవించకుండా పని చేస్తున్నాయని, వీటివల్ల ప్రయాణీకులకు భద్రత కల్పించటం తో పాటు వారిని క్షేమంగా, సురక్షితంగా వారి గమ్యస్థానాలకు చేర్చుటకు డీజిల్ బస్సులే ఉత్తమమని టిజిఎస్ ఆర్టీసి జెఎసి భావిస్తోందన్నారు. కావున ఆర్టీసి యాజమాన్యం తక్షణమే ప్రైవేట్ ఎలక్ట్రిక్ బస్సుల స్థానంలో డీజిల్ బస్సులను కొని నడిపించాలని జెఎసి డిమాండ్ చేసింది.

## కార్పొరేషన్ పరిధిలో దీర్ఘకాలిక సమస్యల పరిష్కారానికి కృషి

### రామగుండం నగర మేయర్ మహంకాళి స్వామి



**గోదావరిఖని, జనంసాక్షి :** ఎన్నో ఏళ్లుగా పరిష్కారం కాకుండా ప్రజలను ఇబ్బందులకు గురి చేస్తున్న దీర్ఘకాలిక సమస్యలను కూడా వార్డు సందర్శనలో పరిష్కరిస్తున్నట్లు రామగుండం నగర మేయర్ మహంకాళి స్వామి తెలిపారు. వార్డు సందర్శనలో భాగంగా అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు), కమిషనర్ జె. అరుణ శ్రీతో కలిసి శుక్రవారం 23 డివిజన్ ప్రగతి నగర్‌లో పర్యటించారు. ఈ సందర్భంగా ప్రగతి నగర్ కాలువ నుండి ప్రవహిస్తున్న నీరు ఎన్‌టిపిసి ప్రహరీ గోడ ప్రక్కన కొన్ని ఏండ్లుగా నిలిచి పోయి ఉన్న విషయాన్ని స్థానిక కార్పొరేటర్ బెంద్రం సునీతా రాజిరెడ్డి ఆయన దృష్టికి తీసుకువచ్చారు. మేయర్ ఆదేశాలతో జెసిబి యంత్రాలు , బ్లేడ్ ట్రాక్టర్ సహాయంతో చెట్ల గుబుర్లన్నీ తొలగించి కాలువ శుభ్రం చేశారు. ఎన్‌టిపిసి పిటిఎస్ లోపలి వైపు ఉన్న ఉన్న డ్రెయిన్ లోకి ఈ నీరు వెళ్ళేలా చేశారు. మేయర్, కమిషనర్ పిటిఎస్ లోపలకు వెళ్ళి ఈ కాలువకు అనుసంధానంగా ఉన్న అక్కడి కాలువ కూడా శుభ్రం చేసి తట్టుకున్న వ్యర్థాలను తొలగించడంతో నిలువ ఉన్న నీరు ప్రవహించడం ప్రారంభమై కొన్ని ఏళ్లుగా ఇంకిపోవడం తప్పా మరో మార్గం లేని కాలువకు మోక్షం లభించింది. మేయర్, కమిషనర్ తీసుకున్న చొరవతో ప్రగతినగర్ నుండి వస్తున్న కాలువ ఏ ఆటంకం లేకుండా సాఫీగా ప్రవహిస్తుండడంతో స్థానికులు హర్షం వ్యక్తం చేశారు. అనంతరం మేయర్ మాట్లాడుతూ కాలువకు ఎన్‌టి పిసి అధికారులు ఏర్పాటు చేసిన గ్రిల్స్‌కు ప్లాస్టిక్ చెత్త తట్టుకొని కాలువ పూడుక పోయి ఎవరూ పట్టించుకోకపోవడంతో నీరు అలాగే నిలిచి ఉందని తద్వారా వర్షాకాలంలో ప్రగతి నగర్ ఇళ్ల లోకి నీరు వచ్చేవని అన్నారు. మరో సారి కాలువ పూడుక పోకుండా పైపులు వేయించే ఏర్పాట్లు చేస్తున్నట్లు కమిషనర్ తెలిపారని అన్నారు. ప్రస్తుతం రామగుండం నగర పాలక సంస్థ చేపట్టిన పూడిక తొలగింపు చర్యల కారణంగా వర్షాకాలంలో నీళ్ళు లోకి వచ్చే ప్రమాదం తప్పిందని అన్నారు. నగర ప్రజలు కూడా సహకరించి ప్లాస్టిక్ బాటిల్లు, చెత్త కాలువల్లో పడ వేయవద్దని, మున్సిపల్ వాహనానికి అందించాలని కోరారు. ఈ కాలువ సాఫీగా ప్రవహించడానికి ఎన్‌టిపిసి అధికారులు కూడా సహకరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో నగర పాలక సంస్థ డిప్యూటీ కమిషనర్ నాయిని వెంకట స్వామి, టిపిఎస్ నవీన్, జూనియర్ అసిస్టెంట్ చంద్రా రెడ్డి, సానిటరీ జవాన్ సంపత్, ఎకో వారియర్స్ కన్సల్టెన్సీ బృంద సభ్యులు స్వరూప్, మహేంద్ర, వాటర్ సప్లయ్ సూపర్ వైజర్ శశి కుమార్ తదితరులు పాల్గొన్నారు.

## ఉప్పల్‌లో బస్తీ దవాఖానల ఏర్పాటుకు
# ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి కృషి

- వైద్య శాఖ మంత్రి దామోదర్ రాజనర్సింహకు వినతి
- సానుకూల స్పందన.. అవసరమైన చర్యలు చేపడతామని హామీ
- పేద, మధ్యతరగతి ప్రజలకు స్థానికంగానే వైద్య సేవలు
- అందుబాటులోకి నాణ్యమైన ఆరోగ్య సేవలు



**ఉప్పల్, జూలై 10 (జనంసాక్షి):**
ఉప్పల్ నియోజకవర్గం ప్రజలకు నాణ్యమైన వైద్య సేవలను మరింత చేరువ చేయాలనే లక్ష్యంతో ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి రాష్ట్ర వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి దామోదర్ రాజనర్సింహను మర్యాద పూర్వకంగా కలిసి వినతి పత్రం అందజేశారు.
నియోజకవర్గంలోని పేద, మధ్యతరగతి ప్రజలకు అందుబాటులోనే మెరుగైన వైద్య సేవలు లభించేలా వివిధ కాలనీల్లో బస్తీ దవాఖానలను ఏర్పాటు చేయాలని మంత్రికి వినతి చేశారు. బస్తీ దవాఖానలు ఏర్పాటు చేస్తే ఉచిత వైద్య పరీక్షలు, ప్రాథమిక చికిత్స, అవసరమైన మందుల పంపిణీ, సాధారణ ఆరోగ్య సేవలు స్థానికంగానే అందుబాటులోకి వస్తాయని ఎమ్మెల్యే వివరించారు. దీంతో వృద్ధులు, మహిళలు, చిన్నారులు దూర ప్రాంతాలకు వెళ్లాల్సిన అవసరం లేకుండా స్థానికంగానే వైద్య సేవలు పొందవచ్చన్నారు. వినతి పత్రాన్ని స్వీకరించిన మంత్రి దామోదర్ రాజనర్సింహ ప్రతిపాదనను సానుకూలంగా పరిశీలించి అవసరమైన చర్యలు చేపడతామని ఎమ్మెల్యేకు హామీ ఇచ్చారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రతి పేద కుటుంబానికి నాణ్యమైన, అందుబాటు వైద్య సేవలు అందించడానికి కట్టుబడి ఉందని స్పష్టం చేశారు. ఉప్పల్ నియోజకవర్గంలో బస్తీ దవాఖానలు ఏర్పాటు అయితే వేలాది మంది ప్రజలకు ప్రాథమిక ఆరోగ్య సేవలు సులభంగా అందుబాటులోకి వచ్చి ప్రభుత్వ వైద్య సేవలపై విశ్వాసం మరింత పెరుగుతుందని స్థానికులు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు.

## బీఎంఎస్ పోరాట ఫలితమే
# తాడిచెర్ల బొగ్గు బ్లాక్-2 కేటాయింపు

### సింగరేణి భవిష్యత్తుకు ఇది చారిత్రాత్మక నిర్ణయమని వడ్డేపల్లి కుమారస్వామి వ్యాఖ్య

### 12వ వేజ్ బోర్డు కమిటీని తక్షణమే ఏర్పాటు చేయాలని కేంద్రానికి డిమాండ్

**గోదావరిఖని, జూలై 10 (జనంసాక్షి):** తాడిచెర్ల బొగ్గు బ్లాక్-2ను సింగరేణికి కేటాయిస్తూ కేంద్ర ప్రభుత్వం తీసుకున్న నిర్ణయం బీఎంఎస్ నిరంతర పోరాట ఫలితమేనని భారతీయ మజ్దూర్ సంఘ్ (బీఎంఎస్) ప్రధాన కార్యదర్శి వడ్డేపల్లి కుమారస్వామి అన్నారు. ఈ నిర్ణయం సింగరేణి భవిష్యత్తుకు చారిత్రాత్మక మలుపు అని పేర్కొన్నారు. శుక్రవారం సింగరేణి ఆర్జీ-2 ఏరియా ఓసీపీ-3 కృషి భవన్‌లో బీఎంఎస్ నాయకులు కార్మికులకు స్వీట్లు పంపిణీ చేసి ఆనందం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా మాట్లాడిన కుమారస్వామి, తాడిచెర్ల బొగ్గు బ్లాక్-2 కేటాయింపుకు సహకరించిన కేంద్ర ప్రభుత్వం, ప్రధానినరేంద్ర మోదీ, కేంద్ర బొగ్గు, గనుల శాఖ మంత్రి జి. కిషన్ రెడ్డి, బీఎంఎస్ కోల్ సెక్టార్ ఇంచార్జ్ కొత్తకాపు లక్ష్మారెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు.
భారతీయ మజ్దూర్ సంఘ్ ఆధ్వర్యంలోని సింగరేణి కోల్ మైన్స్ కార్మిక సంఘ్ చేపట్టిన ఉద్యమాలు, వినతిపత్రాలు, ఢిల్లీలో కేంద్ర మంత్రులు మరియు బొగ్గు మంత్రిత్వ శాఖ అధికారులతో జరిగిన పలు దఫాల చర్చల ఫలితంగానే ఈ నిర్ణయం సాధ్యమైందన్నారు. దీర్ఘకాలికంగా బొగ్గు ఉత్పత్తి కొనసాగించేందుకు సంస్థకు బలమైన ఆధారం లభిస్తుందని, రాబోయే తరాలకు కూడా సింగరేణి బలోపేతానికి ఈ నిర్ణయం ఉపయోగపడుతుందని పేర్కొన్నారు. అలాగే, 30 జూన్ 2026తో 11వ జేబీసీసీఐ వేజ్ బోర్డు కాలపరిమితి ముగిసిందని గుర్తుచేసిన కుమారస్వామి, 1 జూలై 2026 నుంచి అమలులోకి రావాల్సిన 12వ వేజ్ బోర్డు కమిటీని కేంద్ర ప్రభుత్వం వెంటనే ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో బీఎంఎస్ సెంట్రల్ సీనియర్ వైస్ ప్రెసిడెంట్ వై. సారంగపాణి, ఏరియా వైస్ ప్రెసిడెంట్ గట్టు శ్రీనివాస్, కార్యదర్శి యాదగిరి నరేష్, కేంద్ర కోశాధికారి సాయి వేన సతీష్, సీనియర్ నాయకులు పేందం సత్యనారాయణ, గాజుల వెంకటస్వామి తదితరులు పాల్గొన్నారు. పెద్ద ఎత్తున హాజరైన కార్మికులు సంఘం చేపట్టిన ఉద్యమానికి మద్దతు ప్రకటించారు.
సింగరేణి పరిరక్షణ, కార్మికుల సంక్షేమం, సంస్థ అభివృద్ధి కోసం భవిష్యత్తులో కూడా బీఎంఎస్ తన పోరాటాన్ని మరింత ఉధృతంగా కొనసాగిస్తుందని వడ్డేపల్లి కుమారస్వామి స్పష్టం చేశారు.

# పోలీసులకు ఉచిత వైద్య శిబిరం

**మహేశ్వరం,జులై10(జనంసాక్షి):** విశిష్ట మల్టీ స్పెషాలిటీ హాస్పిటల్ యాజమాన్యం పోలీసులకు ఉచిత వైద్య శిబిరం నిర్వహించడం అభినందనీయమని శంషాబాద్ జోన్ డిప్యూటీ కమిషనర్ రాజేష్ అన్నారు.శుక్రవారం విశిష్ట మల్టీ స్పెషాలిటీ హాస్పిటల్ నిర్వాహకులు పహాడీషరీఫ్ పోలీసులకు ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు.ఈ సందర్భంగా విశిష్ట మల్టీ స్పెషాలిటీ హాస్పిటల్ సీఎండీ డాక్టర్ రాందాస్ నాయక్ మాట్లాడుతూ...ప్రజల భద్రత కోసం అహర్నిశలు సేవలందిస్తున్న పోలీస్ సిబ్బందికి ఆరోగ్య పరిరక్షణకు ప్రత్యేక ప్రాధాన్యత ఇవ్వాల్సిన అవసరం ఉందన్నారు. భవిష్యత్తులో పోలీస్ సిబ్బంది కుటుంబ సభ్యులతో పాటు, సామాన్య ప్రజల కోసం ఉచిత వైద్య శిబిరాలు,ఆరోగ్య అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తామన్నారు.ఈ కార్యక్రమంలో ఆర్జీఐఏ డివిజన్ అసిస్టెంట్ కమిషనర్ శ్రీకాంత్ గౌడ్, పహాడీషరీఫ్ లక్ష్మీనారాయణ రెడ్డి,ఎస్ఐలు దయాకర్ రెడ్డి, వెంకటేశ్వర్లు,డాక్టర్లు ప్రశాంత్,సుభాషిణి,భార్గవి,పోలీసులు,వైద్యులు తదితరులు పాల్గొన్నారు.

## జూలై 24లోగా ఎన్యుమరేషన్ ఫారాలు సమర్పించాలి

### ఈఆర్‌ఓ సోలిపేట శ్రీనివాస్ రెడ్డి

**రాజేంద్రనగర్,జూలై10(జనంసాక్షి)**
రాజేంద్రనగర్ నియోజకవర్గంలోని ఓటర్లందరూ బీఎల్‌ఓలు అందజేసిన ఎన్యుమరేషన్ ఫారాలను పాస్‌పోర్ట్ సైజు ఫోటోతో కలిసి ఈ నెల 24లోగా పూర్తి చేసి తిరిగి సమర్పించాలని రాజేంద్రనగర్ ఈఆర్‌ఓ సోలిపేట శ్రీనివాస్ రెడ్డి కోరారు. గడువులోగా ఫారాలు సమర్పించిన వారి పేర్లు మాత్రమే జూలై 31న విడుదలయ్యే డ్రాఫ్ట్ ఓటరు జాబితాలో ఉంటాయని తెలిపారు. గడువు దాటితే ఆగస్టులో ఫారం-6తో పాటు ధృవీకరణ పత్రాలు సమర్పించాల్సి ఉంటుందని, అప్పుడు పేర్లు అక్టోబరులో విడుదలయ్యే తుది ఓటరు జాబితాలో చేర్చబడతాయని పేర్కొన్నారు. యువజన సంఘాలు ఓటర్లను చైతన్య పరచి ఫారాలను సకాలంలో సమర్పించేలా సహకరించాలని విజ్ఞప్తి చేశారు.

# మహిళల పట్ల తప్పుడు భావన.. కడకటాలను లెక్క పెట్టిస్తున్న షీ టీమ్స్




**శేరిలింగంపల్లి, జూలై 10(జనంసాక్షి) :** బహిరంగ ప్రదేశాలలో ఏమాత్రం ఏమరపాటుతో మహిళల పట్ల తప్పుగా వ్యవహరించిన డేగ కన్నుతో వెంటాడుతున్న షీ టీమ్స్ వారి పెడరెక్కలను విరిచి కటకటాల్లోకి నెట్టేస్తున్న వైనం నగర ప్రజల్లో బలంగా నాటుకుపోయింది. ఈ క్రమంలో ఈనెల 3వ తేదీ నుండి 9 వ తేదీ వరకు(వారం రోజుల వ్యవధి) కి సంబంధించిన నివేదికను సైబరాబాద్ మహిళా శిశు సంక్షేమ విభాగం డిసిపి కె. సృజన పర్యవేక్షణలో షీ టీమ్స్ విభాగం అధికారులు శుక్రవారం వెల్లడించారు. సైబరాబాద్ పరిధిలో షీ టీంలు వారం రోజుల వ్యవధిలో మొత్తం 114 ఆకస్మిక దాడులను కొనసాగించి బహిరంగ ప్రదేశాలలో మహిళల పట్ల దురుసుగా, అసభ్యకరంగా వ్యవహరిస్తున్న 33 మంది ఆకతాయిలను రెడ్ హ్యాండెడ్ గా పట్టుకొని న్యాయస్థానం ముందు నిలబెట్టడం జరిగిందన్నారు. చిన్న కేసుల కింద 34 కేసులను నమోదు చేసి మిగిలిన వారికి కౌన్సెలింగ్ ఇచ్చి పంపేయడం జరిగిందని డిసిపి సృజన వివరించారు. ఇందులో భాగంగా వివిధ మార్గాల ద్వారా షీ టీమ్స్ బృందాలకు వారం రోజుల వ్యవధిలో 13 ఫిర్యాదులు అందడం జరిగిందని, మానవ అక్రమ రవాణా నిరోధక విభాగం నిర్వహించిన 'ఆపరేషన్ ముస్కాన్' లో భాగంగా సైబరాబాద్ కమిషనరేట్ పరిధిలో 30 జై జై చట్టం కేసులు, బాల కార్మిక కేసులు నమోదు చేయడం జరిగిందన్నారు. 146 మంది చిన్న పిల్లలను(144 మంది బాలురు, 02 బాలికలు) విజయవంతంగా రక్షించి వాన్ని సురక్షిత గమ్యానికి చేర్చడం జరిగిందని అధికారులు తెలిపారు. కుటుంబ కలహాలతో ఇబ్బంది పడుతున్న 21 కుటుంబాలకు ఫ్యామిలీ కౌన్సిలింగ్ ద్వారా కౌన్సెలింగ్ ఇప్పించి తిరిగి సదర కుటుంబాలను ఒకటి చేయడం జరిగిందన్నారు. ఏహెచ్టియు మరియు షీ టీమ్స్ బృందాలు సైబరాబాద్ లోని వివిధ ప్రాంతాలలో అవగాహన కార్యక్రమాలను సైతం చేపట్టడం జరిగిందని ఇందులో దాదాపు 4500 మంది పాల్గొన్నట్లు తెలిపారు వారందరికీ మానవ అక్రమ రవాణా, ఈవ్ టీజింగ్, సోషల్ మీడియా వేధింపులు, బాల్యవివాహాలు, బాలల హక్కులు, బాల కార్మిక వ్యవస్థ, బిక్షాటన, సైబర్ బుల్లింగ్, సైబర్ మోసాల వంటి అంశాలపై స్పష్టమైన అవగాహనను కల్పించడం జరిగిందన్నారు. మహిళలకు హెల్ప్ లైన్ 181, బాలలకు హెల్ప్ లైన్ 1098, డయల్ 100, 1930 ప్రాముఖ్యతను సైతం సమగ్రంగా వివరించడం జరిగిందన్నారు.

# ప్రశాంతంగా ముగిసిన పోచంపల్లి చేనేత సహకార సంఘం ఎన్నికలు


### 96.73 శాతం పోలింగ్ నమోదు ఫలితాలు వెల్లడి



**భూదాన్ పోచంపల్లి, జూలై 10 (జనం సాక్షి):** భూదాన్ పోచంపల్లి పట్టణ కేంద్రంలో శుక్రవారం నిర్వహించిన చేనేత సహకార సంఘం ఎన్నికలు ప్రశాంతంగా ముగిశాయి. ఎన్నికల అధికారి యూసుఫ్ అలీ ఆధ్వర్యంలో రెండు పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేసి ఉదయం 7 గంటల నుంచి మధ్యాహ్నం 3 గంటల వరకు పోలింగ్ నిర్వహించారు. మొత్తం 644 మంది ఓటర్లలో 623 మంది తమ ఓటు హక్కును వినియోగించుకోవడంతో 96.73 శాతం పోలింగ్ నమోదైనట్లు ఎన్నికల అధికారి తెలిపారు. వృద్ధులు, మహిళలు పెద్ద సంఖ్యలో ఉత్సాహంగా ఓటు వేశారు. ఎలాంటి అవాంఛనీయ ఘటనలు చోటుచేసుకోకుండా పోలింగ్ ప్రశాంతంగా ముగిసిందని అధికారులు వెల్లడించారు. ఈ ఎన్నికల్లో జనరల్ కోటాలో 17 మంది, మహిళల కోటాలో 4 మంది అభ్యర్థులు పోటీ చేశారు. జనరల్ కోటాలో గంజి అంజయ్య, కడవేరు చంద్రమౌళి, కర్నాటి ధనంజయ్, కోడి బిక్షపతి, గంజి బసవలింగం, చిలువేరు గోవర్ధన్, జోగు లక్ష్మీనారాయణ, తుమ్మ లక్ష్మీనారాయణ, భారత భూషణ్, భారత లవకుమార్, భారత వాసుదేవ్, భోగ బాల నరసింహ, మస్న రాములు, సీతా కృష్ణ, సీత శ్రీశైలం, సీత సత్యనారాయణ, సూరెపల్లి శ్రీనివాస్ బరిలో నిలిచారు. మహిళల కోటాలో పగడాల బుచ్చమ్మ, పాలాది జ్యోతి, భారత భారతమ్మ, మహేశ్వరం నాగమణి పోటీ చేశారు. ఎన్నికల్లో విజేతలుగా నిలిచిన వారు జనరల్ కోటాలో భారత లవకుమార్, కడవేరు చంద్రమౌళి, సూరెపల్లి శ్రీనివాస్, గంజి బసవలింగం, సీత శ్రీశైలం, కోడి బిక్షపతి, భారత వాసుదేవ్. మహిళల కోటా పాలాది జ్యోతి యాదగిరి, మహేశ్వరం నాగమణి విజయం సాధించారు. విజేతలకు సహకార సంఘ సభ్యులు, చేనేత కార్మికులు, అభిమానులు శుభాకాంక్షలు తెలియజేశారు.

# మీరు సర్ జాబితాలో లేకపోతే.. శాశ్వతంగా లేనట్టే!

### ఓటు నమోదు చేసుకోవాలంటే అనేక తిప్పలు తప్పవు



చేవెళ్ల, జూలై 10 (జనంసాక్షి) : కేంద్ర ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు రాష్ట్ర ఎన్నికల సంఘం విసి సుదర్శన్ రెడ్డి తెలంగాణ రాష్ట్రంలోని వివిధ జిల్లా కలెక్టర్లతో సర్ పై సమీక్ష నిర్వహించారు. రాష్ట్రంలోని వివిధ జిల్లాలతో పోల్చితే హైదరాబాద్ మేడ్చల్ రంగారెడ్డి సంగారెడ్డి జిల్లాలో ఎన్యుమరేషన్ ఫామ్స్ పూర్తిస్థాయిలో డిస్ట్రిబ్యూషన్ జరగలేదు. ఈ కారణంగా వివిధ శాఖలకు చెందిన ప్రభుత్వ ఉద్యోగులు శనివారం ఆదివారం సర్లో పాల్గొని 50% ఎన్యుమరేషన్ ఫామ్స్ డిస్ట్రిబ్యూషన్ చేయాలని ఆదేశించారు. ఇందులో పంచాయతీరాజ్ సిబ్బంది, బిఎల్వోలు, ఉపాధ్యాయులు, అంగన్వాడీ టీచర్స్, ఫీల్డ్ అసిస్టెంట్ తో పాటు సామాజిక బాధ్యతగా విద్యావంతులు స్టూడెంట్స్ సర్లో పాల్గొనాలని జిల్లా కలెక్టర్ నిర్వహించిన జూమ్ మీటింగ్లో ప్రభుత్వ అధికారాలకు ఆదేశాలు జారీ చేశారు. ఈ నేపథ్యంలో చేవెళ్ల ఆర్డివో పార్థసింహారెడ్డి, తహసిల్దార్ కృష్ణయ్య స్థానిక ఆర్డీవో కార్యాలయంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో వెల్లడించారు.
ఈ సందర్భంగా ఆర్డీవో మాట్లాడుతూ.. ఎన్యుమరేషన్ ఫామ్ ఫిల్ చేయడానికి విద్యావంతులు విద్యార్థులు ఓటర్లకు సహకరించాలన్నారు.
నియోజకవర్గంలో ఇప్పటి వరకు 32% ఆన్లైన్ నమోదు ప్రక్రియ పూర్తి చేశామని, శనివారం ఆదివారం రెండు రోజుల్లో 50 శాతం పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ వివిధ ప్రభుత్వ శాఖలకు ఆదేశించారని చెప్పారు. ఎస్ఐఆర్ లో గనుక ఓటు మిస్ అయితే మళ్లీ ఓటు హక్కు పొందడానికి స్థానిక నిరూపణ కోసం అనే రకాల ధ్రువీకరణ పత్రాలు అందజేయాల్సిన పరిస్థితి ఏర్పడుతుందన్నారు. ఎన్యుమరేషన్ ఫామ్స్ లేకుంటే ఎపిక్ నెంబర్ సంబంధిత తాసిల్దార్ కు పంపితే మరో ఫామ్ ఇస్తామని వెల్లడించారు. సర్ నిర్వహణకు అన్ని రాజకీయ పార్టీలు సంయుక్తంగా సహకరించాలని ఆర్డీవో తెలిపారు.



## ఆయిల్ పామ్ సాగుతో కోతుల బెడద ఉండదు

### ప్రతి గ్రామంలో కనీసం వంద ఎకరాల్లో సాగు చేయాలి

- రైతులకు మంత్రి పొన్నం ప్రభాకర్ సూచన

**సిద్దిపేట, జూలై10 (జనంసాక్షి) :** ఆయిల్ పామ్ డిమాండ్‌కి తగ్గ ఉత్పత్తి లేదని.. రైతులు ఆ సాగు వైపు మొగ్గు చూపాలని, సాగుతో కోతుల బెడద ఉండదని మంత్రి పొన్నం ప్రభాకర్ కోరారు. ఆయిల్ పామ్ సాగు ద్వారా కోతుల బెడద ఉండదని.. వాతావరణ మార్పుల ఇబ్బంది ఉండదని చెప్పుకొచ్చారు.నర్మెటలో ఆయిల్ పామ్ ఫ్యాక్టరీని సీఎం రేవంత్ రెడ్డి ప్రారంభించినట్లు తెలిపారు. జిల్లాలో 50 వేల ఎకరాలు ఆయిల్ పామ్ సాగు చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నామని.. ఇప్పుడు 14 వేల ఎకరాలకు పైగా సాగు జరుగుతోందని మంత్రి తెలిపారు. ఆయిల్ పామ్ సాగు పెంచడానికి 5 ఎకరాలపైన ఉన్న రైతులతో సమావేశం ఏర్పాటు చేశామని మంత్రి పొన్నం ప్రభాకర్ తెలిపారు. శుక్రవారం హుస్నాబాద్ నియోజకవర్గం అక్కన్నపేట మండలం జనగామ గ్రామంలో మెగా పామ్ ఆయిల్ ప్లాంటేషన్ కార్యక్రమంలో భాగంగా మంత్రులు పొన్నం ప్రభాకర్, వివేక్ వెంకటస్వామి ఆయిల్ పామ్ మొక్కలు నాటారు. అనంతరం మంత్రి పొన్నం మాట్లాడుతూ.. ఒక్కో చిన్న గ్రామంలో 100 ఎకరాల ఆయిల్ పామ్ సాగు దాటిస్తే రూ.5 లక్షలు, పెద్ద గ్రామాల్లో 200 ఎకరాలపైన సాగు ప్రోత్సహిస్తే రూ.10 లక్షల అభివృద్ధి ప్రోత్సాహకాలు అందిస్తామని వెల్లడించారు. దేశానికి ఆయిల్ పామ్ అత్యవసరమని మంత్రి వివేక్ వెంకట స్వామి అన్నారు. ఇరాన్ యుద్ధం వల్ల ధరలు పెరుగుతున్నాయని.. ఆయిల్ పామ్ దిగుమతి చేసుకుంటే ఇబ్బందులు తప్పవని.. అందుకోసం సొంతంగా ఉత్పత్తి పెంచాలని కోరారు. గత సంవత్సరం కాళేశ్వరం ప్రాజెక్ట్ లేనప్పటికీ 25 శాతం అదనంగా వడ్లు కొనుగోలు చేయడం జరిగిందని చెప్పారు. ఆయిల్ పామ్‌కు పెద్దగా నీళ్లు అవసరం లేదన్నారు. చెన్నూరులో కూడా ఆయిల్ పామ్ సాగు వైపు చూస్తున్నారన్నారు '100 ఎకరాల్లో ఆయిల్ పామ్ సాగు చేసిన గ్రామాల్లో మంత్రి పొన్నం ప్రభాకర్ రూ.5 లక్షలు ప్రోత్సాహకం ఇస్తే.. జిల్లా ఇన్‌ఛార్జి మంత్రిగా నేను కూడా రూ.5 లక్షలు ఇస్తాను' అని మంత్రి వివేక్ ప్రకటించారు.

# అధిష్టానానికి కొండా తలపోటు!

### కడియం వర్సెస్ కొండా సురేఖ.. పీసీసీ వద్దకు చేరిన పంచాయతీ

- కొండా సురేఖ తీరుపై ప్రజల్లో అసంతృప్తి!
- వరంగల్ జిల్లాలో హాట్ టాపిక్



**వరంగల్ బ్యూరో, జూలై 10 (జనం సాక్షి) :** ఉమ్మడి వరంగల్ జిల్లా కాంగ్రెస్ రాజకీయాల్లో మంత్రి కొండా సురేఖ, స్టేషన్ ఘన్‌పూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరి మధ్య వైరం మరోసారి బహిర్గతమైంది. దేవాదాయ శాఖ కార్యాలయంలో ఆలయాల అభివృద్ధిపై కడియం శ్రీహరి అధికారులతో సమావేశం నిర్వహించడమే ఈసారి వివాదానికి కేంద్ర బిందువైంది. తనకు ఎలాంటి సమాచారం ఇవ్వకుండా దేవాదాయ శాఖ డైరెక్టర్‌తో పాటు అధికారులతో కడియం శ్రీహరి సమావేశమై, ఆలయాల నిధులు, మాస్టర్ ప్లాన్లు, భూముల పరిరక్షణ తదితర అంశాలపై సమీక్ష నిర్వహించడం 'రూల్స్ ఆఫ్ బిజినెస్' స్ఫూర్తిని ఉల్లంఘించడమేనని మంత్రి కొండా సురేఖ పేర్కొన్నారు. ఈ మేరకు ఆమె ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి మూడు పేజీల లిఖితపూర్వక ఫిర్యాదు లేఖ పంపారు. అందులో సంబంధిత వార్తా కథనాలు, వీడియో క్లిప్పింగులను కూడా జతచేశారు. ఈ అంశంపై ఏఐసీసీకి కూడా ఆమె ఫిర్యాదు చేసినట్లు సమాచారం.

#### వ్యక్తిగత కోణం జోడించిన కొండా

సాధారణ ప్రోటోకాల్ వివాదానికే పరిమితం కాకుండా, కడియం శ్రీహరి తనను రాజకీయంగా ఇబ్బందుల్లో పెట్టేందుకు ప్రయత్నిస్తున్నారని కొండా సురేఖ ఆరోపించారు. అంతేకాకుండా, తనపై కడియం చేస్తున్న వ్యాఖ్యలు, వ్యవహార శైలి ఒక బీసీ మహిళగా తనను అవమానించే విధంగా ఉన్నాయని ఆమె ఆవేదన వ్యక్తం చేశారు. దీంతో ఈ వివాదం అధికార పరిధి అంశాన్ని దాటి సామాజిక కోణాన్ని కూడా సంతరించుకుంది. అంతటితో ఆగకుండా, తన నిరసనను తెలియజేస్తూ ప్రజాభవన్‌లో జరిగిన కీలక పవర్ పాయింట్ ప్రజెంటేషన్ కార్యక్రమానికి కూడా కొండా సురేఖ హాజరు కాలేదని సమాచారం.

#### కడియం ఘాటు కౌంటర్

కడియం శ్రీహరి మాత్రం వెనక్కి తగ్గే సూచనలు కనిపించడం లేదు. ఎమ్మెల్యే అధికారులతో మాట్లాడకూడదని చెప్పే మంత్రిని తాను తొలిసారి చూస్తున్నానని వ్యాఖ్యానించారు. ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలకు ప్రత్యేక అధికార పరిధులు ఉండవని, ప్రజా సమస్యలపై ఎవరితోనైనా మాట్లాడే హక్కు తనకు ఉందని స్పష్టం చేశారు. అభివృద్ధిని పట్టించుకోని వారు, ప్రజల్లో లేని వారే ఇలాంటి వివాదాలు సృష్టించి వార్తల్లో నిలవాలని చూస్తున్నారని పరోక్షంగా కొండా సురేఖపై విమర్శలు గుప్పించారు.

#### ఇది తొలిసారి కాదు

ఈ ఇద్దరు నేతల మధ్య విభేదాలు కొత్తవి కావు. ఆలయాలు, భూముల అంశాల్లో గతంలోనూ పలుమార్లు ఉద్రిక్తతలు చోటుచేసుకున్నాయి. ఇటీవల కడియం శ్రీహరి మనవరాలి హాఫ్‌సారీ వేడుకకు కొండా సురేఖ హాజరై కలిసి ఫొటోలు దిగడంతో వివాదం సమసిపోయిందని భావించినప్పటికీ, అది కొద్దికాలానికే మళ్లీ తెరపైకి వచ్చింది.

#### హైకమాండ్‌కు తలనొప్పి

ఈ అంతర్గత పోరు కాంగ్రెస్ పార్టీకి ఇబ్బందికరంగా మారింది. సీనియర్ నేతపై అధిష్టానం చర్యలు తీసుకుంటుందా లేదా అన్నది ఆసక్తికరంగా మారింది. ఈ వివాదం ప్రతిపక్షాలకు రాజకీయ అస్త్రంగా మారిందని రాజకీయ విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు. పార్టీ అంతర్గత విభేదాలు బహిర్గతం కాకుండా చూడాలని, మంత్రుల అధికార పరిధిని అందరూ గౌరవించాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అనధికారికంగా సూచించినట్లు సమాచారం. అయితే దీనిపై అధికారిక ప్రకటన వెలువడలేదు. మొత్తంగా, ఆలయాల సమీక్షతో ప్రారంభమైన ఈ వివాదం ఇప్పుడు ప్రోటోకాల్ అంశాన్ని దాటి ఉమ్మడి వరంగల్ జిల్లా కాంగ్రెస్‌లో రాజకీయ ఆధిపత్య పోరుకు ప్రతీకగా మారింది. ఈ వ్యవహారంపై పార్టీ అధిష్టానం ఎలాంటి నిర్ణయం తీసుకుంటుందనేది ఆసక్తికరంగా మారింది. ఇదిలా ఉండగా వరంగల్ తూర్పు నియోజకవర్గంలో కొండా సురేఖ చేసిన ఆరోపణలు, లేఖల వల్ల ప్రజలు ఆమె తీరుపై కొంత అసంతృప్తిగా ఉన్నట్లు సమాచారం. ఒక నియోజకవర్గ ఎమ్మెల్యే తన పరిధిలో ఉన్నటువంటి అభివృద్ధి కార్యక్రమాలతో పాటు, ప్రజల సమస్యలను ఆయా సంబంధిత శాఖలకు విన్నవించేటువంటి హక్కు ఉందని, దానిని తప్పట్టి తన శాఖలోకి వచ్చి సమీక్షలు నిర్వహించాడు అనే మంత్రి కొండా సురేఖ ఆరోపణలపై ప్రజలు అసంతృప్తిగా ఉన్నట్లు తెలుస్తోంది. కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడినప్పటి నుండి రాష్ట్రంలో కొండా సురేఖ ప్రతి అంశం లోను వివాదాస్పదంగా మారిందనే అభిప్రాయం ప్రజల్లో నెలకొంది. తాను మాట్లాడే విషయంలో ఏదైనా వివాదాస్పదం అవుతుందనే విషయం గ్రహించి, ఏదైనా లేఖలు రాసేముందు ఆచితూచి వ్యవహరించాలని అభిప్రాయం ప్రజల్లో కలుగుతుంది. ముందు ముందు ఎలా ఉంటుందో వేచి చూడాల్సి ఉంది. వరంగల్ తూర్పు నియోజకవర్గం లో కాంగ్రెస్ పార్టీ ఇలాంటి వ్యవహారాల వల్ల దిగజారి పోతుందనే అభిప్రాయం ప్రజల్లో కలుగుతుంది.

## బస్సు ఎత్తుకెళ్లిన తాగుబోతు

### టోల్‌గేట్ వద్ద అదుపుతప్పి సిమెంట్ దిమ్మెను ఢీకొన్న బస్సు




**జనగామ, జూలై10 (జనంసాక్షి) :** జనగామ జిల్లాలో మద్యం మత్తులో ఓ వ్యక్తి చేసిన నిర్వాకం కలకలం రేపింది. జనగామ ఆర్టీసీ బస్టాండ్‌లో నిలిపి ఉంచిన అద్దె బస్సును ఎవరికి తెలియకుండా స్టార్ట్ చేసి తీసుకెళ్లాడు. సుమారు 21 కిలోమీటర్లు బస్సును నడిపించి చివరకు ప్రమాదానికి గురయ్యాడు. ఈ ఘటనతో ప్రయాణికులు, స్థానికులు తీవ్ర భయాందోళనకు గురయ్యారు. పోలీసుల వివరాల ప్రకారం.. ఆర్టీసీ అద్దె బస్సు డ్రైవర్ వాహనంలోనే తాళాలు వదిలేసి ఇంటికి వెళ్లాడు. ఇదే అవకాశంగా భావించిన పాలకుర్తి మండలం చెన్నూరుకు చెందిన డోజర్ డ్రైవర్ జిట్టబోయిన వెంకన్న మద్యం మత్తులో బస్సును స్టార్ట్ చేసి అక్కడి నుంచి సూర్యాపేట వైపు తీసుకెళ్లాడు. జనగామ నుంచి బస్సును నడిపిస్తూ వెళ్లిన వెంకన్న, దేవరుప్పుల మండలం సింగరాజుపల్లి టోల్‌గేట్ సమీపానికి చేరుకున్నాడు. అక్కడ బస్సు అదుపు తప్పి సిమెంట్ దిమ్మెను ఢీకొట్టింది. ప్రమాదాన్ని గమనించిన టోల్‌గేట్ సిబ్బంది అనుమానంతో వెంటనే దేవరుప్పుల పోలీసులకు సమాచారం అందించారు. సమాచారం అందుకున్న దేవరుప్పుల పోలీసులు వెంటనే ఘటనాస్థలికి చేరుకుని నిందితుడు వెంకన్నను బస్సుతో సహా అదుపులోకి తీసుకున్నారు. ఆ తర్వాత అతడిని జనగామ పోలీసులకు అప్పగించారు. అద్దె బస్సు యజమాని గంట గోపికృష్ణారెడ్డి ఫిర్యాదు మేరకు జనగామ సీఐ సత్యనారాయణరెడ్డి కేసు నమోదు చేశారు. నిందితుడు మద్యం మత్తులోనే బస్సును ఎత్తుకెళ్లాడా.? ఘటనకు దారితీసిన పూర్తి పరిస్థితులు ఏంటనే అంశాలపై పోలీసులు దర్యాప్తు కొనసాగిస్తున్నారు.

# సర్కారు బడి పిల్లలు.. సజీవ సమాధి కావొద్దు సారూ!



### చాలాకాలంగా శిథిలావస్థలో ఉన్నా పట్టించుకోరా..?

- వేరే ఇతర భవంతినైనా కేటాయించండి
- నార్లాపూర్ ప్రాథమిక పాఠశాలలో తప్పిన పెను ముప్పు
- పైకప్పు పెచ్చులు ఊడి తృటిలో తప్పిన ఘోర ప్రమాదం



**నాగర్ కర్నూల్ జిల్లా బ్యూరో, జూలై 10 (జనంసాక్షి) :** నాగర్‌కర్నూల్ జిల్లా కొల్లాపూర్ మండలంలోని నార్లాపూర్ ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల భవనం అత్యంత ప్రమాదకర స్థితికి చేరుకుని విద్యార్థుల ప్రాణాలకు ముప్పుగా మారింది. శుక్రవారం ఉదయం ప్రార్థన కార్యక్రమం ముగించుకుని విద్యార్థులు ఉత్సాహంగా తమ తమ తరగతి గదుల్లోకి ప్రవేశించిన కొద్దిసేపటికే పెద్ద ప్రమాదం తృటిలో తప్పింది. నాలుగో తరగతి గదిలో బ్లాక్‌బోర్డు ఎదురుగా ఉన్న పైకప్పు స్లాబ్ నుంచి ఒక్కసారిగా భారీ పెచ్చులు ఊడి కింద పడిపోయాయి. ఆ సమయంలో విద్యార్థులు అప్రమత్తంగా పక్కకు జరగడంతో ఎలాంటి ప్రాణనష్టం జరగలేదు. లేకపోతే ఘోర విషాదం సంభవించేదని గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

నార్లాపూర్ ప్రాథమిక పాఠశాలలో ఐదో తరగతి వరకు తరగతులు నిర్వహిస్తున్నారు. అయితే పాఠశాల భవనం చాలా కాలంగా శిథిలావస్థలో ఉంది. గోడలు నెర్రెలు ఇచ్చి, పైకప్పు ఎప్పుడు కూలిపోతుందో తెలియని పరిస్థితి నెలకొంది. పాఠశాల గోడకు రావిచెట్టు మొలిచి, దాని వేర్లు గోడలలోకి చొచ్చుకుపోవడంతో నిర్మాణం బలహీనపడి నట్లు ఉపాధ్యాయులు తెలిపారు. ఇటీవలి రోజులుగా కురుస్తున్న వర్షాల కారణంగా భవనం మరింత ప్రమాదకరంగా మారిందని వారు చెబుతున్నారు. పైకప్పు పెచ్చులు ఊడిపడిన ఘటనతో విద్యార్థులు, ఉపాధ్యా యులు తీవ్ర భయాందోళనకు గురయ్యారు.

#### రోజూ భయం భయంగానే..

పాఠశాల భవనం దుస్థితిపై ఉపాధ్యా యులు, గ్రామ పెద్దలు, తల్లిదండ్రులు పలుమార్లు విద్యాశాఖ అధికారులు, మండల అధికారులు, ప్రజాప్రతినిధులకు విన్నవించినప్పటికీ ఇప్పటివరకు ఎలాంటి చర్యలు తీసుకోలేదని గ్రామస్తులు ఆరోపిస్తున్నారు. కనీసం భవనాన్ని పరిశీలించేందుకు కూడా అధికారులు ముందుకు రాకపోవడం విద్యార్థుల భద్రత పట్ల ఉన్న నిర్లక్ష్యానికి నిదర్శనమని వారు మండిపడ్డారు. దీంతో చదువుకోవడానికి పాఠశాలకు వచ్చే పసిప్రాయం గల విద్యార్థుల ప్రాణాల కంటే ముఖ్యమైనది మరేదీ లేదు. రోజూ భయభ్రాంతులతో తరగతులు నిర్వహించాల్సిన పరిస్థితి ఏర్పడింది. మరోసారి పైకప్పు కూలిపోతే తీవ్ర ప్రమాదం జరిగే అవకాశం ఉంది" అని ఉపాధ్యాయులు ఆందోళన వ్యక్తం చేశారు.

#### ఘటనాస్థలాన్ని సందర్శించిన ఎంఈఓ

ఘటన సమాచారం అందుకున్న కొల్లాపూర్ మండల విద్యాధికారి (ఎంఈఓ) ఇమాన్యుయల్ నార్లాపూర్ ప్రాథమిక పాఠశాలను సందర్శించారు. తరగతి గదిని పరిశీలించి ఉపాధ్యాయులను వివరాలు అడిగి తెలుసుకున్నారు. అనంతరం జరిగిన ఘటనపై ఉన్నతాధికారులకు నివేదించి తగిన చర్యలు తీసుకునేలా చూస్తామని తెలిపారు. మరో ప్రమాదం జరగకముందే అధికారులు తక్షణ చర్యలు చేపట్టాలని, ప్రమాదకరమైన తరగతి గదులను వెంటనే వినియోగం నుంచి నిలిపివేయాలని, విద్యార్థులకు తాత్కా లికంగా సురక్షితమైన ప్రత్యామ్నాయ వసతి కల్పించాలి. నూతన పాఠశాల భవనాన్ని అత్యవసరంగా నిర్మించాలని, విద్యార్థులకు భద్రమైన విద్యా వాతావరణం కల్పించాలని గ్రామస్తులు డిమాండ్ చేస్తున్నారు.



# మెడికల్ ఎక్విప్‌మెంట్ కొనుగోళ్లకు కొత్త విధానం

### పారదర్శకతకు ప్రాధాన్యత

- ప్రతిపాదనలు సిద్ధం చేయాలి
- మంత్రి దామోదర్ రాజనర్సింహ ఆదేశాలు



**హైదరాబాద్ (జనంసాక్షి) :** ప్రభుత్వ హాస్పిటళ్లకు క్వాలిటీ మెడికల్ ఎక్విప్‌మెంట్‌ను వేగంగా, పారదర్శకంగా అందించేందుకు ప్రొక్యూర్‌మెంట్ వ్యవస్థను మరింత బలోపేతం చేయాలని ఆరోగ్య శాఖ మంత్రి దామోదర్ రాజనర్సింహ టీజీఎంఎస్ఐడీసీ అధికారులను ఆదేశించారు. కోటిలోని టీజీఎంఎస్ఐడీసీ ఆఫీసులో శుక్రవారం నిర్వహించిన రివ్యూ మీటింగ్‌లో మెడికల్ ఎక్విప్‌మెంట్ ప్రొక్యూర్‌మెంట్, టెండర్ ప్రాసెస్, ఎక్విప్‌మెంట్ వర్కింగ్ స్టేటస్, మెయింటెనెన్స్ తదితర అంశాలపై మంత్రి సమీక్ష నిర్వహించారు. ప్రభుత్వ హాస్పిటళ్లలో ఏర్పాటు చేసే ప్రతి మెడికల్ ఎక్విప్‌మెంట్ క్వాలిటీదిగా ఉండటంతో పాటు నిర్ణీత సమయంలో అందుబాటులోకి రావాలని మంత్రి స్పష్టం చేశారు. పారదర్శక, డిజిటలైజేషన్‌కు ప్రాధాన్యతను ఇస్తూ నూతన విధానానికి అవసరమైన ప్రతిపాదనలు సిద్ధం చేయాలని అధికారులను ఆదేశిం చారు. భవిష్యత్తులో అన్ని కొనుగోళ్లు ఒకే విధమైన ప్రామాణిక విధానాల ప్రకారం జరిగేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. ప్రొక్యూ ర్‌మెంట్ ప్రక్రియను పూర్తిగా డిజిటలైజ్ చేయాలని మంత్రి ఆదేశించారు. కొనుగోళ్ల కోసం ఎండ్-టు-ఎండ్ డిజిటల్ టూల్‌ను త్వరితగతిన అమల్లోకి తీసుకువచ్చి, ఇండెంట్ నుంచి హాస్పిటల్‌లో ఇన్‌స్టాలేషన్ వరకు ప్రతి దశను ఆన్‌లైన్‌లో ట్రాక్ చేసే విధంగా వ్యవస్థను రూపొందించాలని సూచించారు. దీంతో ప్రొక్యూర్‌మెంట్ ప్రక్రియలో పారదర్శకత, జవాబుదారీతనం, సామర్థ్యం మరింత పెరుగుతాయని పేర్కొన్నారు. హాస్పిటళ్లలో ఏర్పాటు చేసిన మెడికల్ ఎక్విప్‌మెంట్ నిరంతరం పనిచేసేలా పటిష్టమైన మానిటరింగ్ వ్యవస్థను ఏర్పాటు చేయాలని మంత్రి ఆదేశించారు. రాష్ట్రంలోని అన్ని ప్రభుత్వ హాస్పిటళ్లలోని ఎక్విప్‌మెంట్ పనితీరును పర్యవేక్షించేందుకు సెంట్రలైజ్డ్ డ్యాష్‌బోర్డ్ ఏర్పాటు చేయాలని సూచించారు. ప్రతి పదిహేను రోజులకు ఒకసారి ఈ డ్యాష్‌బోర్డ్‌ను సీనియర్ మేనేజ్‌మెంట్ స్థాయిలో సమీక్షించి వెంటనే అవసరమైన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.

ప్రస్తుతం అమలులో ఉన్న సీఎఎంసీ (కాంప్రహెన్సివ్ యాన్యువల్ మెయింటనెన్స్ కాంట్రాక్ట్) అగ్రిమెంట్లను సమీక్షించి, సర్వీస్ లెవల్ అగ్రిమెంట్స్ పాటించని వెండర్లపై కఠినమైన పెనాల్టీలు విధించేలా నిబంధనలను సవరించాలని మంత్రి సూచించారు. ఎక్విప్‌మెంట్ మెయింటెనెన్స్‌లో నిర్లక్ష్యానికి తావు లేకుండా చూడాలని స్పష్టం చేశారు. రాష్ట్రవ్యాప్తంగా మెడికల్ ఎక్విప్‌మెంట్ పనితీరును క్షేత్రస్థాయిలో పర్యవేక్షించేందుకు ఎనిమిది మంది బయోమెడికల్ ఇంజినీర్లను నియమించాలని మంత్రి ఆదేశించారు. హైదరాబాద్ రీజియన్‌కు నలుగురు, ఈస్ట్, వెస్ట్, సౌత్, నార్త్ జోన్లకు ఒక్కొక్కరిని నియమించి ఎక్విప్‌మెంట్ మానిటరింగ్‌ను మరింత బలోపేతం చేయాలని సూచించారు. ఈ సమావేశంలో టీజీఎంఎస్ఐడీసీ మేనేజింగ్ డైరెక్టర్ గౌరవ్ ఉప్పల్, మెడికల్ ఎడ్యుకేషన్ డైరెక్టర్ నరేంద్ర కుమార్, పబ్లిక్ హెల్త్ డైరెక్టర్ రవీంద్ర నాయక్‌తో పాటు టీజీఎంఎస్ఐడీసీలోని వివిధ విభాగాల ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

## కరూరు బాధిత కుటుంబాలకు ఉద్యోగాలు

### విజయ్ ప్రభుత్వానికి గ్రీన్‌సిగ్నల్ ఇచ్చిన హైకోర్టు



**చెన్నై, జూలై10 (జనంసాక్షి) :** విజయ్ ప్రభుత్వానికి మద్రాస్ హైకోర్టులో భారీ ఊరట లభించింది. కరూర్ తొక్కిసలాట బాధితుల కుటుంబాలకు ఉద్యోగ పత్రాల పంపిణీకి కోర్టు గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. ప్రభుత్వ నియామక పక్రియను ముందుకు తీసుకెళ్లవచ్చని కోర్టు స్పష్టం చేసింది. ఉద్యోగ నియామకాలు కేవలం 'తాత్కాలికం' మాత్రమేనని న్యాయస్థానం మెలిక పెట్టింది. భవిష్యత్తులో తుది తీర్పుకు లోబడి ఈ నియామకాలు ఉంటాయని స్పష్టం చేసింది. జస్టిస్ సీవీ కార్తికేయన్, జస్టిస్ ఆర్ శక్తివేల్‌లతో కూడిన హైకోర్టు ధర్మాసనం ఈ పిటిషన్‌పై శుక్రవారం విచారణ జరిపింది. విచారణ సందర్భంగా ధర్మాసనం.. ప్రభుత్వం ఈ ఉద్యోగాలు ఇవ్వడానికి అనుసరించిన మార్గదర్శకాలు ఏమిటి?.. బాధితుల కుటుంబాలకు ఆ అర్హతలు ఉన్నాయా లేదా? అనే విషయాలపై పూర్తి వివరాలతో కూడిన నివేదికను సమర్పించాలని తమిళనాడు ప్రభుత్వాన్ని ఆదేశించింది. ఎలాంటి స్పష్టమైన పాలసీ లేకుండా.. విపత్తు బాధితులకు ఉద్యోగాలు కేటాయించడం రాజ్యాంగంలోని ఆర్టికల్ 14, 16 (సమానత్వ హక్కు) పరిధిలోకి వస్తుందో లేదో సమీక్షిస్తామని పేర్కొంది. కాగా, బాధితుల కుటుంబాలకు శుక్రవారం మధ్యాహ్నం 3 గంటలకు సీఎం విజయ్ నియామక పత్రాలు అందజేయనున్నారు. అయితే, ఈ కేసును కోర్టు మళ్లీ విచారించే వరకు లబ్దిదారులకు మొదటి నెల జీతం చెల్లించకూడదని ధర్మాసనం స్పష్టం చేసింది. ఈ కేసు తదుపరి విచారణను జూలై 21కి వాయిదా వేసింది.

Printed, Published and Owned by M.M.RAHMAN Printed at M/s. Manair Enterprises, Plot No. 16E/4, IDA, Kattedan, Ranga Reddy Dist, Telangana - 500077, Published at Flat No. 301, 8-2-273, 276 & 277, 3rd Floor,Pavani Estate, Indradhanush Complex,Road No. 2, Banjara Hills,Hyderabad – 500034, Telangana, Editor : M.M.RAHMAN RNI No. APTEL/2013/50370